ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్




# యుగశక్తి  గాయత్రి




ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 18 - సంచిక 04
సెప్టెంబర్ 2013

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**


## విస్మృతి

వస్తువులు తయారు చేసేవాడికి తాను తయారు చేసిన వస్తువులపై ప్రేమ ఉంటుంది. మనం ఇల్లు కట్టుకుంటాం, పూల చెట్లు నాటుతుంటాము. బొమ్మలు వేస్తుంటాము, రచనలు చేస్తుంటాము వీటి మీద మనకు ఇష్టం ఉండటం ఒక సహజమైన ప్రక్రియ. సృష్టికర్త మనలను తయారుచేశాడు, మనలను పెంచి పోషిస్తున్నాడు. మన భవిష్యత్తు యొక్క పూర్తి బాధ్యత ఆయన భుజస్కంధాలపై ఉన్నది. ఇలాంటి స్థితిలో మనపై ఆయనకు ప్రేమ ఉండటమనేది అనుగ్రహము కాదు, సంయోగం కాదు. అది ఒక సహజమైన పద్ధతి.

మనం పరమేశ్వరుని సంతానం. అతనిని ప్రాణధారిగా భావించినా, అతనిని సర్వశ్రేష్టునిగా అర్థం చేసుకోవాలి. అలా కాకపోయినట్లయితే మనిషివంటి సాధనా సంపన్నుని జన్మ ఎలా సాధ్యమవుతుంది? తన పిల్లలు ఇష్టం వచ్చినట్లు తిరగటానికి ఏ తండ్రి ఒప్పుకోడు. మరి పరమాత్మ మన నుంచి ముఖం ఎలా త్రిప్పుకుంటాడు. సంతానాన్ని ప్రేమించడం సృష్టి యొక్క నియమం అయినప్పుడు పరమేశ్వరుని ప్రేమ అతని సర్వోత్తమ సృష్టి అయిన మనుష్యునిపై ఎందుకు ఉండదు? ఆస్తికత – ఈశ్వరునిపై నిష్ఠల తత్వదర్శనం ఇదే. ఆ పరబ్రహ్మ సృష్టిలో, ఆ విరాట్ పరివారంలో మనం కూడా భాగమని మరచి పోతుంటాము. మానవుల సంరక్షణ, యోగక్షేమములు పూర్తి బాధ్యత ఆయన భుజ స్కంధములపై ఉన్నది. ఇది మరచిపోవడం వలన మనలను మనమే గుర్తించలేకపోతున్నాము. ఉన్నతి నుండి, ఆనందం నుండి వంచింపబడుతున్నాము. పరమాత్మ యొక్క ప్రేమను గుర్తుంచుకున్నట్లయితే, ఆయనతో సంబంధం పెంచుకుంటే, మన జీవన పతంగాన్ని ఆయన చక్కగా ఎగురవేస్తాడు. భ్రాంతి వలన మనకు అజ్ఞానాంధకారంలో తిరగటం హాయిగా ఉన్నది కానీ అందువలన లేమి, ఆత్మహీనత మనను సతాయిస్తుంటాయి. మనలో వివేకం జాగృతమయితే జ్ఞాన ప్రకాశం లభిస్తుంది, జీవనానికి సార్థకత ఇస్తుంది. అప్పుడు ప్రతిక్షణం ఆ పరమాత్మ యొక్క వ్యవస్థను చక్కగా తీర్చిదిద్దేందుకు వినియోగించుకోవచ్చు.

*– అఖండజ్యోతి, మే 1984*

*అనువాదం: వినపాముల అరుణా సీతారాం*

**ఆప్యాయతతోనే దాంపత్య జీవితం సుసంపన్నమవుతుంది**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** విస్మృతి 1

2. **విషయసూచిక-సద్గురు వాణి :** సచ్చరిత్రత 2

3. **వేదమంత్రం :** ధర్మతంత్రం రాజ్యతంత్రాన్ని నిర్దేశించాలి 3

4. **గాయత్రీ విద్య - 36 :** స్వర యోగం-6 4

5. **గాయత్రీ చిత్రావళి - 15 :** శారీరిక (కాయ) కష్టముల నివృత్తి 7

6. **వినాయక చవితి ప్రత్యేకం :** అభీష్టసిద్ధి కొరకు గణపతి పూజ 8

7. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 15 :** సద్గురువు సాక్షాత్కరించిన సుముహూర్తం-3 10

8. **కఠోపనిషత్తు-8 :** ప్రథమ అధ్యాయం-ప్రథమ వల్లీ 14

9. **మస్తిష్కమే కల్పవృక్షం - 9 :** సుఖ దుఃఖాలు మానసిక స్థితిపై ఆధారపడి ఉంటాయి 17

10. **కుండలినీ మహావిజ్ఞానం :** కుండలినీ సాధన ఎందుకు? ఏ ప్రయోజనం కొరకు? 19

11. **యుగనిర్మాణ యోజన :** మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 8 22

12. **వ్యక్తి నిర్మాణం :** దేవమానవులుగా తయారవండి 25

13. **ఆదిశక్తి యొక్క లీలా కథలు - 39 :** సాధకుని జీవితంలో ఎదురయ్యే ఒకే ఒక్క అవరోధం-మోహం 28

14. **మనం - మన ఆరోగ్యం :** ఆరోగ్యానికి మూడు రక్షణ గోడలు 31

15. **మానవునికి పరాజయం లేదు** 33

16. **సమయదానం-వానప్రస్థం - 2 :** వర్ణాశ్రమ ధర్మం యొక్క మహత్వపూర్ణమైన భూమిక 35

17. **పూజ్య గురుదేవుల అమృతవాణి :** గాయత్రియే కామధేనువు-3 37

18. **నా వారితో నా మాట :** సామూహిక గాయత్రీ సాధన 40

19. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం) :** సత్సాహస - సంఘర్షణ ప్రకరణం 43

20. **నరసింహ శతకం-నవనీత సూక్తం - 1** 44

21. **మెస్మరిజం-4 :** మెస్మరిజం యొక్క తత్వజ్ఞానం 45


## సద్గురు వాణి

### సచ్చరిత్రత



సచ్చరిత్రత అనేది ఒక మహా సంపద. మహా పురుషుల వద్ద ఉన్న పెద్ద సంపద ఏమిటంటే వారి స్వభావం, వారి నడవడిక. దీనివలన వారు నిరంతరం ప్రగతిపథంపై ముందుకు వెళ్తుంటారు. ఈ స్వభావం, నడవడిక ధనసంపదకన్నా అత్యంత విలువైనవి. ధనం రావచ్చు, పోవచ్చు. ధనంపోతే మరల సంపాదించుకోవచ్చు. కానీ స్వభావం నడవడిక సరిగ్గా లేకపోతే వారి జీవితమే వ్యర్థమవుతుంది.

డబ్బు బాగా సంపాదించినా నడవడిక సవ్యంగా లేకపోతే వారిని ఎవరు గౌరవించారు. మంచి నడవడిక గలవారు ఎప్పుడు గౌరవనీయులే.

కొందరు తమ స్వార్థం కొరకు నడవడిక సవ్యంగా లేకున్నా బాగా డబ్బున్న వారిని గౌరవించవచ్చు. కానీ వారు పని పూర్తి అయిన తర్వాత ముఖం కూడా చూపించరు.

– పండిత శ్రీరామశర్మ ఆచార్య


**యుగశక్తి గాయత్రి**

**చందా రుసుమును ఆన్‌లైన్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ

ఖాతాపేరు : శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 20/- చందాకు అదనంగా పంప ప్రార్థన. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ॥ 12/- | 3 సం॥ చందా రూ॥ 350/- |
| సం॥ చందా రూ॥ 120/- | 10 సం॥ చందా రూ॥ 1116/- |


**ఫలితం కంటే ప్రయత్నం ముఖ్యం**

వేద మంత్రం

# ధర్మతంత్రం రాజ్యతంత్రాన్ని నిర్దేశించాలి

**బ్రహ్మ గవీ పచ్యమానా యావత్ సాభివిజ్ఞం హే ।**
**తేజో రాష్ట్రస్య నిహన్తి నవీరో జాయతే వృషా ।**
**(అథర్వవేద 5/19/4)**

**భావార్థం :** ఎక్కడ బ్రహ్మవేత్తలు, వేదవిద్య నిరాదరించ బడుతుందో ఆ రాజ్యం నశిస్తుంది. అక్కడ తేజస్వులు, వీరులెవ్వరు ఉండరు.

**సందేశం :** ప్రపంచంలో అందరినీ సంస్కారవంతులుగా చేసే కార్యాన్ని ఎవరు స్వీకరిస్తారో వారినే బ్రాహ్మణులని, ఋషులని అంటారు. కేవలం పూజాపాఠం లేదా కర్మకాండల కాలక్షేపం వలన సమాజానికి లాభమేమీ లేదు. సుఖ సౌకర్యాలు, ధనము, సంపద ప్రోగుపడవచ్చు కానీ దీనివలన వారికి ఏ విధమైన ఆధ్యాత్మిక లాభం కలగదు. సమాజంలో సుఖ-సమృద్ధులు కలుగవచ్చు. గతంలో ఇరవై అయిదేళ్ళు వచ్చేదాకా గురుకులంలో సాత్విక వాతావరణంలో విద్యార్జన చేసేవారు. దానితో జ్ఞానవంతులు, సదాచారులు, కర్తవ్యపరాయణులైన పౌరుల నిర్మాణం జరుగుతుండేది.

విద్యా సంస్కారాలే కాదు, ఋషులు సమయాన్ని బట్టి పరిస్థితులను బట్టి రాజ్యనీతిని నిర్ధారణ చేసేవారు. అదృష్టం గురించి మాట్లాడకుండా సమయానుకూలంగా పనులు చేసేవారు, సమస్యలను అంచనావేసి దానిని పరిష్కరించుట వారి ముఖ్యమైన పని. వారి సలహా లేకుండా రాజ్యంలో ఏ పని జరిగేది కాదు. చాణక్యుడు నలందా విశ్వవిద్యాలయ కులపతిగా ఉండేవాడు. విశ్వమంతటి నుండి విద్యార్థులు అధ్యయనం కోసం వస్తూ ఉండేవారు. ఇదేకాక చాణక్యుడు చంద్రగుప్తుని మంత్రిగా ఉండేవారు. వారు రాజ్యం నడిపేవారు, గురుకులం కూడా నడిపేవారు. వశిష్ఠుడు రఘు వంశీయులకు కులగురువుగా ఉండేవారు. రాజుగారు అన్ని పనులు గురువు ఆజ్ఞతో చేస్తూ ఉండేవారు. ధర్మతంత్రమెప్పుడు రాజ్యతంత్రాన్ని నిర్దేశిస్తూ ఉండేది. ధర్మం యొక్క అంకుశం వలన రాజ్యతంత్రం నిరంకుశంగా ఆచరించలేక పోయేది. సమాజంలో అరాచకత్వం, భ్రష్టత చొరబడటానికి సాహసం చేయలేకపోయేవి. ధర్మం యొక్క వాస్తవిక అర్థం కర్తవ్యపాలన. రాజ్యశక్తి యొక్క వేర్లు ధర్మమనే సారవంతమైన భూమిలో లోతుగా పాతుకుపోతే, దానికి యశస్సు, కీర్తి అనే సుగంధిత పుష్పాలే వికసిస్తాయి.

నేడు విద్యాపద్ధతి ఎలా ఉన్నదంటే, ప్రజల నైతిక, ఆధ్యాత్మిక ఉన్నతి సంభవమే కాదు. వైదిక సాహిత్యం, సద్గ్రంథాల పఠనము ప్రోత్సాహించబడుట లేదు. నైతిక శిక్షణ దాదాపుగా స్కూళ్ళలో నిలిపివేశారు. మొదట్లో నిత్యకర్మలవలనే ప్రతిరోజు నియమిత రూపంలో వేదాధ్యయన పరంపర ఉండేది. ఒకటి రెండు మంత్రాలు లేదా శ్లోకాలు స్వాధ్యాయము, వాటి వ్యాఖ్యపైన చింతన, మననం, సత్సంగం, గోష్ఠి మొదలైన క్రమం ఉండేది. ఈ విధంగా జ్ఞానవంతులు, శీలవంతులకు రాజాశ్రయం, ప్రతిష్ఠ లభిస్తూ ఉండేవి. దీనితో యోగ్యులు, దేశభక్తులు, ఉత్తమ శీలవంతులైన పౌరుల సంఖ్య పెరిగేది. దుర్గుణాలు కలవారు, దురాచారులు, దుర్వ్యసనపరులైనవారు తిరస్కృతులు, ఉపేక్షితులు దండించబడేవారు. రాజ్యమునకు యశస్సు, కీర్తి పెంపొందేవి.

జ్ఞానవంతులు, శీలవంతులు, నిష్ఠావంతులకు తగిన ప్రోత్సాహం, సంరక్షణ, గౌరవం ప్రాప్తిస్తేనే బ్రాహ్మణత్వమునకు సార్థకత. మనందరి పవిత్ర కర్తవ్యం వేదవిద్యయొక్క, విద్వాంసుల యొక్క నిరాదరణ కలుగకుండా చూడటం.

★★★

## పండుగలు

**సెప్టెంబర్ 2013**

| | |
|---|---|
| 09-09-2013 | వినాయక చవితి |
| 23-09-2013 | మాతా భగవతీదేవిశర్మ జయంతి |

**అక్టోబర్ 2013**

| | |
|---|---|
| 02-10-2013 | గాంధీ జయంతి |
| 12-10-2013 | దుర్గాష్టమి |
| 13-10-2013 | విజయదశమి |

**బుద్ధిని సరిగ్గా ఉపయోగించనందునే శరీరానికి రోగాలు వస్తాయి**



గాయత్రీ విద్య-36

# స్వరయోగం-6

*(గత సంచిక తరువాయి...)*

## అన్య శాస్త్రములలోని కొన్ని ప్రయోగములు

స్వర గ్రంథములలో శ్వాసక్రియతో సంబంధంలేనివి కూడా అనేక ప్రకరణములు ఉన్నాయి. స్వరశాస్త్ర చికిత్సకులు తంత్ర గ్రంథములలోని అనేక విషయాలను ఉపయోగకరంగా భావించి తమ పుస్తకములలో చేర్చి ఉండవచ్చు. వీటిని ఇక్కడ ఇస్తున్నాము. పాఠకులు వీటి లాభములను పొందగలరు.

1. తలనొప్పి ఉన్నట్లయితే రెండు మోచేతులపైన పంచకోసలతో కానీ, లేదా ఏదైనా తాడును కానీ బాగా మెలియబెట్టి బాగా గట్టిగా కట్టాలి. ఇలా చేసినట్లయితే 6-7 నిమిషాలలో తలనొప్పి తగ్గిపోతుంది.

2. మలమూత్రములు విసర్జన చేసే సమయంలో రెండు పలు వరసలు గట్టిగా నొక్కిపట్టాలి. ఇలా చేయడం వలన దంతములు బలంగా ఉంటాయి, రోగరహితమవుతాయి.

3. భోజనం చేసిన తరువాత చేతులు, ముఖం కడుగుకుని చెక్క దువ్వెనతో తల వెంట్రుకలను దువ్వుకోవాలి. తలలో కొంచెం కొంచెం గుచ్చుకున్నట్లు అనిపించాలి. ఇలా చేయడం వలన శిరస్సుకు సంబంధించిన రోగములు, వెంట్రుకలకు సంబంధించిన వ్యాధులు ఉత్పన్నమయ్యే భయం ఉండదు.

4. బాగా ఎండగా ఉన్నప్పుడు బయటకు వెళ్ళవలసి వస్తే ఒక టవల్‌తో రెండు చెవులను మూసివేయాలి. ఇలా చేయడం వలన ఎండ దెబ్బ తగులుతుందనే భయం ఉండదు.

5. జ్ఞాపకశక్తి తగ్గినప్పుడు తలపై ఒక చెక్క పలక చిన్నది పెట్టి దానిపై కర్రతో చేసిన సుత్తివంటి దానితో నెమ్మదినెమ్మదిగా కొట్టాలి. ఒక్కొక్కసారి ఏదైనా మరచిపోయినప్పుడు తల గోక్కోవడమో లేక పెన్సిల్‌తో నెత్తిమీద కొట్టుకోవడమో చేయడం పాఠకులకు అనుభవంలోనికి వచ్చి ఉండవచ్చు.

6. శౌచం తర్వాత (లెట్రిన్‌కు వెళ్ళివచ్చిన తరువాత) ముఖం, చేతులు కడుగుకుని, నోటిలో ఎంత నీటిని ఉంచుకోగలిగితే అంత ఉంచుకుని, దోసిలిలో చల్లని నీళ్ళు నింపుకుని తెరచి ఉంచుకున్న కళ్ళలో చక్కగా చల్లుకోవాలి. అలా 6-7సార్లు చేసిన తరువాత నోటిలోని నీటిని ఊయండి. భోజనం తరవాత కూడా ఇలా చేయవచ్చు. ఇలా చేయడం వలన కంటి జబ్బులు రావు. చూపు చక్కగా ఉంటుంది.

7. కొద్దిసేపు పద్మాసనంలో కూర్చుని దంతముల మూలంలో నాలుక చివరి భాగం ఒత్తిపెట్టి ఉంచడం వలన అన్ని రకముల రోగములు పారిపోతాయి.

8. ఎర్ర ఉత్తరేణి వేరు చేతికి కట్టి ఉంచితే భూత ప్రేతాది బాధలు తగ్గిపోతాయి.

9. ప్రాతఃకాలం, సాయంకాలం పద్మాసనంలో కూర్చుని నాభి వైపు చూస్తూ, నాభిలో వాయువును ధారణ చేసి నాభిపై ధ్యానం చేస్తే ఆకలి మందగించటం, అజీర్ణం, విరోచనాలు మొదలైన పొట్టకు సంబంధించిన రోగములు దూరమవుతాయి.

10. దప్పిక ఎక్కువగా ఉన్నట్లయితే నాలుకపై పుల్లని వస్తువు ఉన్నట్లు ధ్యానం చెయ్యాలి. శరీరం వేడిగా ఉంటే చల్లని వస్తువు, చల్లగా ఉంటే వేడి వస్తువు నాలుకపై ఉన్నట్లు ధ్యానం చెయ్యాలి.

11. లలాటముపై పూర్ణచంద్రునికి సమానమైన జ్యోతిని ధ్యానం చేస్తే ఆయుష్షు పెరుగుతుంది, కుష్ఠు మొదలైన రోగములు దూరమవుతాయి. తల వేడెక్కినా, తలతిరుగుతున్నా మస్తకములో శ్వేతవర్ణపు శరత్చంద్రుని ధ్యానం చేసిన కొద్ది నిమిషములలో శాంతి లభిస్తుంది.

12. ఎల్లవేళలా దృష్టి పసుపు పచ్చని ఉజ్జ్వల జ్యోతిని ధ్యానం చెయ్యడం ద్వారా మందులు అవసరం లేకుండానే అన్ని రకముల రోగములు తగ్గిపోతాయి. దేహం పరిపూర్ణ యవ్వనంతో ఉంటుంది.

13. శ్యామవర్ణము (నల్లని) ధ్యానం చెయ్యడం వలన వాయు దోషములు, ఎరుపువర్ణం ధ్యానం చెయ్యడం వలన పిత్త (అగ్ని) సంబంధమైన దోషములు, శ్వేతవర్ణం ధ్యానం చెయ్యడం వలన కఫ (జలం) సంబంధమైన దోషములు దూరమవుతాయి.

## తత్వజ్ఞానంతో దివ్యదృష్టి

స్వరయోగమునకు సంబంధించిన గ్రంథములలో

**అంతరాత్మ ఆదేశాలను గౌరవిస్తే తప్పులు జరుగవు**

ప్రశ్నోత్తరములు లేక భవిష్య కథనం గురించి కూడా వ్రాయబడి ఉన్నది.

ప్రశ్నించేవాడు ప్రశ్నకు జవాబు ఇచ్చేవారి దగ్గరకు ఏదైనా పుష్పం కానీ లేక రక్తవర్ణపు వస్తువు కాని తీసుకువెళ్ళాలి.

సమాధానం చెప్పేవారి ఇడ (ఎడమ) స్వరం నడుస్తూ ఉంటే ప్రశ్నించేవారు పైన నుంచి కాని, ఎదురుగా కాని లేక ఎడమ ప్రక్క నుండి ప్రశ్నించితే కార్యం సఫలమవుతుంది. సమాధానం చెప్పేవారి సూర్య స్వరం నడుస్తుంటే ప్రశ్నించేవారు క్రిందనుంచి కాని, వెనుక నుంచి కాని లేక కుడి ప్రక్క నుంచి ప్రశ్నించితే పని సఫలమవుతుంది. ఇందుకు వ్యతిరేకంగా జరిగితే పని అసఫల మవుతుందని తెలుసుకోవాలి.

సమాధానం చెప్పేవారు పూరకంలో ప్రశ్నింపబడితే శుభం, రేచకంలో ప్రశ్నించబడితే అశుభం. అంటే ఏ సమయంలో ప్రశ్నించుచున్నారో ఆ సమయంలో సమాధానం ఇచ్చేవారు శ్వాస లోపలికి తీసుకుంటున్నట్లయితే అది శుభం, శ్వాస వదలు తున్నట్లయితే అశుభం.

సమాధానం చెప్పేవారు శ్వాస తీసుకుని కుంభకం (ఆపి ఉన్న శ్వాస) తో ఒక పుష్పం వైపు విసిరివేస్తే (శ్వాసను పుష్పం వైపుకు వదిలితే) పుష్పం నడుస్తున్న స్వరం వైపు పడితే ప్రశ్న సఫలమవుతుందని, అచలిత స్వరం వైపు పడితే అసఫలమని అర్థం చేసుకోవాలి.

ప్రశ్నించేవారు ప్రశ్న అడిగే సమయంలో తూర్పు లేక ఉత్తరాభిముఖంగా ఉండి చంద్రస్వరం నడుస్తుంటే, లేక దక్షిణ-పశ్చిమాభిముఖంగా ఉండి సూర్యస్వరం నడుస్తున్నా శుభమని అర్థం చేసుకోవాలి. వేరేవిధంగా ఉంటే అశుభమని తెలుసు కోవాలి. నడుస్తున్న స్వరం వైపు నుండి ప్రశ్నవేస్తే ఎంత కఠినమైన పని అయినా లాభం జరుగుతుంది. నడుస్తున్న స్వరం వైపు నుంచి కర్కశ స్వరంతో ప్రశ్నిస్తే లాభం ఉంటుంది కానీ కష్టంతో.

ప్రశ్నకర్త మొదట అచలిత స్వరంతో ప్రశ్నించి తరువాత నడుస్తున్న స్వరం వైపు వెళ్ళి కూర్చుంటే ఆ పని కష్టంతో నెరవేరుతుంది. ప్రశ్నకర్త దిగువగా నిలబడి నమ్రతాపూర్వకంగా ప్రశ్నిస్తే శుభము. ఎత్తున ఉండి కఠోర శబ్దములతో ప్రశ్నిస్తే అశుభం.

ఫలానా స్త్రీ గర్భంతో ఉన్నదా లేదా? ఈ ప్రశ్న నడవని స్వరం వైపు నుంచి ప్రశ్నిస్తే గర్భంతో ఉన్నదని అర్థం చేసుకోవాలి లేకపోతే లేదు.

గర్భంలో బాలుడా? బాలికా? ప్రశ్నకర్తకు ఎడమ స్వరం నడుస్తుంటే, సమాధానం చెప్పేవారి కుడి స్వరం నడుస్తుంటే బాలుడు జన్మించి మరణిస్తాడని అర్థం చేసుకోవాలి. ఇద్దరికి దక్షిణ స్వరం (కుడి) నడుస్తుంటే బాలుడు జన్మిస్తాడు, ఆనందంగా ఉంటాడు. ప్రశ్నకర్త యొక్క కుడి స్వరం, సమాధానం చెప్పేవారి ఎడమ స్వరం నడుస్తుంటే బాలిక జన్మిస్తుంది, కాని మరణిస్తుంది. సుషుమ్నలో ప్రశ్నిస్తే గర్భపాతమవుతుంది లేకపోతే తల్లి కష్టాల పాలవుతుంది.

ఇదేవిధంగా లేకపోతే చిన్న పెద్ద తేడాలతో యుద్ధం, యాత్ర, మిత్రత, కలహం, సంవత్సర ఫలితాలు మొదలైనవి వస్తాయి. స్వరం యొక్క చిరకాల అభ్యాసం వలన, విశేష ప్రయత్నం వలన సిద్ధి లభిస్తుంది. కానీ ఇంత కష్టపడలేక తేలిక పద్ధతులు అవలంభించటం జరిగింది. కానీ ఇటువంటి పిల్లచేష్టల వలన దేవదుర్లభమైన పరోక్ష జ్ఞానం యొక్క ముడి తేలికగా వీడదు. సాధారణంగా ఒక స్వరం ఒక గంట నడుస్తుంది. ఈ స్వరం అశుభమైనది అయితే ఆ గంటలో వచ్చే 50 మందికి అశుభమని చెప్తారా? ఎవరైనా మహానుభావుడు ప్రశ్నోత్తర విద్యను ఈ విధంగా వ్యాపింపచేస్తే అవమానం లభిస్తుంది. ఈ మహావిజ్ఞానంతో సమాజానికి చాలా నష్టం కలుగుతుంది.

మనుష్యుని సాధారణ జ్ఞానం చాలా తక్కువ. కానీ అతని లోపల ఎన్నో రహస్యాలను తెలుసుకునే శక్తి దాగి ఉన్నది. సంజయుడు ఎంతో దూరంలో ఉన్నప్పటికి మహాభారత యుద్ధాన్ని తన దివ్యదృష్టితో చూసి జరుగుతున్న సంఘటలను ధృతరాష్ట్రునికి చెప్పాడు. ఇదే విధంగా దివ్య శ్రవణం, దివ్యజ్ఞానం మొదలైన అసంఖ్యాకమైన ఉదాహరణలు మన ప్రాచీన ఇతిహాసాలలో లభిస్తాయి.

అఖిల విశ్వ బ్రహ్మాండము ఆకాశతత్వంతో (ఈథర్)తో పరిపూర్ణంగా నిండి ఉన్నది. ప్రపంచంలో ప్రత్యక్ష, అప్రత్యక్ష సంఘటనలు జరుగుతుంటాయి, వాటి స్పందనలు ఉత్పన్న మవుతాయి. ఏదైనా సంఘటన స్పష్టంగా కనిపించడం దాని అంతిమ స్థితి. యదార్థంగా ఆ సంఘటన యొక్క ఆరంభం చాలా ముందుగానే జరిగి ఉంటుంది. మనం ఒక దుకాణం తెరుస్తున్నాం, దాని ప్రారంభోత్సవం సూక్ష్మ దృష్టిలో అంతిమ కార్యము. దాని ప్రారంభం చాలా రోజుల క్రితమే మన మస్తిష్కంలో దానిని గురించిన ఆలోచనలు ప్రారంభమయినప్పుడే జరిగింది. ఆ ఆలోచన కంపనల ద్వారా దుకాణం తెరవడం వరకు అనేక

**గతాన్ని తలచుకుని కుంచించుకు పోకూడదు**

పనులు జరుగుతుంటాయి. ఇది మనం తెలుసుకోలేకపోయినా పనులు నిస్సందేహంగా జరుగుతాయి. ఏదైనా సంఘటన జరగక ముందు ఈథర్‌లో దానికి సంబంధించిన అలజడులు ప్రారంభమవుతాయి, వాటి అప్రత్యక్ష గుప్త భావనలు మన వరకు వస్తుంటాయి. మనస్సు ఎంతో స్వచ్ఛంగా ఉంటే ఆ సూక్ష్మకంపనల ప్రవాహమును అర్థం చేసుకోగలిగితే నిస్సందేహంగా గుప్తమైన భవిష్యత్తులో జరిగే సంఘటనలను అతను తెలుసుకోగలడు.

మన ముక్కు, చెవులు, కళ్ళు మొదలైన స్థూల ఇంద్రియాలలో చాలా కొంచమే శక్తి ఉంటుంది. నేత్రములు ఉన్నదంతా చూడలేదు. కొన్ని పదార్థముల కిరణములు నేత్రములలోని జ్ఞాన తంతువులను తగిలినప్పుడు ఒక ప్రకారమైన జ్యోతి వెలువడుతుంది. కాంతి స్పెక్ట్రంలోని VIBGYOR వయొలెట్, ఇండిగో, బ్లూ, గ్రీన్, ఆరంజ్, రెడ్ రంగులను మాత్రమే కన్ను గుర్తించగలదు. దీని బాహ్యంలో ఉన్న అల్ట్రా వయొలెట్ రేస్, ఇన్‌ఫ్రారెడ్ రేస్‌ను (కిరణములు) మన కన్ను చూడలేదు. ఇవికాక వేలాది ఇతర రంగుల సూక్ష్మ వస్తువులను అవి గుర్తించలేవు. గబ్బిళం చీకటిలో చూడగలిగినది మనిషి చూడలేదు. చెవి కూడా అన్ని శబ్దాలను వినజాలదు. 20-20000 Hz మధ్యలో ఉన్న శబ్ద తరంగాలను మాత్రమే మన చెవులు పట్టుకోగలవు. వీటిపైన, క్రిందగల శబ్దములను వినటంలో మన చెవులు అసమర్థమైనవి. కుక్కకు ఉన్న వినికిడి శక్తి, వాసన పసిగట్టే శక్తి మనిషికి లేదు. అందరిలో ఇంద్రియాల శక్తి సమానంగా ఉండదు. కొందరిలో అది ఎక్కువగా ఉంటే కొందరిలో తక్కువగా ఉంటుంది.

మన ఇంద్రియాలకు ఇంకాస్త సహాయం లభిస్తే ఇంకొంచెం ఎక్కువ తెలుసుకోగలవని శాస్త్రజ్ఞులు నిరూపించారు. ఎక్స్‌రే కిరణాల సహాయంతో తమోమయ పదార్థములలోని అంతరాళములలోనికి చూడవచ్చు. ఈ కిరణముల సహాయంతో పెట్టెలో దాచిపెట్టబడిన వస్తువులను చూడవచ్చు. ఉత్తరాలు తెరవకుండానే చదువవచ్చు. ఎక్స్‌రే కిరణముల ద్వారా శరీరం లోపలి అంగాల పరిస్థితి చూడగలడం మనకందరికి తెలిసినదే.

ఇంద్రియముల సూక్ష్మ శక్తులను జాగృతం చేయగలిగితే అవి తమ ఆంతరిక ఆకాశంలో ఉన్న కంపనముల గతివిధులను (activities) ఎక్కువగా తెలుసుకోగలవు. అప్పుడు మనం సిద్ధ యోగులవలె దివ్యజ్ఞానం ప్రాప్తించుకోగలము.

ఆధ్యాత్మిక విద్యావిశారదులు చెప్పేదేమిటంటే శరీరంలో మూలాధారం మొదలైన చక్రాలున్నాయి. ఇవి దివ్యశక్తుల సూక్ష్మ కేంద్రములు. ఇవి ఇంద్రియాలని అర్థం చేసుకోకూడదు. ఎందుకంటే ఇవి కన్ను చెవిలాగా చూడలేవు, వినలేవు. కానీ ఇవి అంతర్ జగత్తు యొక్క ఇంద్రియములు. ఇవి ఒకరకమైన సుడిగుండములు. ఎలాగయితే నదులలోని నీరు సుడులు తిరుగుతూ ముందుకు వెళ్తుందో అదే ప్రకారంగా సూక్ష్మకంపనాలు మన శరీరంలో తమ అనుకూల చక్రాల ప్రదక్షిణ చేస్తాయి. అద్భుత విషయములు తెలుసుకోవడం అసంభవం కాదు. కేవలం స్థాయి భేదమే.

స్వరయోగం యొక్క తత్త్వవిజ్ఞానం కేంద్ర స్థానములను, చక్రములను జాగృతం చేస్తుంది. దీనివలన ప్రపంచంలో జరిగే విభిన్న రకముల సంఘటనలకు సంబంధించిన కంపనముల జ్ఞానం ప్రాప్తించుకొనగలరు. తత్త్వజ్ఞానమును అభ్యసించేవారు తన సూక్ష్మ జ్ఞానేంద్రియముల శక్తిని పెంపొందించుకొనగలుగుతారు.

*(సశేషం)*

## శ్రీ గాయత్రీ శతకం

**99.** ***'ధీమహి' యనంగ ఆ దేవి తృప్తిచెంది***
***జపమొనర్చెడు వానికి సౌఖ్యమొసగు***
***అట్టి తరుణాన మంత్రమ్ము హాయిగూర్చు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:- మంత్రంలో 'ధీమహి' అనే భాగాన్ని పలుకగానే మంత్రమాత తృప్తిని పొంది మంత్రాన్ని జపించే భక్తునికి సుఖాన్ని కలిగిస్తుంది. ఆ సమయాన సాధకునికి హాయిని చేకూరుస్తుంది వేదమాత.*

**100.** ***అనగ 'ధియో' - వినిన తల్లి ఆలకించి***
***పతిత హృదయాన ధార్మిక ప్రభలు జిమ్ము***
***అట్టి తరుణాన మంత్రమ్ము హాయిగూర్చు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:- మంత్రభాగమైన 'ధియో' అని పలుకగానే ఆ తల్లి తేజోవంతమై మంత్రాన్ని స్మరించే సాధకుని హృదయంలో ఆధ్యాత్మిక జ్ఞానకాంతులు ప్రసరింపజేస్తుంది. ఆ సమయాన సాధకునికి శాంతితో కూడిన హాయిని ప్రసాదిస్తుంది వేదమాత.*

*రచన: సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**వర్తమానంలో జీవించాలి**

గాయత్రీ చిత్రావళి - 15

# శారీరిక (కాయ) కష్టముల నివృత్తి




రోగము, బలహీనతల కారణంగానే మనుష్యులకు నానా ప్రకారములైన (కాయ) శారీరిక కష్టములు అనుభవించవలసి వస్తుంది. అనారోగ్యమునకు మూలకారణము ఆహార విహారములలో అసంయమమే. నియమంలేని దినచర్య, పనికిరాని ఆహార పదార్థాలు, సోమరితనము, అధిక పరిశ్రమ, ఇంద్రియాల అసంయమనం, చింత, మనోవికారాల కారణంగా రోగాలు వస్తున్నాయి. వారసత్వ జన్మజాత, ప్రారబ్ద రోగాలను వదలి మిగిలిన జబ్బుల నుండి మనుష్యుడు తనను రక్షించు కొనగలడు. తన శారీరక మానసిక ఆరోగ్యము పట్ల జాగరూకుడై, కర్తవ్యనిష్ఠుడై ఉంటే దీర్ఘజీవనము, ఆరోగ్యమును మనుష్యుడు సులువుగా పొందగలడు. పేదవారు లేమిలో ఉండి కూడా దృఢంగా ఉంటుంటే, అనుకూల పరిస్థితులలో జీవించేవారు రోగరహితులుగా ఉండలేకపోవటానికి కారణమేమిటి?

ప్రకృతి నియమాలను ఉల్లంఘించి, అప్రాకృతిక జీవన క్రమం అనుసరించుటచే శరీరములోని ప్రాణశక్తి తగ్గిపోతుంది. బలహీనత, అలసట, నీరసము, ఉదాసీనత చుట్టుముడతాయి. కొద్దిపాటి ఒత్తిడికే శరీరము అలిసిపోతుంది. ఏదో ఒక రోగము చేతచిక్కి మంచం పట్టవలసి వస్తుంది. రోగములో శరీర కష్టమే కాక, డబ్బు నష్టం, ఇంటిలోని వారికి చికాకు, ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడతాయి. ఇంటిలోని ఇతరులకు కూడా రోగము సంక్రమిస్తుందనే భయం ఉంటుంది. బలహీనత కూడా మనుష్యునికి ఒక రోగమే. రోగశయ్యపై పరుండనప్పటికీ, ఉత్సాహం, పురుషార్థం కొరవడి ఉన్నతి, సంపాదనా మార్గము వైపు పయనింపజాలడు.

ఇటువంటి పరిస్థితి నుండి మనుష్యుడు తనను తాను సహజంగానే కాపాడుకొనవచ్చు. అప్రాకృతిక, అసంయమిత ఆహార విహారముల నుండి కాపాడుకొనుట ద్వారా అభిప్రాయములలో, స్వభావములో, కార్యక్రమములలో సతోగుణాన్ని జోడించినప్పుడే ఇది సంభవం. గాయత్రీ ఉపాసన ఫలితంగా సాధకునిలో అసంయమనానికి చోటు ఉండదు, అందువలన రోగము, బలహీనతల నుండి విముక్తి లభిస్తుంది. ఏ రోగాలు అనేక రోజుల నుండి శరీరంలో తిష్ఠ వేసుకొని ఉండి, ఎన్నో మందుమాకులు వాడినా ప్రయోజనం కన్పించకుండా ఉన్నదో, అవన్నీ గాయత్రీ ఉపాసనతో సరియగుట చూడవచ్చు. అసాధ్యమైన రోగాల నుండి, మృత్యు ముఖం నుండి బయట పడుట చూసాము. సాధన ద్వారా శరీరంలో సత్వగుణాన్ని వృద్ధి చేసుకొనుట అనేది ఒక సంజీవని ఔషధిలాంటిది. దీనితో సమానమైన ఔషధి చికిత్సా శాస్త్రమంతటిలో మరొక వస్తువు లేదు.

– అనువాదం : డా॥ తుమ్మూరి

**సమాజంలో మార్పు రావాలంటే ముందు మనలో మార్పు రావాలి**

వినాయక చవితి ప్రత్యేకం

# అభీష్టసిద్ధి కొరకు గణపతి పూజ

భాద్రపదమాసంలోని శుక్లపక్ష చవితిని గణేశచతుర్థిగా దేశమంతటా ఉల్లాసఉత్సాహాలతో జరుపుకుంటారు. ఈ శుభ ప్రదమైన తిథినాడే గణేశుడు జన్మించినాడు. "గణేశ చతుర్థి" గొప్ప ఆధ్యాత్మిక మరియు ధార్మిక మహత్వమును కలిగి ఉన్నది. అందువల్లనే ఈ రోజు గణేశవ్రతం జరుపుకుంటారు. పలు విశిష్టమైన ప్రయోగాలను చేస్తూ ఉంటారు. ఏ మంగళమయ కార్యంలోనైనా సరే ముందుగా శ్రీ గణేశధ్యానం మరియు పూజ చేయబడతాయి. ఎందువల్ల అనగా శ్రీ గణేశుడు విఘ్నములను నశింపజేస్తాడని మరియు శుభప్రదమైన వాతావరణమును నిర్మిస్తాడని చెప్పబడినది. శ్రీ గణేశుడు భౌతికం మరియు ఆధ్యాత్మికం అనే రెండు రకాలైన విజయాలను ఒకేసారి ప్రసాదించే సమర్థత, శక్తి కలిగి ఉన్న దేవత.




గణేశ శబ్దానికి అర్థం సమస్త జీవజాతులకు ఈశ్వరుడు అనగా స్వామి. "గణానాం జీవజాతానం యః ఈశః – స్వామీ స గణేశః" శ్రీ గణేశుడు సర్వ స్వరూపి, పరాత్పరుడు, పూర్ణబ్రహ్మ స్వరూపుడు, సాక్షాత్తు పరమాత్మ. అథర్వ శీర్షములో **'త్వం బ్రహ్మ త్వం విష్ణుస్త్వం రుద్రః'** అను మంత్రం ద్వారా ఆయన సర్వరూపునిగా చెప్పబడినాడు. సృష్టి ఉత్పత్తి అయిన పిదప దాని సంచాలనలో ఆసురీశక్తుల ద్వారా ఉత్పన్నమయిన విఘ్నములను, కష్టాలను నివారించే నిమిత్తం స్వయంగా పరమాత్మ గణపతి రూపమును ధరించి బ్రహ్మ దేవునకు సహాయకునిగా నిలచాడు. ఋగ్వేద, యజుర్వేదములలోని **'గణానాంత్వా గణపతిగ్ం హవామహే'** అను మంత్రాలలో భగవంతుడైన గణపతి యొక్క సుస్పష్ట ఉల్లేఖనం (వివరణ) లభిస్తుంది. వేదాలలో బ్రహ్మ, విష్ణు మున్నగు గణాల యొక్క అధిపతి అయిన శ్రీ గణనాయకుడే పరమాత్మగా చెప్పబడినాడు. ధర్మమే ప్రాణంగాగల భారతీయులు వైదిక మరియు పారలౌకిక మంత్రాలద్వారా అనాదికాలంనుండి ఈ ప్రాచీనమైన, సర్వులకు పూజనీయుడైన భగవంతుడు గణపతి యొక్క పూజ, అభ్యర్థనలు (ప్రార్థనలు) చేస్తూ వస్తున్నారు. గణపతి చిన్మయుడు, ఆనందమయుడు, బ్రహ్మమయుడు, సచ్చిదానందస్వరూపుడు.

గణేశుడిని వినాయకుడు అనికూడా అంటారు. వినాయకుడు అనే శబ్దమునకు అర్థం ఉత్తమమైన నాయకుడు. వినాయకుడు వైదిక సంప్రదాయంలో సకల కార్యాల ఆరంభంలో పూజింపబడే దేవత. వినాయకుని పూజ ప్రాంతాల మధ్యగల భేదంవలన వక్క, రాయి, మృత్తిక, పసుపుపొడి, గోమయం, గరికలతో ఆవాహనాది విధులద్వారా చేస్తారు. కనుక ఈ సమస్త భౌతిక పదార్థాలలోను గణేశుడు వ్యాపించిఉన్నాడని తెలుస్తున్నది.

వినాయకచతుర్థి లేక గణేశచతుర్థి వ్రతం సూర్యుడు సింహ రాశిలో ఉన్నప్పుడు, భాద్రపద శుక్ల చవితి, హస్తా నక్షత్ర యోగంలో జరుపుకుంటారు. ఈ శుభఘడియలు బుధవారంనాడు సంభవిస్తే దానికి ప్రత్యేకమైన గొప్పతనముంటుందని భావిస్తారు. వినాయకుడిని భూతత్త్వ స్వరూపునిగా స్వీకరిస్తారు. **మహో మూలాధారే** ఈ ప్రమాణం ఆధారంగా మూలాధార చక్రం భూతత్త్వమని తెలుస్తున్నది. అనగా మూలాధారంలో భూతత్త్వరూపుడైన గణేశుడు విరాజమానుడై ఉన్నాడు. గణపతి యొక్క **'గ్లౌం'** బీజాన్ని ధ్యానించుటచేత **'తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః ఆకాశా ద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, అపద్భుతః పృథివీ'** ఈ సృష్టిక్రమాన్ని అనుసరించి 'గకారం' ఆకాశబీజం, 'లకారం' భూబీజం, వీటి సంయోగంచేత పంచభూతాత్మకుడైన గణేశుడు తెలుసుకొనబడతాడు. అందుచేత భాద్రపద శుక్ల చవితి నాటి పూజకొరకు ప్రాచీనకాలంలో మట్టితో గణపతిని తయారుచేసి పూజించేవారు.

వినాయక చవితి నాటి పూజా సామాగ్రిలో గరిక, శమీ పత్రాలు మరియు మోదకములు / ఉండ్రాళ్ళు ముఖ్యమైనవి. ఎందుకనగా ఇవన్నీ గణేశునకు ప్రీతికరమైనవి. పూజకొరకు దుర్వాయుగ్మం అనగా రెండు దూర్వారములు (గరికపోచలు) హవనం కొరకు మూడు మూడు దూర్వారములు (గరికపోచలు)

**ఎన్ని సమస్యలు, కష్టాలు వచ్చినా జీవితం సాగిపోతూనే ఉంటుంది**

ఉపయోగించే విధానం తంత్ర శాస్త్రంలో లభిస్తుంది. దుర్వా అను పదానికి అర్థం జీవి (ప్రాణి) అని. జీవి సుఖదుఃఖాలను అనుభవించటానికి జన్మిస్తాడు. ఈ సుఖదుఃఖ రూప ద్వంద్వాలను దుర్వాయుగ్మం రూపంలో భగవంతునికి సమర్పించడం జరుగుతుంది. ఏప్రకారంగా జీవి జన్మ జన్మాంతరాలలో ఆర్జించిన పాపపుణ్యాల ఫలస్వరూపంగా తిరిగి తిరిగి జన్మిస్తాడో, అదే విధంగా దుర్వారం తన అనేక వేళ్ళద్వారా మొలకెత్తుతూ ఉంటుంది. గణేశచతుర్థి పూజ 21 (ఇరవైవొక్క) రకాల క్లేశాలను నశింపజేస్తుంది. హవనం నిమిత్తం మూడు గరికపోచలను ఉపయోగించుటలో గల అంతరార్థము జీవి యొక్క మూడు రకాల బంధనాలను భస్మీపటలం చేయుట. తత్ఫలితంగా జీవి సత్త్వగుణసంపన్నుడై మోక్షమును పొందుతాడు.

శమీ వృక్షమును వహ్నివృక్షం అని కూడా అంటారు. వహ్నీపత్రములు గణేశునికి ప్రీతికరమైని. బ్రహ్మీపత్రాలతో గణేశుని పూజించినచో జీవి బ్రహ్మభావమును పొందగలుగుతాడు. మోదకములు / ఉండ్రాళ్ళు కూడా వినాయకునికి ప్రియమైన భోజ్య పదార్థాలు. మోదం, ఆనందమే, మోదకం. అందుచేత **'ఆనందో మోదః ప్రమోదః'** అని చెప్పబడినది. మోదకములను గణేశునికి అర్పించుటలో గల అంతరార్థం, సర్వదా ఆనంద మగ్నుడై ఉండుట, బ్రహ్మానందంలో తేలియాడుట. మోదకముల యొక్క గోళాకృతి మహాశూన్యమునకు ప్రతీక. ఇది దృగ్గోచరమగు సమస్త వస్తు జగత్తుకు అతీతమైనది. అది ప్రతి ఒక్క స్థితిలోను పూర్ణమే. ఈ పూర్ణత్వం ప్రణవమంత్రం యొక్క గుణం. అందుచేత గణేశుడు ప్రణవమునకు చిహ్నం.

ఈ సంకేతార్థం గణేశుని జనన వృత్తాంతానికి చెందిన ఒక కథలో చెప్పబడిఉన్నది. పార్వతిదేవి చేత బొమ్మలో ప్రాణప్రతిష్ఠ చేయబడుట, శివుని ద్వారా వధింపబడుట, తిరిగి ఖండింపబడిన శిరస్సు స్థానమున ఏనుగు తలను అతికించుట అను ఈ కథలో రహస్యార్థ్యము ఉన్నది. గణేశుని మొండెం పార్వతీదేవి నిర్మించినది. శిరస్సు శంకరాభగవానుడి చేత ప్రతిష్ఠితమైనది. గణేశుని మస్తకము కొరకు, ఏనుగు శిరస్సు ప్రతిష్ఠించబడుట అనునది మంత్ర స్వరూపం యొక్క రహస్యాన్ని వివరిస్తుంది. ఏనుగు యొక్క గండస్థలం నుండి వంపులు తిరిగిన తొండం వరకు గల ప్రదేశం ప్రణవమంత్రం ధ్వనించే సంకేతస్థానము. యోగశాస్త్రం మరియు అక్షరాల శబ్దబ్రహ్మ యొక్క మూల సంబంధంగా 'ఈ అచ్చులు విశుద్ధిచక్రంలో ఉత్పన్నమౌతాయి అని, మ-కారం మూలధారంలో ధ్వనిస్తుంది' అని చెప్పబడినది. శంకరభగవానుడు, మాత పార్వతి యొక్క మంత్రాన్ని అమోఘం మరియు దోషరహితముగా తయారుచేయు ఉద్దేశ్యంతో అందులో ప్రణవమంత్రాన్ని కూడా జోడించినారు. ఓంకార ప్రయోగమునకు గజ-మస్తకం సరళమైన, సుస్పష్టమైన చిహ్నం. ఈనాడు కూడా ప్రణవమంత్రం అన్ని మంత్రాల ఆరంభంలో జపించుట జరుగుతున్నది. దీనిననుసరించి గణపతి సకల అనుస్ఠానాలలో ప్రప్రథమంగా పూజనీయుడు అనే లక్ష్యమును అది సూచిస్తున్నది. మహారాష్ట్రలో లోకమాన్యతిలక్ గణపతి పూజను అన్నింటికంటే గొప్ప పర్వంగా రూపొందించాడు. గణపతి రూపంలో భరతమాత పూజ సంకేత రూపంలో స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో ఈ పరంపరను ఆయన ప్రారంభించినారు. దక్షిణ భారతమున గణపతి పూజ సర్వోత్తమమైన పూజగా భావిస్తారు.

చంపతరాయగారి అభిప్రాయంలో గణపతి శిరస్సును ఖండించుట అనునది అహంకార నాశనమునకు గుర్తు. ఏనుగు శిరస్సును ప్రతిష్ఠించుట అనగా నిర్వాహక(సంయోజక), సమన్వయాత్మక, సంశ్లేషాత్మక బుద్ధి ఉదయించుట. గణేశుని వాహనమైన ఎలుక బుద్ధికి ప్రతీక. ఇందుచేత శ్రీ గణేశుని వాహనం మూషికము. ఈ బుద్ధి కారణంగానే గణేశుడు 'బుద్ధి సాగరుడు' అని చెప్పబడుతున్నాడు. గణేశుని ఏకదంతత ఆయన అద్వైత ప్రియతకు సూచిక. లంబోదరుడు అనగా అనేక బ్రహ్మాండములు ఆయన ఉదరంలో ఇమిడిఉన్నవి అని తెలుస్తోంది.

గణపతి పూజ ద్వారా పరమేశ్వరుడినే పూజించడం జరుగు తున్నది. ఏ సాధకుడు పవిత్ర భావంతో గణేశచతుర్థి వ్రతాన్ని ఆచరిస్తాడో, అతని బుద్ధి మరియు చిత్తవృత్తులు పవిత్రమౌతాయి. గణేశచతుర్థి వ్రతంలో గణేశమంత్ర జపం అధిక ఫలితమును అందజేస్తుంది. ఇందువలన ఈ వ్రతాన్ని విధి పూర్వకంగా, శ్రద్ధా విశ్వాసములతో చేసుకొని తమ అభీష్టమును ప్రాప్తింపజేసు కొనవచ్చును.

*- అఖండజ్యోతి, సెప్టెంబర్ 2005*

*అనువాదం : శ్రీమతి లక్కరాజు లక్ష్మీరాజగోపాల్*

## చమత్కారం

*పృథ్వి మీదున్న మనుష్యులకు సూర్యుడు, చంద్రుడు ఒకే ఆకారంలో ఉన్నట్లు కనిపించుట భ్రాంతి మాత్రమే. దీనికి కారణం చంద్రుని కంటే సూర్యుడు 400 వందల రెట్లు పెద్దగా ఉన్నందువల్ల, పృథ్వి నుండి చంద్రుని దూరం కన్నా సూర్యుడు 400 వందల రెట్లు అధిక దూరంలో ఉన్నందున ఒకే పరిమాణంలో ఉన్నట్లు కనిపిస్తాయి. ఇది ఆ సృష్టికర్త యొక్క చమత్కారంలో ఒక భాగం.*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**ఓర్పు, నేర్పు ఉన్నట్టయితే జీవనయానం సుగమమవుతుంది**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-15

# సద్గురువు సాక్షాత్కరించిన సుముహూర్తం-3

**(గత సంచిక తరువాయి...)**

వివిధ సాధనా సంప్రదాయాల అభ్యాసం, వాటి శిఖరాగ్రాలకు చేరుకోవడం రామకృష్ణదేవులు జరిపిన విలక్షణ సాధన.

ఆయన రామ ఉపాసన ప్రారంభించారు. హనుమంతునిలా వ్యవహరించసాగారు. 'రామ-రఘువీర' అంటూ ఆయన చెట్లు ఎక్కేవారు. పండ్లు కోసేవారు. తమ దంతాలతో వాటిని కొరికేవారు. రుచి చూసి పారవేసేవారు. ప్రతిప్రాణిలో, ప్రతి క్షణంలో రాముడిని దర్శించే దశను చేరుకున్న తర్వాత, ఆ సాధన విరమించారు.

ఒకసారి సఖీభావంతో శ్రీకృష్ణుని ఆరాధన ప్రారంభించారు. ఈ భావంతో సాధన చేసే సాధకులు తమను తాము శ్రీకృష్ణుని చెలికత్తెలుగా, గోపికలుగా పరిగణించుకుంటారు. స్త్రీలవలె జీవిస్తారు. రామకృష్ణులు కూడా అలా సాధన చేయసాగారు. సఖి రూపం ధరించడానికై ఆయన జుట్టు పెంచారు. జడ వేసుకున్నారు. ముక్కుకు ముక్కు పుడక, కళ్ళకు కాటుక, నొసట తిలకం, వేసుకోసాగారు. సాధన తీవ్రదశలో ఆయన లలిత ఎక్కడ, విశాఖ ఎక్కడ అని పిలువసాగారు. నా మీద దయ ఉంచు. "నేను దీనురాలిని, హీనురాలిని. నీ దయలేనిదే నేను రాధిక దర్శనం చేసుకోలేను. ఆ రాధిక లేనిదే శ్రీకృష్ణుని వద్దకు చేరలేను" అని అర్థించేవారు.



సఖి సంప్రదాయం ప్రకారం సాధన చేస్తూ ఉండగా, శ్రీరామకృష్ణ శరీరంలో స్త్రీల లక్షణాలు కనిపించసాగాయి. ఆయన గొంతుకలో కోమలత్వం, మాధుర్యం చోటు చేసుకున్నాయి. ఆ స్వరం విని ఆయనను ఎవ్వరూ గుర్తుపట్టలేకపోయేవారు. కొన్ని రోజుల తర్వాత ఆయన నడక కూడా మారింది. స్త్రీలవలె వక్షం ఉబికింది. కుసుమ కోమలి అయిన స్త్రీ వలె ఆయన మెత్త మెత్తగా అడుగులు వేయసాగారు.

తన్మయంగా ఆరాధన చేస్తే వ్యక్తిత్వంలో ఆమూలాగ్రమైన పరివర్తన వస్తుందనడానికి సాధనలోని ఈ దశ ప్రమాణంగా నిలుస్తుంది. చివరికి శరీరం సైతం ఆ ప్రకారం రూపు దిద్దుకుంటుంది. మార్పు చెందుతుంది. సఖీభావ సాధనా పూర్తయిన తర్వాత కొన్ని నెలలకు రామకృష్ణ దేవులు తమ సహజ స్థితికి చేరారు.

భక్తిమార్గం తర్వాత ఆయన వేదాంత సాధన ప్రారంభించారు. ఆ మార్గంలో "సోహమ్", "అహం బ్రహ్మాస్మి" అనే సిద్ధులను పొందారు. తాంత్రిక, బగళ, బాఉల్, వైష్ణవ, శాక్త మున్నగు సంప్రదాయాలను కూడా ఆయన అనుసరించారు. వివిధ సంప్రదాయాల, పంథాల సాధనలు జరిపిన తర్వాత ఆయన ఒక నిర్ణయానికి వచ్చారు. ఆయా మార్గాల స్వరూపాలు వేరయినా, తాత్వికంగా వానిలో అంతరం లేదీ లేదు.

ఆయన ఖాల్సా పంథ్ (సిక్కు మతం) దీక్ష తీసుకుని దాని సారాన్ని తెలుసుకున్నారు.

హిందూ మతానికి, ఇస్లాంకు తేడా ఏమిటో తెలుసుకోవాలని ఒక రోజున ఆయనకు ఆలోచన వచ్చింది. తమ ఇష్టదైవం అయిన భవానీ మాతను అనుమతి కోరారు. మాత అనుమతి ఇచ్చింది. టమ్‌టమా గ్రామంలో ఒక సూఫీ సాధకుడు ఉండేవాడు. ఆయన నుండి దీక్ష తీసుకున్నారు. సాధనా విధిని నేర్చుకున్నారు. మూడు రోజుల సాధన జరిగింది. ఆ కొద్ది సమయంలోనే ఆయన భావం మారిపోయింది. ఆయన అంతఃకరణలో తాను హిందువుననే భావం మాయమైపోయింది. ఆయన ఆలయానికి వెళ్ళడం మానివేశారు. కాళికా అమ్మవారి ప్రసాదం తీసుకోలేదు.

ఆ సాధన జరుపుతున్న రోజులలో ఎవరో ఆయనను అడిగారు "ఇస్లాం మతం ప్రకారం కాఫిర్లను చంపిన వ్యక్తియే స్వర్గంలో సుఖం అనుభవిస్తాడు. మరి మీరు కాఫిర్లను వధిస్తారా?"

రామకృష్ణ పరమహంస ఇలా జవాబిచ్చారు -

"కాఫిర్‌లు బయట లేరు. మనలోనే ఉన్నారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు మున్నగునవే మనలోపల నివసిస్తున్న విజాతీయ తత్వాలు. వాటిని నాశనం చేయడం ద్వారానే అల్లా కృప లభిస్తుంది. విద్య, శక్తి ఇవే మనిషికి సుఖాన్ని ఇస్తాయి. మనిషికి నిరంతరం అగాధమైన సుఖాన్ని ఇచ్చే సుందరులు, అప్సరసలు వీరే."

**విపత్తును ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవాలి**

ఆయన క్రైస్తవ మత సాధన, ఉపాసన మార్గాన్ని కూడా అవలంభించారు.

అన్ని మతాల సాధనా సంప్రదాయాల రహస్యాలను తెలుసుకున్న తర్వాత ఆయన తమ స్వభావంలో స్థిరపడ్డారు. వాస్తవానికి ముక్త ఆత్మలకు, సిద్ధ ఆత్మలకు తమదైన స్వతంత్ర స్వభావం అంటూ ఉండదు. వారు పరమాత్మ చేతనలో తాదాత్మ్యం చెందుతారు. ఫలితంగా వారికి తమదైన స్వతంత్ర సత్తా ఎక్కడా కనిపించదు. సాధకుడు ఏ స్థితికి, ఏ స్థాయికి చేరుకుంటే వాటికి అనుగుణంగా అతడు కనిపిస్తాడు. అద్దంవలె, స్ఫటిక విగ్రహం వలె మారతాడు. అవి ఎదుటి దృశ్యాన్ని, వర్ణాన్ని తమ రూపంలో ప్రతిబింబిస్తాయి కదా.

## తోతాపురి నుండి నేర్చుకున్న సాధన

రామకృష్ణదేవులు అప్పుడు వివిధ సాధనా మార్గాలను పరీక్షించి చూస్తున్నారు. పూజగదిలో కూర్చున్న శ్రీరామ్‌కు ఈ దృశ్యాలు ప్రత్యక్ష సంఘటనలుగా కనిపిస్తున్నాయి. దక్షిణేశ్వర ఆలయానికి వివిధ సంప్రదాయాలకు చెందిన సాధకులు, సన్యాసులు, ఫకీర్లు, ఫాదరీలు వస్తున్నారు. ఒకరోజు రాత్రి 100 నాగసాధువులలో ప్రముఖులైన తోతాపురి అనే సన్యాసి వచ్చారు. పుష్యమాసంలో గంగానదిలో స్నానం చేసి తిరిగి వస్తూ ఆయన దక్షిణేశ్వరంలో ఆగారు. రామకృష్ణదేవులను చూచి, "నీవు ఒక సాధన చేస్తావా?" అని అడిగారు.

"తల్లి చెపితే తప్పక చేస్తాను."

– అని రామకృష్ణులు చిన్నపిల్లవాడివలె సహజంగా, సరళంగా జవాబు చెప్పారు. ఆయన బహుశా తన స్వంత తల్లి అనుమతి కోరతారని తోతాపురి అనుకున్నారు. "వెళ్ళి అడిగిరా అని అన్నారు." రామకృష్ణులు కాళీమాత ఎదుట కూర్చుని అడిగారు. ఆమె నుండి "సాధన చేయి" అని జవాబు వచ్చింది. "సాధన ఎవరు నేర్పుతారు?" – అని ఆయన మళ్ళీ అడిగారు.

కాళీమాత ఇలా జవాబు చెప్పింది "నీకు వేదాంతం నేర్పడానికి వచ్చిన వ్యక్తియే నీకు సాధన నేర్పుతారు."

రామకృష్ణులు కాళీమాతతో జరిగిన సంభాషణను యథాతథంగా తోతాపురికి వినిపించారు.

తోతాపురి నవ్వారు. ఆ తర్వాత ఇలా అన్నారు – "మా నుండి ఉపదేశం పొందాలంటే నీవు సన్యాసివి కావాలి."

"సన్యాసి కావడానికి ఏమి చేయాలి?" అని రామకృష్ణులు సహజ స్వరంతో అడిగారు.

గదిలో తమ మార్గదర్శక సత్తా దివ్యసాన్నిధ్యంలో కూర్చున్న శ్రీరామ్ రామకృష్ణుల రూపంలో తామే స్వయంగా ఆ సంభాషణ జరుపుతున్నట్లు అనుభూతి చెందారు.

తోతాపురి సన్యాసం గురించి వివరిస్తున్నారు. అందుకోసం శ్రాద్ధం, హోమం, తర్పణం మున్నగునవి చేయాలి. కాషాయ వస్త్రాలు ధరించాలి. నిరంతరం పర్యటిస్తూ ఉండాలి.

ఆ వివరణ విని, రామకృష్ణులు ఇలా అన్నారు "అన్నింటికీ ఒప్పుకుంటున్నాను. అయితే కాషాయ వస్త్రాలు ధరించకుండా సన్యాసి అయ్యేటట్లు చేయండి. నేను ఈ స్థలాన్ని వదిలి మరో చోటికి వెళ్లలేను. నా తల్లి జీవించి ఉన్నది. ఆమెకు మరో కుమారుడు లేడు. అందువల్ల ఆమెను వదలలేను."

తోతాపురి అందుకు అంగీకరించారు. సన్యాసం పుచ్చు కోవడానికి సన్నాహాలు జరుగసాగాయి. శిఖ, సూత్రం, హారం, మాల మున్నగు చిహ్నాల విసర్జన జరిగింది. చితా ఆరోహణ, శ్రాద్ధతర్పణం క్రియలు కూడా పూర్తయ్యాయి. సర్వస్వాన్ని త్యజించే వ్రతాన్ని రామకృష్ణులు స్వీకరించారు. తోతాపురి ఆయనకు సన్యాస దీక్ష ఇచ్చారు. ఆయనను సమాధి స్థితిలోనికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. తన స్ఫటికమాలలో నుండి ఒక స్ఫటికాన్ని వేరు చేశారు. పద్మాసనంలో కూర్చొనవలసిందిగా రామకృష్ణులను కోరారు. శిష్యుడు పద్మాసనంలో కూర్చున్నారు. తోతాపురి ఆ స్ఫటికాన్ని రామకృష్ణుల రెండు కనుబొమ్మల మధ్య తాకించారు. దానితో కొంచం బలంగా నొక్కారు. కొద్ది ఒత్తిడి కలగగానే రామకృష్ణులు సమాధి స్థితిలోనికి వెళ్ళిపోయారు. ఆయన స్పృహ కోల్పోయారు. నాడి, గుండె యథాప్రకారం స్పందిస్తున్నాయి. అయితే ఆయనకు స్పృహమాత్రం లేదు.

ఈ స్థితి చూచి తోతాపురి కొద్దిగా భయపడ్డారు. రామకృష్ణులు శరీరాన్ని వదలుతారేమోనని ఆయనకు అనిపించింది. ఆయన ఎంతో మెలకువగా సాధకుడిని కాపలా కాశారు. ఒకరోజు గడచింది. రెండవరోజు ముగిసింది. మూడవరోజు తెల్లవారింది. అప్పటికీ రామకృష్ణుల స్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. సాధకుడు మూడు రోజుల వరకు మామూలు స్థితిలోకి రాకపోతే, పరిస్థితి విషమిస్తుందని తోతాపురి తన ప్రముఖ శిష్యులతో చెప్పారు. ఆ ఆత్మచేతనను తిరిగి ధరించే సామర్థ్యాన్ని శరీరం కోల్పోతుందని ఆయన వివరించారు.

## నీవు నా కన్నా ఎంతో ముందున్నావు

"కానీ, రామకృష్ణుల శరీరంలో ఎలాంటి వికారము రాలేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు యథాప్రకారం జరుగుతున్నాయి. నాడి

**అసాధ్యం అనే మాట ఏ ప్రయత్నం చేయనివారి నుంచే వస్తుంది**

సవ్యంగానే కొట్టుకుంటోంది. శరీరంలో ఎలాంటి వికృతి కనబడటం లేదు." అని ఆ శిష్యులలో ఒకరు అన్నారు.

తోతాపురి చింతించడం లేదు. అయితే ఆయన ఆశ్చర్యానికి అవధులు లేవు. ఆయనకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. సిద్ధ గురువులు తమ శిష్యులను సమాధి స్థితి నుండి వెలికి తీసుకు రావడానికి జరిపే ప్రక్రియలన్నీ ఆయన జరిపి చూశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. అలసిపోయి, ఓడిపోయి ఆయన ప్రశాంతంగా కూర్చున్నారు. అకస్మాత్తుగా ఆయనకు ఏదో స్ఫురించింది. ఆయన తన నోటిని రామకృష్ణుల చెవి దగ్గరకు చేర్చి, "నీవు ఎవరికోసం ఎదురు చూస్తున్నావో అతడు వచ్చేశాడు. చూడు" – అన్నారు.

ఆ మాటలు వినగానే, ఎవరో తట్టి లేపినట్లు రామకృష్ణులు లేచి కూర్చున్నారు. "అతడు ఎక్కడ ఉన్నాడు, ఎక్కడ ఉన్నాడు" అంటూ ఆతురతతో, వ్యాకులతతో అడిగారు.

"ఇక్కడికి చేరే ఉండవచ్చు"– అని తోతాపురి జవాబు చెప్పారు. ఆ తర్వాత ఆయన రామకృష్ణులతో ఇలా అన్నారు. "నీవు నా కన్నా ఎంతో ముందున్నావు. నీవు మహాపురుషుడవు. 40 సంవత్సరాలు కఠోరసాధన చేసిన తర్వాత కూడా నేను పొందలేక పోయిన స్థితిని నీవు ఒక్కరోజులో పొందావు. నీవు ధన్యుడవు."

తోతాపురి వేదాంతి. ఆయన విగ్రహారాధనను నమ్మరు. తమ శిష్యుని సిద్ధ స్థితి చూచి పరవశించిపోయి, ఆయన దక్షిణేశ్వర ఆలయంలో ఉన్న కాళీమాత విగ్రహానికి ప్రణామం చేశారు.

"నీవు ఎవరి కోసం ఎదురు చూస్తున్నావో అతడు వచ్చాడు. చూడు" – అని తోతాపురి రామకృష్ణులను సమాధి నుండి మేలు కొలపడానికి చెప్పిన మాటలు నరేంద్ర గురించి చెప్పినవే. ఆ 'నరేంద్రనాథ్ దత్తు' తర్వాతి కాలంలో స్వామి వివేకానంద అయ్యారు.

నరేంద్రుడు తమను కలుసుకున్న రోజున రామకృష్ణులు అతడిని గుండెలకు హత్తుకున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం తప్పిపోయిన పిల్లవాడు తిరిగి వచ్చినప్పుడు తల్లిదండ్రులు ఆనందాతిరేకంతో పరవశులు అయ్యే విధంగా ఆయన నరేంద్రుణ్ణి కౌగలించుకుని ఆనందంతో పులకించిపోయారు. వెక్కి వెక్కి ఏడుస్తూ ఆ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నరేంద్రనాథ్ అప్పుడు ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. మరోప్రక్క అతడిలో ముముక్షుత్వం తార స్థాయికి చేరుకున్నది. అది ఆకలి కన్నా మరింత తీవ్రం అయింది. మోక్షప్రాప్తి కోసం అతడు సాధుసంత్‌ల చుట్టూ తిరుగుతున్నాడు. అతడు రామకృష్ణుల వద్దకు వచ్చాడు. అతడిని చూడగానే గురువుగారు అతడిని అక్కున చేర్చుకున్నారు. తన అన్వేషణ పూర్తయిందని ఆయనకు అనిపించింది.

## మీరు దేవుణ్ణి చూశారా?

నరేంద్ర రామకృష్ణులను ఇలా అడిగాడు – "మీరు దేవుణ్ణి చూశారా?" ఎంత వేగంగా ఆ ప్రశ్న వచ్చిందో అంతకన్నా వేగంగా సమాధానం వచ్చింది "నీవు దేవుణ్ణి చూడాలని కోరుతున్నావా?".

నరేంద్ర ఇంతవరకు ఎందరెందరో సన్యాసులను, యోగులను ఇదే ప్రశ్న అడిగాడు. ఇంత విశ్వాసంతో, ఇంత వేగంగా ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. ఒకరు అన్నారు "అవును చూశాను" అని. కానీ, ఆ 'అవును' లో విశ్వాసబలం లేదు. మరొకరు అన్నారు "చూశానని చెపితే, నా గురించి గొప్పలు చెప్పుకోవడం అవుతుంది. చూడలేదు అంటే, ఆ జవాబు తప్పు అవుతుంది. కనుక ఏదీ చెప్పకపోవడమే సరైన పని. నీవు నీ జిజ్ఞాస ఏమిటో చెప్పు. సమాధానం చెప్పడానికి మేము ప్రయత్నం చేస్తాను."

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ తండ్రిగారు మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్‌ను కూడా అతడు ఈ ప్రశ్న అడిగాడు. ఆ సమయంలో మహర్షి దేవేంద్రనాథ్ నదిలో పడవలో విశ్రాంతి తీసుకుంటున్నారు. నరేంద్రనాథ్ గబాలున నదిలోకి దూకి ఈదుకుంటూ పడవలోకి వచ్చాడు. రాగానే ఆయనను దేవుడి గురించి అడిగాడు. ఆ ప్రశ్నకు ఆయన తడబడ్డారు. ఎవరో తన కాలరు పుచ్చుకుని తనను అడుగుతున్నట్లు ఆయనకు అనిపించింది. నరేంద్ర తన ఉత్కంఠతను పూర్తిగా వ్యక్తపరుస్తూ ప్రశ్న అడిగాడు. ఆ స్వరంలో భయపెట్టే ధోరణి లేదు. అయితే ఆ ఉత్కంఠతయే మహర్షిని తికమక పెట్టింది. ఆయన ఇలా అన్నారు "ముందు కూర్చో. ప్రశాంతంగా కూర్చో. నేను నీ ప్రశ్నకు సమాధానం చెప్తాను." తన ప్రశ్నకు ఆయన వద్ద సమాధానం లేదని ఆయన వ్యవహారం వల్ల నరేంద్రనాథ్‌కు అర్థమైపోయింది. "ఇక మీరేమి చెప్పనక్కరలేదు; నాకు జవాబు దొరికింది" – అంటూ నరేంద్రనాథ్ అక్కడ నుండి తిరిగి వచ్చాడు.

సిద్ధయోగుల వ్యవహారం నుండి, వైఖరి నుండి తన ప్రశ్నకు సమాధానాన్ని పసికట్టగలిగిన నరేంద్రనాథ్ యాత్ర రామకృష్ణుల సన్నిధిని చేరి పూర్తయింది. రామకృష్ణులు నరేంద్రనాథ్‌తో ఇలా అన్నారు – "నీవు కోరుకునేది ఏదో కాళీమాతనే కోరుకో. నన్ను ఏమీ అడగకు."

రామకృష్ణులు ఈ మాట అన్నప్పుడు నరేంద్రనాథ్ మనస్సులో తన కుటుంబం గడవడం ఎలా అనే చింత సుడులు తిరుగుతోంది. గురువుగారు అలా చెప్పిన మీద అతడు ఆలయంలోని కాళీమాత విగ్రహం ఎదుటకు వెళ్ళాడు. కానీ, ఏమీ కోరబుద్ధి కాలేదు. కాళీమాత మనోహర రూపం అతడిని తన్మయుణ్ణి చేసింది. ఆ

**లోపాలను సరిదిద్దుకుని జీవితాన్ని నందనవనంగా చేసుకోవాలి**

తన్మయత్వంలో అతడు అడగాలనే విషయమే మరచిపోయాడు. ఏమీ అడగకుండానే తిరిగి వచ్చాడు. రామకృష్ణులు అతడిని మరి రెండు మారులు ఆలయంలోకి పంపారు. నరేంద్రనాథ్ ఆ రెండు మారులు అలాగే తిరిగివచ్చాడు. ఆ తర్వాత గురువుగారు ఇలా అన్నారు –

**"మాత పని చెయ్యి. మాత తనకు తానుగా నీ విషయం చూసుకుంటుంది. నీ కుటుంబానికి అన్న వస్త్రాలకు ఎన్నడూ లోటు ఉండదు."**

నరేంద్రనాథ్‌ను కలుసుకున్న అయిదు సంవత్సరాల తర్వాత రామకృష్ణులు తనువు చాలించారు. ఆ సంఘటన ఒక దైవీ ప్రణాళికలో భాగంగా కనిపించింది.

ఒక రోజున ఆయన తమ శిష్యులతో ఇలా అన్నారు – "వినండి, ఇక ప్రజలతో ఎక్కువగా మాట్లాడలేను. కనుక – నరేంద్ర, రాజా (రాఖాల్ మహరాజ్), తారక్, బాబు (బాబురామ్), యోగీన్, శశి మున్నగు శిష్యులకు శక్తి ఇవ్వవలసిందిగా మాతను (కాళీమాతను) అడిగాను. ఇక నుండి వీరే భక్తులకు ఉపదేశాలను ఇస్తూ ఉండాలి."

ఆయన ఇలా ప్రకటించిన కొద్ది రోజులకు ఆయన గొంతులో నొప్పి ప్రారంభమయింది. నొప్పి ఎక్కువయింది. భోజనం చేయడం కష్టమయింది. రోగం ముదిరింది. చికిత్స చేయించుకోవలసిందిగా భక్తులు ఆయనను కోరారు. రామకృష్ణులు ఇలా అన్నారు

"అంతా మాత ఇచ్ఛ. ఆమె కోరుకుంటే రోగం నయమవుతుంది. ఆమె కోరకపోతే ఎన్ని చికిత్సలు జరిపినా ప్రయోజనం ఉండదు."

## ఇహలీల ఉపసంహారణ

ఔషధాల తయారీ ప్రక్రియలో జరిగే క్రూరత్వమే ఆయన చిక్సితకు అంగీకరించక పోవడానికి ముఖ్య కారణం. పశుహింస జరుపకుండా తయారుచేసిన ఔషధాలు వాడవలసిందిగా భక్తులు ఒత్తిడి చేశారు. హోమియోపతి, ఆయుర్వేద చికిత్సలు జరిగాయి. కానీ ప్రయోజనం లేకపోయింది. పరిస్థితి క్షీణించింది. ఒక రోజున రామకృష్ణులు ఇలా అన్నారు రోగం తగ్గనప్పుడు, దానికోసం శ్రమించవలసిన అవసరం ఏముంది? మాతను ఎందుకు కష్టపెట్టాలి? ఆ రోజున ఆయన భోజనం చేయలేదు. శారదామాత పంపిన భోజనం పళ్ళెం అలాగే తిరిగి వచ్చింది. శారదామాత భక్తులకు ధైర్యం చెప్పారు. శరీరాన్ని విడిచిపెట్టాలని రామకృష్ణులు నిర్ణయించుకున్నారని ఆమె వారికి చెప్పారు. ఆ రోజు ఆగస్టు 16. ఆయన పగలంతా మామూలుగా కనిపించారు. సాయంత్రం కడుపునిండా భుజించారు. అర్ధరాత్రి గడచిన తర్వాత సుమారు ఒంటిగంటకు రామకృష్ణ పరమహంస తమ ఇహలీలను ఉపసంహరించుకున్నారు. వారి శిష్యులు వారు తమకు అప్పగించిన బాధ్యతను నిర్వహిస్తామని సంకల్పం చేశారు. గురువుగారి పార్థివ శరీరానికి శ్రద్ధా భక్తులతో ప్రణామం చేసి, సమాధి చేశారు.

## కాంతితో నిండిన కొత్త జగత్తు

పూజ గదిలో కూర్చున్న శ్రీరామ్ ఈ దృశ్యాల యాత్ర చేస్తూ మౌనం వహించారు. ఆయన ఆ స్మృతుల నుండి బయటికి వచ్చారు. ఎదుట ప్రసన్నంగా నిలచి ఉన్న మార్గదర్శక సత్తాను పరికించారు. స్మృతుల నుండి తిరిగి రావడం వల్ల చేతన అలసినట్లు అయింది. శ్రీరామ్ జరిపిన అంతర్ యాత్ర సూక్ష్మము, దివ్యము అయిన యాత్ర. అయినా, వర్తమానంలోనికి తిరిగి వచ్చేటప్పటికి అలసట ఆయనను ఆవరించింది. మార్గదర్శక సత్తా కుడి చేతిని ముందుకు చాపారు. ఆయన తన బొటనవ్రేలును శ్రీరామ్ భ్రూమధ్యం (కనుబొమ్మల మధ్య భాగం) లో ఉంచారు. తమ నాలుగు వ్రేళ్ళను శ్రీరామ్ శిరస్సులోని సహస్రారం లేక బ్రహ్మరంధ్రంపై ఉంచారు. ఈ స్పర్శ వల్ల శ్రీరామ్ అలసట తొలగిపోయింది. చేతనలో స్ఫూర్తి ఉప్పొంగింది. ఒక క్రొత్త ప్రపంచం ఆయన ఎదుట నిలచింది. ఆ జగత్తులో కాంతితో నిండిన పూజ గది, గురుదేవులు, తాను, దివ్య సుగంధంతో నిండిన వాతావరణ అనుభూతి మాత్రమే శ్రీరామ్‌కు మిగిలింది.

*(సశేషం)*

– *అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## బెంగుళూరులో అశ్వమేధ మహా యజ్ఞం

*భారతదేశమును సశక్తితో కూడినదిగా, సమర్థవంతమైన దేశముగా, సమృద్ధివంతముగా చేయుటకై కర్ణాటక రాజధాని బెంగుళూరులో (కృష్ణవిహార్, ప్యాలస్ గ్రౌండ్స్) అశ్వమేధ మహాయజ్ఞం 2014 జనవరి 17 నుండి 20 తేదీలలో జరుగనున్నది. ఈ కార్యక్రమ సాఫల్యం కొరకై యావద్భారతావనిలో సామూహిక గాయత్రీ సాధన ప్రారంభించబడినది. లక్షలాది పరిజనులు గాయత్రీ మంత్రజపం, గాయత్రీ మంత్రలేఖనం చేయుచూ దీనిలో భాగస్వాములగుచున్నారు. కావున మీరు, మీ పిల్లలు కూడా ఈ సాధనలో భాగస్వాములై తరగని పుణ్య సుఖశాంతులు ప్రాప్తించుకొనగలరు.*

**లోపాలు సరిదిద్దుకున్న వ్యక్తి మచ్చలేని చంద్రుడే**

కఠోపనిషత్తు-8

# ప్రథమ అధ్యాయం-ప్రథమ వల్లీ

*(గత సంచిక తరువాయి...)*

## అమృతాసనము - సువర్ణవిద్య

అమృతాసనము (శవాసనము) వేస్తున్నప్పుడు చనిపోయిన వ్యక్తి యొక్క మానసిక స్థితి ఉంటుంది. అతను ఎలా ఉంటాడు? అతను ఏమి ఆలోచించడు. ఏ బంధము లేదు. ఏ పని చెయ్యడు. ఆ స్థితినే అమృతాసనస్థితి అంటారు. రాత్రి పడుకునే ముందు ఆలోచనారహిత, ఏ కోరికలు లేని స్థితిలోకి వెళ్ళి పడుకోండి. అయితే అమృతాసనము వెయ్యలేము. అది వేయబడదు. ఆ స్థితిలోకి వెళ్ళాలి. **అమృతాసనము సరిగ్గా వేస్తే 22 రకాల రోగములు తగ్గిపోతాయి, అది వేసినవారు అన్ని చింతలనుండి దూరమౌతారు.**

మహాభారతములో అర్జునుడికి యుద్ధారంభమున వచ్చిన స్థితి ఏమిటి? వణుకు. ఎదురుగా ఉన్న తాతలను, గురువులను, చుట్టాలను చూసేటప్పటికి అయ్యో! వీరంతా నా వారే వీరిని నేను ఎలా చంపేది? అని యుద్ధము చెయ్యబుద్ధి కాలేదు. తర్వాత భయము వేసింది. ముఖ్యముగా భీష్ముడు, ద్రోణుడు, జయద్రథుడు, కర్ణుడు వీరిని చూసి భయపడతాడు. ఎందుకు భయపడతాడో చూడండి.

భీష్ముడు ఇచ్ఛా మరణము కలవాడు.

ద్రోణుడు తనంతట తాను బాణములను వదిలేస్తే తప్ప యుద్ధములో ఆయనను ఎవ్వరు గెలువలేరు.

జయద్రథుడు శివుని నుండి పాండవులలో ఒక్క అర్జునుడిని తప్ప మిగతా నలుగురిని యుద్ధములో ఒక్కరోజు గెలువగలిగే వరమును పొందాడు. ఇక మిగిలింది ఎవరు? కర్ణుడు.

కర్ణుడికి స్వయముగా అర్జునుడి తండ్రి అయిన ఇంద్రుడే 'శక్తి' అనే బాణమును అనుగ్రహిస్తాడు. దానిని ఎవరి మీద ప్రయోగిస్తే వారు తప్పక మరణిస్తారు. దానిని యుద్ధములో అర్జునుడి మీద ప్రయోగించేందుకు కర్ణుడు దాచి ఉంచాడని అందరికి తెలుసు. అందుకే అర్జునుడికి భయమేసింది. ఈ నలుగురిని చూసేటప్పటికి అర్జునుడికి దడపుడుతుంది.

అప్పుడు శ్రీకష్ణుడు -

**ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ**
**కర్ణం తథాన్యానపి యోధవీరాన్**
**మయా హత్వాంస్త్వం జహి మా వ్యథిష్ఠా**
**యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥(గీత అ॥11 శ్లో॥34)**

**తాత్పర్యము:** ద్రోణ భీష్మ కర్ణ జయద్రథాదులు, ఇంకా ఇతరులు ఎందరో నా చేత సంహరింపబడిన వారిని నీవు వధించుము. భయము చెందకుము. నిస్సందేహముగా నీవు శత్రువులను జయించగలవు కనుక యుద్ధము చేయుము.

అర్జునుడికి వచ్చిన పిరికితనమే మనకు నిరంతరము, ప్రతి చోట మన జీవితాలలో కనిపిస్తూ ఉంటుంది. కనుక శ్రీకృష్ణుడు, అర్జునుడికి ఉపదేశించిన మొత్తము సాంఖ్య యోగములో ఎలా విశ్రాంతి తీసికోవాలి? మరియు బాధ్యతను ఎలా నిర్వర్తించాలి? అనేది చెప్పబడి ఉన్నది.

**మనిషి పూర్తిగా విశ్రాంతి తీసుకుంటే అతని కాలేయ వ్యవస్థ, చిన్నప్రేవులు మొదలైన శరీర భాగములలోని కణములు; అవి ఎంత అమృతత్త్వమును కలిగిన కణములుగా అభివృద్ధి చెందుతాయో మన ఋషులకు తెలిసినంతగా ఈనాటి శాస్త్రవేత్తలకు తెలియదు. ఇది ఆధ్యాత్మిక విజ్ఞానము యొక్క పరాకాష్ఠ. నువ్వు అమృతాసనము సరిగ్గా వేసికోగలిగితే, ఆ విధానము నీకు పరిపూర్ణముగా తెలిస్తే సృష్టిలో నువ్వు ఎదుర్కో లేనిదంటూ ఏదీ ఉండదు. నువ్వు సర్వశక్తిమంతుడవు అవుతావు.**

అయితే అది అంత తేలికా? తేలిక కాదు. దాన్ని చేసి చూస్తే, నిజము తెలిసి చేస్తే తేలికే. నువ్వు రాత్రి పడుకునే ముందు అమృతాసనము వేస్తే నీకు ఇన్ని లాభాలు వస్తాయంటే, అది చెయ్యలేకపోవడము యెంత దురదృష్టమో చూసుకోండి. ఈ సాధన చెయ్యడానికి నిత్యజీవితములో మీరు ఏ పనులు మార్చుకోవలసిన పని లేదు. పడుకునేముందు చనిపోయేవ్యక్తి ఎంత నిశ్చింతగా, ఎంత హాయిగా, బాధ్యతారహితముగా ఉంటాడో అలా ఉండాలి. ఆ నిశ్చింత కలిగిన స్థితిలో నీకు వచ్చే అనుభూతులన్నీ కఠోపనిషత్తులో చెప్పబడుతున్నాయి. ఈ ఉపనిషత్తు నచికేతునిదే కాదు, మీది కూడా.

**నిద్రాస్థితిని ఉపయోగించుకోవడమే కఠోపనిషత్తులో చెప్పబడ్డ విద్య.**

ఎంత జ్ఞానవంతుడయినా గర్వం పనికిరాదు

నచికేత-యమధర్మరాజ సంవాదము ప్రతిరాత్రి మీరుకూడా చేసుకోగలరు. దీనికి పెద్ద నిరూపణ ఏమిటంటే శాస్త్రవేత్తల జీవితచరిత్రయే. వారు చెప్పేదేమిటంటే మేము కనిపెట్టిన ప్రతి వస్తువు, ప్రతి యంత్రము మాకు నిద్రావస్థలో అవతరించినదే అని. అంతేతప్ప అది మా ప్రయోగమువలన వచ్చినది అని మేము అనుకోవటము లేదు అనికూడా స్పష్టముగా చెప్తున్నారు. అంటే నిద్రావస్థలో వారు ఒక విశేషమైన మానసికస్థితిలో నిద్రిస్తూ ఉంటే వారి సమస్యకి తగిన పరిష్కారము లభించేది.

ఎడ్గర్‌కేసి అనే అద్భుతమైన వ్యక్తి ఈ స్థితిలో ఉండే సుమారు 3,000 మంది వ్యక్తుల పూర్వజన్మ వృత్తాంతములను పూర్తిగా పరిశీలించి వారికి వచ్చిన రోగములు, కష్టములు, మానసికస్థితిలో ఉండే లోపాలు అన్ని సరిచేశాడు. మెనీమేన్షన్స్ ("Many Mansions" by Dr. Gina Cirminara - an Edgan Caycee book) అనే పుస్తకములో ఈ 3000 మందికి జన్మజన్మల పరంపరలో ఏమి జరిగిందో, ఎలా జరిగిందో చెబుతాడు. హిట్లర్ బ్రతికున్న కాలములో అమెరికా ప్రెసిడెంట్ ఆయన్ని తన దగ్గరకు పిలిపించుకుని ఆయన జ్ఞానమును ఉపయోగించుకుని హిట్లర్ యొక్క అనేక జన్మల వృత్తాంతమును చెప్పించుకుని, అతను ఏమి చెయ్యబోతున్నాడో; దానికి విరుద్ధముగా వీరు ఏమి చెయ్యాలో ఆలోచించి యుద్ధ వ్యూహమును పన్నారు. ప్రపంచయుద్ధములలో కర్మసిద్ధాంతము ద్వారా అనేక చమత్కారములు జరిగాయి. ఇన్ని చమత్కారములు చేసిన ఎడ్గర్‌కేసీకూడా పడుకుని అచేతనస్థితిలోకి వెళ్ళేవాడు. నిద్రలో అందరి జీవితాల యొక్క పరంపర, ప్రారబ్ధ కర్మలు అతనికి చాలా స్పష్టముగా కనిపించేవి. ఆయన చేసింది కఠోపనిషత్తుయొక్క ప్రయోగాత్మక కర్మ. ఈ ఉదాహరణను బట్టి **'నువ్వు పూర్తిగా విశ్రాంతి తీసుకుని పూర్తిగా నీ భౌతిక చేతనత్వమును పోగొట్టుకోగలిగితే నీకు సర్వజ్ఞత్వము వచ్చేస్తుంది'** అని తెలుసుకోవాలి. శాస్త్రవేత్తలు కూడా మేము మా లక్ష్యదిశలో పనిచేసి అలసిపోయి పడుకుంటే నిద్రలో ఏదో జరిగి, మా సమస్యకు పరిష్కారము లభించేది అని చెప్పారు.

ఒక శాస్త్రవేత్త ఒక కలగన్నాడు. ఆ కలని వెంటనే కాగితము మీద వ్రాశాడు. దాన్ని ఒక వ్యాసముగా వ్రాసి పత్రికలో ప్రచురించాడు. ఆ వ్యాసములో చెప్పబడ్డ విషయమునకే ఆయన తర్వాత నోబుల్ బహుమతిని పొందాడు. అంటే అతను నిద్రలో దర్శించిన దానికి అక్షరరూపమిచ్చాడు. దానితో ఒక గొప్ప సత్యమును కనుగొన్న కారణముచేత నోబుల్ బహుమతిని పొంద గలిగాడు. నిద్రాస్థితియొక్క చమత్కారములు అలానే ఉంటాయి అని దీనిని బట్టి అర్థమవుతుంది.

## జాగరూకస్థితిలో మృత్యువును పొందిన నచికేతుడు

మనము మెలకువగా ఉండి ధ్యానము చెయ్యలేము. దానికోసము బాహ్య శరీర స్మృతిని పూర్తిగా కోల్పోవాలి. కానీ జాగరూకత ఉండాలి. అప్పుడు ధ్యాన స్థితిలో సరైన ఫలితములను పొందగలుగుతాము.

అందుకే సాంఖ్యయోగములో కూడా జగద్గురువు ఏమి చెబుతాడంటే –

**యా నిశా సర్వ భూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతోమునేః**
**(గీత అ॥2, శ్లో॥69)**

**తాత్పర్యము:** సకల ప్రాణికోటికి ఏది రాత్రివలె ఉండునో ఆ నిత్యజ్ఞానరూపమగు పరమానందమును పొందిన దశలో స్థిత ప్రజ్ఞుడగు యోగి మేలుకొని ఉండును. ఇక నాశవంతములగు ఏ సంసార సుఖములను పొందిన దశలో సకల ప్రాణులు మేలుకొని ఉందురో, పరమాత్మ తత్వమెరింగినట్టి మునికి అది రాత్రితో సమానము.

మెలకువగా ఉండి పనులన్నీ చేస్తే కూడా విశ్రాంతిగా ఉంటాము. ఎంత విశ్రాంతిగా ఉంటాము? చనిపోయిన వ్యక్తి ఎంత బాధ్యతారహితముగా, నిర్లక్ష్యముగా, ఆలోచనారహిత స్థితిలో ఉంటాడో అంత. అలాంటి ఆలోచనాస్థితికి నచికేతుడు వెళ్ళాడు. అలా వెళ్ళడానికి ఆయనకి మూడురాత్రులు పట్టింది. ఆ మూడు రాత్రులు ఈ భౌతిక చేతనత్వములో లేదు. మృత్యువును పొందిన చేతనత్వ స్థితిలోకి నచికేతుడు వెళ్ళాడు? ఎలా వెళ్ళాడు? ఏ ఆలోచనలతో వెళ్ళాడు?

'మా నాన్న నాకు తండ్రి మరియు గురువు. మరి ఆయన నన్ను యముడికి ఎందుకు దానమిచ్చాడు? నేను చాలా విషయములలో ప్రథముడిని, కొన్ని విషయములలో మధ్యముడిని. కనిష్ఠుడిని మాత్రము ఎందులోను కాను. మరి నన్ను ఎందుకు యముడికి దానమిచ్చాడు?' అన్న ఆలోచన వస్తుంది.

ఆ మానసికస్థితి ఉంటే అప్పుడు మీరు మెలకువగా ఉన్నా కూడా ధ్యానస్థితిలోకి వెళ్ళగలుగుతారు.

ముందు చాలాచోట్ల చెప్పబడిన గురుశిష్యుల సంబంధము ఈనాటి మానవుడు మర్చిపోయాడు. నిజమైన శిష్యుడు గురువు యొక్క కోరిక గురువు చెప్పకుండానే ఊహించుకుని తెలుసుకో గలగాలి. అది ప్రథమస్థితి శిష్యుని స్థాయి. నచికేతుడు ప్రథమ స్థితిలో ఉన్నవాడు. ఆధ్యాత్మిక విషయములలో ఈ ప్రాథమిక

**ధనం సంపాదించడంతోపాటు దానగుణం కూడా ఉండాలి**

సూత్రములను గుర్తుంచుకోండి. ఇది ఆత్మవిద్య నేర్చుకునేవారి జీవించే విధానము.

ఒకవేళ నేను నా గురువు చెప్పినది ముందే అవగాహన చేసుకోలేకపోతే ఆయన చెప్పింది వెంటనే చేస్తాను. కాబట్టి నేను మధ్యమ స్థితిలో ఉన్నాను. నేను కనిష్ఠుడిని కాదుగదా? మరి నా తండ్రి యముడికి ఎందుకు దానమిచ్చాడు? ఏ ఉద్దేశ్య పూర్తి కోసము నన్ను యముడికి ఇచ్చాడో తెలియలేదు అని అనుకుంటాడు నచికేతుడు. అనుకున్న తర్వాత మృత్యువుకు ఆధీనమౌతాడు. సరే యముడికి దానమిచ్చాడు కనుక, యమపురికి వెళితే ఆయన అక్కడ లేడు. మూడురోజులపాటు యమపురిలో నిరాహారముగా ఉన్నాడు.

**1వ ప్రశ్న: సాధకునికి బ్రహ్మవిద్యా ప్రాప్తి ఎలా సంభవం అవుతుంది?**

**జవాబు:** ఆత్మవిద్య నేర్చుకోదలచిన విద్యార్థి చనిపోయిన వ్యక్తి యొక్క మానసికస్థితిని కలిగి ఉంటూ, నిరాహారముగా మూడు రోజులు కేవలం ద్రవాహారముతో ఉండాలి. అప్పుడు గురువు బ్రహ్మ విద్యను బోధిస్తాడు. సాధకునికి బ్రహ్మవిద్య ప్రాప్తిస్తుంది.

**2వ ప్రశ్న: బ్రహ్మవిద్యాప్రాప్తికి ఋషులందించిన సాధనేది?**

**జవాబు:** బ్రహ్మవిద్యాప్రాప్తికి ఏమి కావాలో ఋషులకి తెలుసు. దానినే వారు ఒక సాధనగా అందించారు. ఆ సాధన ఏమిటంటే – మన ఋషులు రాత్రిపూట పడక ప్రక్కనే రాగిచెంబులో నీరు పెట్టుకుని పడుకుని, చనిపోయిన వ్యక్తి యొక్క మానసిక స్థితిలో నిద్రావస్థలోకి ప్రవేశించి అలా నిద్రలోకి జారిపోయేవారు. అమృతాసన స్థితిలోకి ప్రవేశించేవారు. తర్వాత ఆజ్ఞా చక్రములోకి ప్రవేశించి జ్యోతి దర్శనము కోసము ఉదాన వాయువుని అక్కడికి పంపేవారు. దానితో వారికి మెల్లగా జ్యోతి దర్శనమయ్యేది. దానితో అఖండ జ్ఞానమును పొందేవారు. అక్కడ అంతర్ సాధన జరిగేది. ఆ సాధనా ఫలితముగా రాగి చెంబు బంగారు చెంబుగా మారేది. మరునాడు ఉదయము నిద్ర లేస్తూనే ఆ చెంబులోని నీటిని త్రాగేవారు. అంటే ఋషులు అమృతాసన స్థితిలో పడుకోవడము ఒక సాధనైతే, దాని ప్రభావముచే రాగిచెంబు బంగారు చెంబుగా మారడము రెండవ సాధన. అమృతాసనస్థితిని పొందుట, సువర్ణ విద్య సాధించుట అనే రెండు సాధనలు ఏకకాలములో జరిగేవి.

**3వ ప్రశ్న: అమృతాసనస్థితి పొందటానికి గురుదేవులు శ్రీరామ శర్మ ఆచార్యగారు అందించిన అద్భుత సాధనేది?**

**జవాబు:** దీనిని పూజ్యగురుదేవులు శ్రీరామశర్మఆచార్య గారు "ప్రతి రోజు క్రొత్త జన్మ; ప్రతి రాత్రి క్రొత్త మృత్యువు" అనే సాధనగా అందించారు.

దీనికోసమే నేనుకూడా మిమ్మల్ని రాత్రి రాగిచెంబులో నీరు పెట్టకుని త్రాగమన్నాను. అది సువర్ణవిద్యకు నాంది. ఎప్పుడో అప్పుడు మీ చెమట అందులో పడి ఆ రాగిచెంబు బంగారముగా మారుతుంది. ఇది జరుగుతుందా? జరుగుతుంది. దానికి ఒక ఉదాహరణ రమణమహర్షి, ఆయన శిష్యుడు గణపతిముని.

## రమణమహర్షి - గణపతిముని

రమణ మహర్షి శిష్యుడు 'కావ్యకంఠగణపతి ముని'. రమణ మహర్షి కార్తికేయుని అవతారమైతే, గణపతిముని గణపతి అవతారమని చాలామంది అభిప్రాయము. కొన్ని విశేష పరిస్థితులలో "ఉమా సహస్రము" వ్రాయడానికి గణపతిముని తిరువణ్ణామలైలో రమణుని సన్నిధిలో కూర్చున్నాడు. అయితే మూడు రోజులలో దాన్ని పూర్తిచేయలేకపోతాడు. అప్పుడు రమణ మహర్షి ఆయన చెప్పింది వ్రాయడానికి ఐదుమందిని కూర్చోబెట్టి, తన శక్తి ప్రభావముచేత ఆ పుస్తకమును గణపతిముని చేత పూర్తి చేయిస్తాడు. అది అత్యంత శక్తివంతమైన స్తోత్రము. అది పూర్తయిన తర్వాత గణపతిమునికి శిరస్సులో విపరీతమైన వేదన కలిగింది. అయితే అది రమణుని దయవలన తగ్గింది. రమణమహర్షి – గణపతి మునిని 'నాయన!!' అని కూడా అనేవారు. 'నాయన' పేరు మీదనే గణపతిముని ఆత్మకథ విడుదలయ్యింది. ఆయన తెలుగు వాడే. ఉమాసహస్రము అనే ఆ పుస్తకము వ్రాయడము పూర్తయిన తర్వాత గణపతిముని మంచినీరు త్రాగిన రాగిచెంబు బంగారపు చెంబుగా మారిపోయింది. ఈ కాలములోనే వ్యక్తి యొక్క చెమట రాగిని బంగారముగా మార్చింది. ఈ విధానము కఠోపనిషత్తులో చెప్పబడినదే. ఆ సాధన చేస్తుంటే 'చనిపోయేవాడివి నువ్వు కాదు. ఈ శరీరము నువ్వు కాదు, ఇంద్రియములు నువ్వు కాదు. వీటన్నింటికి అతీతముగా – అజోపిసన్నవ్యయాత్మ– నువ్వు ఆత్మవి'. అనేది నీకు నిద్రలో అనుభూతికొస్తుంది. కాని, దానిని నిద్రలో అనుభూతి చెందటానికి నువ్వు సిద్ధముగా లేవు. కానీ ఆ సాధనాత్మకమైన కోణములో ఆలోచించడము లేదు. నిద్రాస్థితిని, జాగరూకతలో నిరంతరము అనుభవిస్తున్న వ్యక్తి రమణమహర్షి. గణపతిమునికి కూడా శాస్త్రవేత్తలకి నిద్రాస్థితిలో జరిగినదే జరిగినది. **రమణ మహర్షి ఉన్న స్థితినే నేటి వైద్యులు రిలాక్సేషన్ రెస్పాన్స్ అన్నారు.**

(సశేషం)

– డా।। మారెళ్ళ శ్రీరామకృష్ణగారి ఉపన్యాసముల నుండి

*సేకరణ: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఆర్తులకు సహాయపడని ధనం వ్యర్థం**

మస్తిష్కమే కల్పవృక్షం - 9

# సుఖదుఃఖాలు మానసిక స్థితిపై ఆధారపడి ఉంటాయి



నిస్సందేహంగా మన మస్తిష్కం అద్భుతమైన, విలక్షణమైన శక్తుల భాండాగారం. పరమాత్మ ద్వారా ప్రసాదించబడిన ఈ కల్పవృక్షం క్రింద కూర్చొని ఎవరైనా ఏడుస్తూ, ప్రాధేయపడుతూ ఉంటే ఎవరిది తప్పు? కల్పవృక్షం యొక్క విశేషమేమిటంటే ఎవరైనా దాని క్రింద కూర్చొని ఏ కోరిక కోరుకున్నా, వారి మనోవాంఛ తీరుతుంది. అటువంటి కల్పవృక్షం ఉందో లేదో తెలియనప్పటికీ, మస్తిష్కానికి సంబంధించినంత వరకు ఇది అక్షర సత్యం. మన మస్తిష్కాన్ని మనం కోరుకున్న దిశలో త్రిప్పి దాని నుండి సుఖంకాని, దుఃఖంకాని, సమస్యలు, సమాధానాలు, రోగాలు, ఆరోగ్యం ఏదైనా పొందవచ్చు. మానసిక సంతులనాన్ని కోల్పోయి మనమే చెడు పరిస్థితులను ఆహ్వానిస్తున్నాం. ఇవి ఏ బాహ్య కారణాల వలన ఉత్పన్నం కావు.

ఉదాహరణకు ఆరోగ్యం గురించి తీసుకుంటే, ఆరోగ్య రక్షణకు కారణం రక్తశుద్ధి అని ఇంతకు ముందు భావించేవారు. కానీ ఇప్పుడు శరీరంపై మస్తిష్కానికున్న ఆధిపత్యం ఏ పదార్థానికి కానీ, అవయవానికి కానీ లేదని విజ్ఞానవేత్తలు నిర్ణయానికొచ్చారు. **మస్తిష్కం కలత చెందితే దాని ప్రభావం మొత్తం నాడీ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తుంది. ఫలితంగా అవయవాలు వాటికి నిర్ధారింపబడిన కార్యకలాపాలను సరైన పద్ధతిలో పూర్తి చేయలేవు. ఇటువంటి స్థితిలో వాటిని రోగాలు చుట్టుముడతాయి.**

కలతచెందిన, క్షోభతో ఉన్న మస్తిష్కం తన ఆలోచన, ప్రణాళిక క్రమంలో సమన్వయాన్ని కోల్పోతుంది. దైనిక కార్యపద్ధతిని నిర్ణయించడంలో పొరపాట్లు జరుగుతుంటాయి. తన స్వస్థితిని కూడా సరిగ్గా అంచనా వేయటం కుదరదు. వ్యతిరేక పద్ధతిలో ఆలోచించటం వలన నిరాశ కలుగుతుంది. భవిష్యత్తు భయం కలిగించేదిగా, అంధకారమయంగా కనపడుతుంది. ఇటువంటి వ్యక్తులు ఉదాసీనతకు, అస్తవ్యస్తతకు గురి అవుతారు. ఆవేశం, ఉత్తేజంవంటివి ఏర్పడితే దుస్సాహసం, దుష్టత్వం, ఆక్రోశం, కలహాలవంటి ఘటనలు చోటు చేసుకుంటాయి. అందరితో వారి వ్యవహార శైలి అసంబద్ధంగా ఉంటుంది. ఫలితంగా వచ్చే జవాబులు కఠినంగా ఉంటాయి. దీనివలన మనోమాలిన్యం, ద్వేషం, చిక్కులు ప్రారంభమవుతాయి. కోపం, విసుగు ఎక్కువై ఆక్రమణ ప్రత్యాక్రమణలు మొదలవుతాయి. ఆక్రోశం వెలిబుచ్చలేకపోతే లోపల ఉన్న దుర్భావనలు మోసం, నింద, దురభ్యాసాల రూపంలో బయటపడతాయి. ఈ వలయంలో చిక్కుకున్న వ్యక్తులు మానసిక దౌర్బల్యానికిలోనై, ఆంతరంగిక అశాంతికి గురవుతారు. దీనికి ప్రతిక్రియగా జీవితంలో అన్ని రంగాలలో, అపజయాన్ని చవిచూస్తారు, కలత చెందుతారు.

**సమస్త జీవన కార్యాల మధ్య సమన్వయం లోపించి వ్యాధుల రూపంలో పట్టి పీడిస్తాయి.** శరీరం రోగాల నిలయమవుతుంది. మస్తిష్కాన్ని ఓటమిని అంగీకరించేలా చేసి అవాస్తవికమైన వాటికి గుర్తింపునిచ్చి మస్తిష్కాన్ని శిథిలం చేస్తుంది. ఇటువంటి వ్యక్తులు వివేకహీనులై, అవాస్తవికమైన, అవాంఛనీయమైన కల్పనాలోకంలో విహరిస్తూ తలలు పగులకొట్టుకోవడం చూడవచ్చు. వీరి వ్యక్తిత్వం క్రమక్రమంగా ఎక్కువ భయం కలిగించేదిగా, ఏవగించుకునే విధంగా తయారవుతుంది. ఆశ్రితులు తప్పనిసరై సానుభూతిని చూపటం, సేవ చేయడం అటుంచితే, ఇతరులు విరోధించటం, అసహ్యించుకోవటం చేయకపోయినా, దూరంగా ఉండి ఉదాసీనంగా వ్యవహరిస్తారు.

ప్రస్తుత కాలంలో అభివృద్ధి చెందిన వైద్య విజ్ఞానం ఎన్నో రోగాలకు మంచి చికిత్సా విధానాలను కనుగొన్నది. దీనివలన జబ్బులతో మరణించేవారి సంఖ్య బాగా తగ్గింది. అయినప్పటికీ కొన్ని కొత్త రోగాలు రెట్టింపు వేగంతో వృద్ధిచెందుతూ, మృత్యువును కలిగించడమే కాక, పూర్తి మానవజాతినే నిర్జీవస్థితిలో ఉంచే పరిస్థితిని కల్పిస్తున్నాయి. హృదయ రోగాలు, మధుమేహం, కాన్సర్, క్షయ మొదలైనవి ఎక్కువ అవటం బాధాకరం. కొన్ని వ్యాధులు ఎంత భయంకరమైనవంటే, మానవులు వారి జీవితానందాన్ని కోల్పోతూ, అంతులేని బాధను అనుభవిస్తూ అకాల మృత్యుముఖంలో చిక్కుకుని పీడింపబడతారు. ఇటువంటి రోగాలలో ముఖ్యమైనవి మానసిక ఒత్తిడి, ఒంటరితనం, దాని వలన కలిగే నిద్రలేమి.

జ్వరం, అతిశ్రమ, దుర్ఘటనలు, ఆకస్మిక విపత్తులవంటి కారణాల వలన అప్పుడప్పుడు మస్తిష్కం ఆవేశానికి లోనుకావటం జరుగుతుంది. లోలోపలే వేడి, ఉత్తేజం, అశాంతి ఏర్పడుతుంది. ఆ అశాంతి వలన విచిత్రమైన ఉద్వేగం ఏర్పడుతుంది. ఏం చేయాలి? ఎక్కడకు వెళ్ళాలి? కూర్చున్నా, నిల్చున్నా శాంతి లభించదు. తన వారిని భరించలేరు. పరాయివారిని భరించలేరు. మాట్లాడటానికి ఇష్టపడరు. మాట్లాడకుండా ఉండలేరు. ఆలోచనా విధానం అస్తవ్యస్తమై కొత్తగా ఏర్పడిన సమస్యల నుండి విముక్తి

**ఆపన్నులను ఆదుకున్నప్పుడే ధనం సఫలం అవుతుంది**

పొందేందుకు సరైన ఉపాయం కూడా ఆలోచించలేరు. దైనందిన జీవితంలోని సామాన్య కార్యాలను, అనివార్యమైన బాధ్యతలను నిర్వర్తించటం కూడా కష్టమవుతుంది. మానసిక ఒత్తిడి ఎంత ఎక్కువగా ఉంటే అదే నిష్పత్తిలో మానసిక క్షోభ కూడా విస్తరిస్తుంది. తేలికపాటి అశాంతితోపాటు తలబద్దలయ్యే ఉద్విగ్నత వరకు వివిధ రకాలుగా వ్యాధి ప్రకోపిస్తుంది. ఆ ఉన్మాదంలో ఏర్పడిన పరిస్థితులు మానసిక క్షోభను పోగొట్టకపోగా ఇంకా చిక్కులను కల్పిస్తాయి.

సామాన్య విపత్తుల కారణంగా ఉత్పన్నమయ్యే మానసిక ఒత్తిడి కొన్ని ఋతువులను అనుసరించి వచ్చే జ్వరంలాగా సమయం గడిచిన కొద్దీ తేలిక పడుతుంది. ఆవేశం చిరస్థాయిగా ఉండదు. అది కూడా జ్వరంలాగా వచ్చి ఆటుపోట్లు తరహాలో తగ్గిపోతుంది. గాయాలను మాన్పేశక్తి మన రక్తంలో ఉన్నది. విపత్తులనే అఘాతాలను కూడా తట్టుకునే శక్తి కాలచక్రంలో నిబిడీకృతమై ఉంటుంది. బాహ్య పరిస్థితుల వలన, కష్టాల కారణంగా కలిగే మానసిక ఒత్తిడి వానాకాలపు కాలువలాగా పొంగి చల్లబడిపోతుంది. కాలంతోపాటు స్మృతి విస్మృతిగా మారుతుంది. ఏ స్వజనుల వియోగంతో జీవించటం అసంభవంగా కనపడుతుందో, అది కాలక్రమాన విస్మృతి పథంలోకి జారి, వారు లేక పోయినప్పటికీ జీవననిర్వహణ సరళంగా సాగుతూ ఉంటుంది. ఈ విధంగా ప్రత్యేకమైన సదుపాయాలను పోగొట్టుకున్నప్పటికి ఆ లోపాలను సహించి, విపత్తులు స్వభావంలో సమ్మిళితమై చిరకాల సహచరిలా కలిసి గడుపుతారు.

ఒత్తిడి అనే భయంకర, శారీరిక, మానసిక వ్యాధి ఈ రోజులలో బాగా ఎక్కువయింది. మనలో చాలామంది వ్యక్తులు మానసిక ఒంటరితనంతో బాధపడుతూ, దానివలన కలిగిన ఒత్తిడితో, అశాంతితో కలత చెందిన మానసిక స్థితిలో సమయాన్ని గడుపుతున్నారు. ఇది ఒక విధమైన మానసిక జ్వరం. జ్వర పీడితులు ఆ బాధను భరించడానికి, దానిని ఎదుర్కొనడానికి ఎంత శక్తిని ఖర్చు చేయవలసి ఉంటుందో అనేది అందరికీ తెలిసినదే. మానసిక ఒంటరితనంలో కూడా బహుశః అదే విధమైన శక్తిక్షీణత కలుగుతుంది.

ఈ మానసిక ఒత్తిడికి, ఒంటరితనానికి కారణాలు విభిన్నమైనవి అయినప్పటికీ, జీవ రసాయనిక దృష్టితో చూస్తే వాటి ప్రతిక్రియ వ్యక్తుల మనస్సులపై ఒకే విధంగా ఉంటుంది. అది ఆకలి, అత్యధికమైన శారీరిక శ్రమ, జబ్బులు మొదలైన కారణాల వలన కావచ్చు లేక మానసికమైనదైనా కావచ్చు.

కెనడాకి చెందిన ప్రఖ్యాత శరీర శాస్త్రజ్ఞుడు శ్రీ హెన్స్‌సేల్యే ఈ ఒత్తిడి, దానికి సంబంధించిన సమస్యల గురించి చాలా లోతుగా అధ్యయనం చేశారు. ఒక వ్యాపారి వ్యాపార సంబంధిత ఆలోచనలు, పనులు, ప్రణాళికలు తయారు చేస్తున్నప్పుడు ఒక ఆటగాడు ఆటలో పాల్గొనేటప్పుడు, ఆటల గురించి ఆలోచిస్తున్నప్పుడు లేక ఒక శాస్త్రజ్ఞుడు సమస్యలతో యుద్ధం చేస్తున్నప్పుడు, ప్రణాళికను ఊహించి ప్రయోగం చేస్తున్నప్పుడు వీరందరి బాహ్య పరిస్థితులు వేరువేరు అయినప్పటికీ వీరిలో కలిగే ఆంతరిక ప్రతిక్రియలు ఒకేవిధంగా ఉంటాయని వీరు ఉద్ఘాటించారు. వీరిలో అధివృక్క గ్రంథి కార్టెక్స్ (adrenal gland cortex) ఎక్కువగా పని చేస్తుంది. రక్తం నుండి హార్మోన్లు అధికంగా స్రవించి, ఛాతికి చెందిన ఎండ్రో క్రియిన్ గ్రంథి (దీనినే థైమస్ అంటారు) ముడుచుకుపోతుంది.

ఈ ఒత్తిడి వైజ్ఞానిక కార్యకలాపాల వలన, లేక వ్యాపార పరమైన పనుల వలన, లేక ఆటలకు సంబంధించినదైనా ప్రతిక్రియలో తేడా ఉండదు. ఎల్లవేళలా వీటి ప్రతిక్రియ ఒకే విధంగా ఉంటుంది. ప్రతిక్రియ ఒకే విధంగా ఉన్నప్పటికి ఒత్తిడి తీవ్రతను అనుసరించి ప్రతిక్రియలో భేదాలుంటాయి. ఒత్తిడి అధికంగా ఉన్నట్లయితే కార్టెక్స్ ఎక్కువగా పనిచేయటం, హార్మోన్లు ఎక్కువగా స్రవించటం, థైమస్ గ్రంథి వేగంగా ముడుచుకోవటం జరుగుతుంది. ఒత్తిడి తక్కువగా ఉంటే ఈ ప్రతిక్రియల వేగం తక్కువగా ఉంటుంది.

*(సశేషం)*

*- అనువాదం: శ్రీమతి ఎ.ఆర్.నిర్మల*

## బాపు మహాత్ముడెలా అయ్యాడు?

*కాకా కాలేల్కర్ బాపూకు అతి సన్నిహితుడు. ఒక విదేశీయుడు ఆయనను దేశంలోని అన్ని వర్గాలవారిపై బాపు ప్రభావం ఇంతగా పడటానికి కారణమేమిటని ప్రశ్నించాడు. దానికి ఆయన బాపు 1. ఖచ్చితమైన సంయమనాన్ని పాటిస్తారు. 2. ఏదైతే మనసులో ఉంటుందో అదే ఆయన వాక్కుగా వెలువడుతుంది. 3. తన క్రియాకలాపాలు యావత్తు కూడా సర్వ మానవహితం కోసమే ఆయన ఆచరిస్తారు. ఏది చెప్తారో అదే చేస్తారు. వాక్కు, ఆచరణ ఒకటిగా పెనవేసుకొని ఉంటాయని బదులు పలికాడు. ఇది బాపు సర్వ మానవాళికి అనుకరణ యోగ్యమైన, మహాత్ముడు కావటానికి అతి సరళమైన వెలుగుబాటగా అందించారు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**కేవలం కష్టపడి చదివితే సరిపోదు, ఇష్టంగా చదవాలి**

# కుండలినీ సాధన ఎందుకు? ఏ ప్రయోజనం కొరకు?

ఈ రోజులలో విశ్వవ్యాప్తంగా ఉన్న వినాశక, విధ్వంసక సంకటములు మానవుని, ఈ సృష్టి యొక్క అస్థిత్వమునే సంకటములలో పడవేస్తున్నాయి. ఇవి ఎంత ప్రమాదకరమైనవో వాటిని ఎదుర్కోదగిన ఉపకరణములు కావాలి. ఏనుగు చిన్న పిస్తోలుతో చావదు. కోటను పడగొట్టాలంటే బాణాలు చాలవు, ఫిరంగులు కావాలి. వృత్రాసురుని వధించాలంటే వజ్రాయుధం కావలసి వచ్చింది. మహిషాసురుని సంహరించడానికి దుర్గాదేవి యొక్క ఆవేశపూరిత ఆక్రోశం కార్యాన్వితం అయింది. పర్వతాన్ని ఎత్తడానికి హనుమంతుని పౌరుషం కావలసి వచ్చింది. కొండలను పగలగొట్టాలంటే డైనమైట్ కావాలి. ప్రస్తుత పరిస్థితులలో రచనాత్మక సామర్థ్యం మాత్రమే సరిపోదు, సంఘర్షణ కొరకు బ్రహ్మాస్త్రం వంటి సాధనములు అవసరమవుతాయి.



సంకటములనే దానవ సముదాయములు ఏకత్రితమై సభ్యతను నాశనం చేస్తున్నాయి. వీటిని చూస్తుంటే ప్రళయం వస్తున్న దృశ్యం కనుపించవచ్చు. వీటిని ఆపటం చాలా అవసరం. వీటిని నిర్వీర్యం చేయాలి. వీటి కొరకు ఇంకొక రకమైన ఆయుధాలు కావాలి. గ్రంథ రచనకు కాగితం, కలం కావాలి. వంట ఇంట్లో గోధుమ పిండి, బియ్యం, పప్పు, ఉప్పు, ఇంధనం మొదలైనవి కావాలి. ధూర్తులు, దుర్మార్గులు సామూహిక ఆక్రమణ చేసి లూటీ, రక్తపాతం చేస్తుంటే వారిని ఆపడానికి తుపాకి గుండ్లు అవసరమవుతాయి.

మా జీవితం గాయత్రీమయంగానే గడిచిపోయింది. మిగిలిన జీవితం కూడా అలాగే గడచిపోతే మంచిదే. నేటి విపత్కర పరిస్థితులను నివారించేందుకు ఒక చంద్రగుప్తుడో, శివాజీనో, వివేకానందుడో దొరికితే అటు ఇటు చూడవలసిన అవసరం ఉండేది కాదు. కాని ఎంత ప్రయత్నం చేసినా అటువంటి సుయోగం కలుగలేదు. కానీ నేను నిరాశ చెందడం లేదు. ఈ ప్రపంచంలో ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయి. కానీ అవి సూక్ష్మ శరీరంలో ఉన్నాయి. భౌతిక ప్రయత్నముల కొరకు స్థూల శరీరధారులు కావాలి. మహాభారతంలో పంచ దేవతలు పంచ పాండవుల రూపంలో శరీరాలను ధరించారు. రామాయణంలో కొన్ని శక్తులు కోతులు, ఎలుగుబంట్ల రూపంలో, కొన్ని హనుమాన్, అంగదుని మొదలైన వారిగా వచ్చాయి. **ప్రత్యక్ష పనులకు ప్రత్యక్ష శరీరములు కావాలి.** వారిని వెదకడంలో చాలాకాలం గడిచిపోయింది. శక్తి పూర్తిగా లేకపోయినా కొంచెం అయినా పరవాలేదు. అది దేవ మానవులలో ఉంటే మంచి వ్యవస్థ ఏర్పరచుకోవచ్చు. మేము బీజరూపంలో శక్తి సంచయం చేసి ఋషి సత్తాను ప్రజ్ఞా పరివార్‌గా రూపుదిద్దాము. కాని ఏకాకి ప్రయత్నం నిస్సారమే. కాని వాటికి దిశ ఇవ్వకపోతే అదే శక్తిని వినాశనానికి ఉపయోగించటం జరుగుతుంది.

అందువలన మా మార్గదర్శకుని ఆదేశానుసారం ఒకే ఒక ఉపాయం మిగిలి ఉన్నది. అది నేనే ఎక్కువగా శక్తి సంపాదించుకుని, ఆ శక్తిని ఉపయోగించవలసి ఉన్నది.

మూడు సంవత్సరముల క్రితం అలాంటి మార్పు చేయబడింది. ఏకాంత సాధన – సావిత్రి సాధన మొదలుపెట్టాను. ఎవరితో మాట్లాడకుండా, ఎవరిని కలవకుండా ఏకాంతవాసము చేయడం తేలిక కాదు. సావిత్రీ సాధన పంచకోశముల జాగరణ, కుండలినీ జాగరణ సాధన. దీనినే సూక్ష్మీకరణ సాధన అని, వేదాంత భాషలో పంచీకరణ అనే పేరు ఇవ్వబడింది. నాకు గాయత్రీ సాధనను నిర్దేశించిన గురుదేవులే సావిత్రీ సాధన విధానమును వివరించారు. మా ద్వారా అనేక దేవమానవులలో ఈ శక్తి జాగరణ జరిగి, ఆత్మిక ప్రగతి పొంది సమిష్ఠిగత హిత సాధన చెయ్యగలుగుతారు.

ఇప్పుడు ముందున్న సమస్యలు తేలిక పద్ధతుల ద్వారా నివారించలేము. ఇది ఎడమచేతి పనిగా కనుపించడం లేదు. సావిత్రి సాధన నుండి ఒక అడుగు ముందుకు వేసి కుండలినిని జాగ్రుతం చేయవలసి వచ్చింది. దానినే మహాకాళీ, మహాచండీ లేక మహాదుర్గా అని కూడా పిలుస్తారు. ఎవరి ద్వారా ఈ శక్తి సునియోజితం చేయవలసి ఉన్నదో వారికి ఈ విద్య గురించిన పూర్తి వివరణ ఇవ్వవలసిన అవసరం ఉన్నది. గడచిన రోజులలో

**కష్టమైనా, సుఖమైనా బయట లేదు. మనభావనలోనే ఉంటుంది**

కుండలినీ విజ్ఞానం యొక్క అన్వేషణ, పర్యవేక్షణ, ప్రయోగాలు-పరీక్ష, అధ్యయనం, అవగాహన మెండుగా జరుగుతున్నాయి. పురాతన గ్రంథాలతో పాటు క్రొత్త పుస్తకాలలో చిత్ర విచిత్రంగా వ్రాయబడ్డాయి.

ఇప్పటివరకు కుండలిని గురించి వ్రాసిన ప్రతిపాదనలను చూస్తే ఇలా అనిపిస్తున్నది. కుండలిని ఆకర్షణీయమైనది, గుహ్యమైనది కావడం వలన అనేకులు దీనిపై పని చేశారు కాని దీనిపై ప్రయోగం, అనుభవం పొందే ప్రయత్నం ఎవరు చేయలేదు. వారు వ్రాసినవి అన్నీ హఠయోగం యొక్క ప్రారంభిక ప్రయోగములు, వాటి ప్రతిక్రియలు మాత్రమే. అవి కుండలినీ విజ్ఞానంలో ఒక శాతం కూడా ఉండదు. ప్రామాణికమైన పుస్తకములు, మార్గదర్శనం కానరావు. కనీసం సిద్ధాంతమును వివేచన చేసి సరియైన రూపంలో ఇచ్చిన ఒక్క పేజి కూడా కనుపించదు. మేము భ్రమపూరకమైన జంజాటంలోనించి బయటపడి వాస్తవాలను ముందుకు తీసుకుపోయే నా వినమ్ర ప్రయాస ఇది.

శతాబ్దాలుగా ఉన్నటువంటి మా మార్గదర్శక సత్తాకు గాయత్రి - సావిత్రి - కుండలిని క్షేత్రములలో సమగ్రమైన జ్ఞానము అనుభవం ఉన్నాయి. వారు అందించిన పద్ధతిని అర్థం చేసుకుని గత మూడు సంవత్సరాలను, సావిత్రీ సాధన భారతదేశం యొక్క కుండలినీ జాగరణ కొరకు వినియోగించాను. ఇప్పుడు సమగ్ర రూపంలో ఆ జ్ఞానాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాను.

గాయత్రియే బ్రహ్మ విద్య. దీనిని ఆత్మకీ అని కూడా పిలువవచ్చు. సావిత్రి ఆత్మ భౌతికమైనది. అది ఆత్మవిజ్ఞానంలో అంతర్గతమైనదే కానీ దానితో భౌతిక లాభముల ఉపార్జన, ప్రాపంచిక సంకటముల నివారణ కూడా చేసుకోవచ్చు. దీనితో తన యొక్క, తన వారి హితసాధన చేసుకోవచ్చు. కానీ కుండలిని యొక్క క్షమత బ్రహ్మాండమంతా వ్యాపించి ఉన్నది. ఈ శక్తిని దేనినైనా విరగగొట్టటానికి లేదా విరిగిన ముక్కలను కలపడానికి కార్యాన్వితం చేయబడుతుంది. చండి యొక్క కోపిష్ఠి రూపం పొంగి పొరలినప్పుడు దానిని అనాచారాలను నిర్మూలించడానికి ఉపయోగించవచ్చు. అందువలననే దానిని అసురనికందిని అని చెప్పబడింది. దానిని దానవుల, అసురీ శక్తుల వినాశం కొరకే ప్రయోగించబడేది. ఇది కత్తివలె నరకడానికి పనికిరావాలి. అదుపులో లేనిదానిని బలపూర్వకంగా లాగడానికి, ఏ దిశలో కావాలంటే ఆ దిశలో లాక్కుని వెళ్ళడానికి దీనిని ఉపయోగించ వచ్చు. ఇది వశీకరణ విజ్ఞానము. దీనితో మారణం, ఉచ్చాటనము ప్రధానమైనవి. ఈ మహాశక్తియే భస్మాసురుని, సుందోపసుందులను మహిషాసురుని వశీభూతం చేసుకుని నాశనం చేసింది. ఈ శక్తియే అసురులైన సుంభ నిశుంభులను, మధుకైటభులను మర్దించింది. ఈ మహాశక్తియే రాముడు, సీతల మాధ్యమంతో రావణుని; శ్రీకృష్ణ బలరాముల మాధ్యమంతో పూతన, కంస, జరాసంధుల వంటి అసురీ శక్తులను నాశనం చేసింది. ఇది శక్తి యొక్క ఒక పక్షం మాత్రమే.

ఇదే శక్తి సృజనాత్మక కార్యకలాపాలలో ఉపయోగించబడితే సృష్టి సంచాలన శక్తిగా అవుతుంది. జ్ఞానార్ణవ తంత్రంలో ఇలా చెప్పబడింది - **"శక్తిః కుండలినీ విశ్వజననీ వ్యాపార వద్ధోద్యతా"** విశ్వంలో పనులన్నీ ఈ శక్తి ద్వారానే జరుగుతున్నాయి. మహా కాలుని పరివర్తన ప్రక్రియ దీని ద్వారానే జరుగుతుంది. జీవన చక్రంలో (కుమ్మరిసారె వలె) మట్టిముద్దవలె తిరుగుతూ ఆత్మ శక్తి భిన్న భిన్న రూపములను కల్పిస్తుంది. వస్తుతః కుండలిని సృష్టి సందర్భమున సమిష్టిగా, జీవుని సందర్భమున వ్యష్టిగాను శక్తి సంచారం చేస్తుంది. కుండలిని ఒక విధముగా కాస్మిక్ ఎలక్ట్రిసిటి (cosmic electricity). అది యోగాగ్నిని జాగృతం చేసినప్పుడు వ్యక్తిని ప్రాణవంతునిగా సమర్థునిగా, ద్రష్టగా తయారుచేస్తుంది. కఠోపనిషత్తులో యమ-నచికేత సంవాదములో పంచాగ్ని విద్య రూపంలో ఈ ప్రాణాగ్నిని గురించిన చర్చ జరిగింది. ఇది వ్యక్తిని రోగము నుండి, ముసలితనం నుండి, మృత్యువు నుండి దాటించి జీవన్ముక్తి వైపు తీసుకెళ్తుంది. నాడీ మండలం యొక్క ఉత్తేజన వలన లభించే శక్తి క్షణికమైన తాత్కాలికమైన ప్రభావాన్ని చూపుతుంది. కానీ కుండలిని చిరస్థాయి చేతనాత్మక శక్తి. ఇది వ్యక్తిలో శక్తిని పెంపొందించి అతని వ్యక్తిత్వాన్ని కాయకల్పం చేస్తుంది.

కాస్మిక్ స్థాయిలో, సమిష్టిగత ధరాతలంపై కుండలినీ జాగరణ ప్రక్రియ జరుగుతుంటే అది అనిష్ట నివారణ, ఉజ్జ్వల భవిష్యత్తు సృజన ప్రయోజనాలను పూర్తి చేస్తుందని తెలుసుకోవాలి. కాని అటువంటి ప్రమాదకరమైన ప్రయోగములకు సత్పాత్రులు కావాలి. తుపాకి పేల్చినప్పుడు కుదుపు వస్తుంది. అదేవిధంగా కుండలినీ మహాశక్తిని ప్రయోగించినప్పుడు, అది వెనుకకు ఇచ్చే కుదుపు తట్టుకోగల బలం, సాహసం, శౌర్యపరాక్రమములు అవసర మవుతాయి. లేకపోతే లాభం కొరకు చేసే ప్రయోగములు హానికారకం కూడా కావచ్చు. రహస్యంగా ఉంచవలసిన విషయములను అందరితో చర్చించకూడదు. అందువల్లనే దీనిని గుహ్యవిద్యగా భావించి దీనిపై తెరవేయడం జరిగింది. దానిపై

**మన కాళ్ళమీద మనం నిలబడటమే నిజమైన హీరోయిజం**

తెలిసి తెలియనివారు తర్కకుతర్కాలు జరిగితే ప్రమాదానికి దారి తీయవచ్చు. అలాంటి పరిస్థితిలో సాధన యొక్క మూలభూత సిద్ధాంతముల ఆధారమైన శ్రద్ధ కూడా తూలిపడిపోతుంది. సాధకునిలో అనుమానాలు రేకెత్తుతాయి. ఇలాంటి స్థితిలో అతి ఉత్తమమైన సాధన కూడా నిష్ఫలమవుతుంది. ఇలాంటి అనేక కారణముల వలన శాస్త్రకారులు ఉచ్ఛస్తరీయ సాధనలు ముఖ్యంగా తంత్రముతో కూడిన సాధనలు చర్చా విషయంగా మార్చడాన్ని నిషేధించారు. మార్గదర్శకుడు సత్పాత్రుడైన సాధకునికి అతని పాత్రతను అనుసరించి సాధనలు నిర్దేశించాలని నిర్ణయించ బడింది. సాధనా క్షేత్రంలో సాధకుని పాత్రతే కాదు సాధకుని పరిస్థితి ఆవశ్యకతలు కూడా పరీక్షించాలి. ఇలా చేసినప్పుడు సాధకుడికి, మార్గదర్శకునికి ఉపయోగకరమవుతుంది.

సావిత్రి, కుండలినీ సాధనలు చేయడం అనుభవం, అభ్యాసంతో కష్టసాధ్యమే కాక కత్తిమీద సాముువంటిది. ఇది చాలా ప్రమాదకరమైనదిగా భావించడం వలన దీని జోలికి ఎవరు పోవడం లేదు. అనుభవం గల శిక్షణ ఇచ్చేవాడు లేకపోతే కళాకారుడు తయారు కాలేదు. ఇదేవిధంగా కుండలినీ సాధనలో ప్రవీణులు, పారంగతులు లేకపోతే ఇక నేర్చుకునేవారు ఎక్కడి నుంచి వస్తారు?

కుండలినీ జాగరణ శరీరగత ప్రాణాగ్నిని ప్రజ్వలింప చేయడమే. ప్రస్తుతం దానిని స్వార్థ ప్రయోజనాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. జననేంద్రియ మూలములో ఉన్న కామశక్తిని బ్రహ్మరంధ్రంలోని బ్రహ్మశక్తితో విలీనం చేయడానికి మేరుదండ మార్గంలో ఉన్న ఆరు చక్రముల బేధన చేయాలి. ఈ శివశక్తి సమ్మేళనం వలన వివిధ సిద్ధులు కూడా లభిస్తాయి. కానీ ఇది పాముతో ఆటలాడుకోవటం వంటిది. పాములను ఆడించేవాడు వాటితో తనను, తన కుటుంబాన్ని పోషించుకుంటారు. కాని అతను ప్రమాదంతో ఆడుకుంటుంటాడు.

శివశక్తుల ఇరువురి మెడలలో సర్పములు పెనవేసుకుని ఉంటాయి. ఆలంకారిక రూపంలో దీని సర్పిణి కుండలినిగా చెప్పబడుతుంది. ఇది హఠయోగంలోని తాంత్రిక ప్రయోగమే. షట్చక్ర బేధనతో లభించే శక్తులను కేవలం ప్రతికూలతలను నివారించడానికే కాక సావిత్రీ సాధన యొక్క ఉచ్ఛస్తరీయ ప్రయోగంతో కలపడం వలన నూతన వాతావరణాన్ని నిర్మించవచ్చు.

షట్చక్ర బేధనతో పాటు పంచకోశ జాగరణ ప్రక్రియను జోడిస్తే అనేక రకములైన సృజన ప్రయోజనాలలో ఉపయోగించు కోవచ్చు. ఇల్లు కట్టుకోవడానికి ఇటుకలు, సున్నం, ఇనుము, కలప, కూలీల అవసరమవుతుంది. భోజనం తయారుచేయడానికి ఇంధనం, అగ్ని, గిన్నెలు, ఖాద్య పదార్థములు, వంట చేసేవారి అవసరం ఉంటుంది. పంచరత్నములు ప్రసిద్ధము. శరీర నిర్మాణము చేతనత్వంలో ఆవిర్భవించిన పంచ ప్రాణములతో జరుగుతుంది. ఈ శక్తి ప్రవాహాన్ని జీవనీశక్తి అని కూడా పిలుస్తారు. ప్రాణాగ్ని యొక్క ఉత్తేజన, కుండలినీ జాగరణ, పంచకోశ సాధన, సావిత్రీ సాధనతో సమన్వయం చేసినట్లయితే దాని ప్రభావక్షేత్రం అతి విస్తృతంగా ఉంటుంది. విశ్వంలో ఇప్పుడు ఉన్నటువంటి విషమ సమస్యలు ఇంతకు ముందు ఎన్నడూ లేవు. అణు ఆయుధముల నిల్వ ఉంచడం, నక్షత్ర యుద్ధం అనే ప్రమాదం, నలువైపులా మానసిక, పర్యావరణ ప్రదూషణ, ప్రకృతి యొక్క అసంతులన, భయంకరమైన రోగాలు, అపరాధాలు, ఆతంకవాదుల నీలి ఛాయలు చూస్తుంటే ప్రయోగం విశ్వవ్యాపక స్థాయిలో చేయవలసిన అవసరం కనుపిస్తుంది. వీటిపై విజయం సాధించాలనుకునే యోధులు పలుకష్టాలను ఎదుర్కొన్నా, ప్రతిఫలం అంచనా వేయడానికి వీలులేనంత గొప్పది.

ప్రస్తుతం దైవీ ప్రేరణ వలన, జన సమూహంలో శక్తి జాగరణ కొరకు చేసిన ప్రయోగములలో కొన్ని రహస్యోద్ఘాటనలు జరుగు తున్నది. ఇవి అందరికి ఉపయోగపడతాయి. విధి విధానం పాఠకులకు కష్టం కలిగించేత జటిలంగా ఉండదు. ఫలితార్థం తెలుసుకుంటే చాలు. ఇంకా తన భూమిక ఏమిటో అర్థం చేసుకోవాలి. ఈ సాధనల వలన వ్యక్తి యొక్క ఆంతరిక వికాసమే కాక అసంఖ్యాకులకు మంచి జరుగుతుంది. ఇంతేకాదు, వాతావరణాన్ని పూర్తిగా మార్చివేసి నూతనయుగం యొక్క సూత్రధారులు కావచ్చు. సంక్షిప్తంగా చెప్పాలంటే ఈ ప్రయోగం యొక్క అనుసంధానం మేము చేసిన దేవాత్మ భారతదేశం యొక్క కుండలినీ జాగరణ సాధన ద్వారా సంపన్నం చేయబడింది.

*(సశేషం)*

*– అఖండజ్యోతి, జనవరి 1987*

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి ! చదివించండి !!**

**మంచి కోసం చేసే పోరాటంలో ఓడిపోయినా అది గెలుపే అవుతుంది**

యుగ నిర్మాణ యోజన

# మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 8

## నలువైపులా మాధుర్యము, స్వచ్ఛత, సౌజన్యము, నిరాడంబరతతో కూడిన వాతావరణాన్ని నిర్మిస్తాము

ఎవరి లోపల ఏమి ఉందనే విషయం వారి ప్రవర్తన ద్వారా గుర్తించవచ్చు. తాగి ఉన్న వ్యక్తి మరియు మాదకద్రవ్యాలు సేవించిన వ్యక్తుల నోటి నుండి దుర్గంధము వస్తుంది. దుర్భావనలు, అహంకారము, దుర్మార్గములనే గుణములున్న వారు ప్రక్కవారితో ఒక విధమైన అభద్రతాభావంతో మసలుతుంటారు. వారి మాటల్లో కర్కశత్వము, అసభ్యత చోటు చేసుకుంటాయి. వారు ఇతరులను తక్కువగా భావిస్తూ తిడుతూ, వారి మాటలను వ్యతిరేకిస్తూ వాడిని మూర్ఖులుగా నిరూపించాలని ప్రయత్నిస్తుంటారు. తమ ఆధిపత్యాన్ని ఇతరులపై చూపించాలనే తాపత్రయంతో ఉండడం వలన అందరు వీరిని అసహ్యించుకొని ద్వేషిస్తారు. వారి యొక్క కటువైన మాటలు లోతుగా గుచ్చుకొని బాధిస్తాయి. అందుచేత వారు అందరికీ శత్రువులుగానే మిగిలిపోతారు. కటువుగా మాట్లాడేవారికి శత్రువులు ఎదురవుతారు, మిత్రులు తగ్గుతారు.

ఇతరులతో దురుసుగా, కటువుగా ప్రవర్తిస్తే తమ గొప్పతనం ఇతరులకు అర్థమవుతుందనుకుంటారు కానీ నిజానికి అలా జరగదు. ఇలా దురుసుగా ప్రవర్తించే వ్యక్తులు గర్వమున్నవారిగా, నీచులుగా పరిగణింపబడతారు. ఎవరి మనస్సులలోను వారి పట్ల కించిత్ ఆదరణ కూడా ఉండదు. దూకుడు స్వభావం వల్ల వ్యక్తి తన దోషాలను, తప్పులను అర్థం చేసుకోలేడు. అందుచేత ప్రజలు వారికి, వారి మాటలకు విలువను ఇవ్వకుండా తేలిగ్గా తీసుకోవడమే కాకుండా వారిని ఉపేక్షిస్తూ, వారి పట్ల ఉదాసీనంగా ప్రవర్తిస్తారు. ఇటువంటివారు ఎంతకాలం గడిచినా మంచి మిత్రులను పొంద లేరు. వారి అవసరాలకెవ్వరు సహాయపడరు. మనము ప్రపంచంలో జీవించాలి అంటే చక్కని ప్రవర్తనను నేర్చుకోవాలి. ఇతరులకు సేవ, సహాయము చేసే మాటలను ప్రక్కనపెట్టి కనీసం మనకు అవసరమైన వారితోనైనా నమ్రతతో, సద్భావనలతో, మృదు వచనములతో మాట్లాడగలిగేంత సౌజన్యం ప్రతి వ్యక్తిలోను ఉండాలి. ఏదో కొద్దిసేపు కలవవలసిన అవసరం ఏర్పడినప్పుడైనా మర్యాదగా ప్రవర్తించాలి. అలా ప్రవర్తించేందుకు సమయము, డబ్బు ఖర్చు లేదు. ఎంతకాలం కటువైన మాటలు మాట్లాడుతూ, అభద్రతతో కూడిన ప్రవర్తనను కొనసాగిస్తూ ఉంటారు? ఇటువంటి దురుసు స్వభావం వల్ల ఇతరులకు మనపై చెడు అభిప్రాయం ఏర్పడుతుంది. దానివలన హాని కలుగుతుంది. ఆ కారణంగా శత్రువులు పెరుగుతారు. ఇలా చేయడం ధీమంతుల లక్షణం కాదు. ఈ రకమైన స్వభావం కల వ్యక్తి చివరకు నాశనాన్ని కొనితెచ్చుకుంటాడు.

మనం ఎవరిని కలిసినా, ఎవరైనా మనను కలసినా వారి పట్ల ప్రసన్నతను వ్యక్తం చేయాలి. నవ్వుతూ వారికి నమస్కరించి కూర్చోబెట్టి కుశల సమాచారాలు అడిగి తెలుసుకొని సాధారణ మర్యాదలు చేసి వారు వచ్చిన కారణమేమిటో అడగాలి. మనమే వెళితే మనమెందుకు వెళ్ళామో చెప్పాలి. ఇతరులకి సహాయం చేయవలసిన విషయమైతే ఆ పనిని చేసెయ్యాలి, చేయలేకపోతే అందుకు కారణం, పరిస్థితి గురించి వివరించి తన బాధను వ్యక్తపరచాలి. ఇదే విధంగా మనకు ఎవరైనా సహాయపడకపోతే బాధపడకుండా, వారి సమయాన్ని మన పని కోసం కేటాయించి నందుకు వారికి కృతజ్ఞతను తెలియచేయాలి. విసుక్కుంటూ, చీదరించుకుంటూ, కర్కశంగా, చులకనచేస్తూ తలబిరుసుగా ప్రత్యుత్తరం ఇవ్వకూడదు. పనికిమాలినవాళ్ళు ఇలాగే ప్రవర్తిస్తారు. మనము వారి సరసన చేరకూడదు.

పెద్దల ప్రవర్తనను చూసి పిల్లలు దానిని అనుకరించి నేర్చుకుంటారు. మన పిల్లలు ఆచార వ్యవహారములను పాటించని అహంకారులుగా తయారు చేయాలనుకుంటే మనం కూడా అసభ్యంగా ప్రవర్తించే అలవాటు చేసుకోవచ్చు. అలా కాకూడదు అనుకుంటే ఆవేశము, ఉద్వేగము, క్రోధముతో యుక్తాయుక్త విచక్షణ లేకుండా ప్రవర్తించడం, మాట్లాడటం, అసభ్య పదజాలాన్ని ఉపయోగించడం, అసత్యాన్ని పలకడం వంటి దోషాలు మనలో స్వల్పంగా ఉన్నా సరే వాటిని తొలగించుకునేందుకు, మన స్వభావాన్ని మార్చుకునేందుకు పోరాడక తప్పదు. మనలో సౌమ్యమైన ప్రవృత్తి సముచిత రీతిలో ఉన్నదని మనకు అనిపించినప్పుడే మనం విశ్రాంతి తీసుకోవాలి.

ఇతరుల దృష్టిలో మనం చాలా మంచివారమని, మృదువైన ప్రవర్తనను కలవారమని, శ్రేష్ఠమానవుల వంటి ఆచరణను,

**సమస్యలు లేనివారు ఎవరు ఉండరు**

వ్యక్తిత్వమును తీర్చిదిద్దుకున్నామని అనిపించినప్పుడే మనం మానవత్వము యొక్క ప్రథమ పరీక్షలో ఉత్తీర్ణులమైనామని భావించాలి. ఆ తరువాతి అడుగులు నైతికత, సేవ, ఉదారత, సంయమము, సదాచారము, పుణ్యపరమార్థముల వైపు వేయాలి. మధురమైన సంభాషణ, వినమ్రతతో కూడిన ఆచార వ్యవహారములతో కూడిన మృదువైన వ్యవహారము మనం తప్పక పాటించాలి. అపరిశుభ్రత అనేది మానవుని వెనుకబడ్డ మానసిక స్థితిని గురించి తెలియచేస్తుంది. చెడు మనుషులు తమలోని అవాంఛనీయతలను తొలగించుకొని శ్రేష్ఠమైన వ్యక్తులుగా మారేందుకు ఇష్టపడరు. నిర్లక్ష్యము, బద్ధకము, అశ్రద్ధ అనే చెడు లక్షణాలు ఉన్న వ్యక్తి అవాంఛనీయతల వల్ల మురికి మొత్తం అక్కడే పేరుకుపోతుంది. అది చూసేవారికి సహజంగానే రోత పుట్టిస్తుంది. మురికిని పక్కనే పెట్టుకునేందుకు ఎవరు ఇష్టపడతారు. దుర్గంధం వస్తే ముక్కు మూసుకోకుండా, మురికిని చూసి కళ్ళు మూసుకోకుండా, హేయ ప్రవృత్తులను చూసి ఎవరి మనస్సు వికలం కాకుండా ఉంటుంది?

ఆరోగ్యపరంగా చూస్తే మురికి చాలా హాని కలుగచేయడమే కాదు, అనేక రోగాలకు చక్కని వాహకంగా కూడా పనిచేస్తుంది. అది ఉన్నచోటికి రోగాలు తమంతతామే వస్తాయి. అది వాటికి చాలా ఇష్టమైన ప్రదేశము. మకరందం కోసం తుమ్మెద ప్రతి పువ్వు మీద వాలుతుంది. అదేవిధంగా మురికి ఉన్న చోటుకు రోగాలు వస్తూనే ఉంటాయి. మానవుని యొక్క మూల ప్రకృతి మురికిని వ్యతిరేకిస్తుంది. అందుచేతనే అటువంటి వ్యక్తులను కాని, పదార్థములను కాని చూచినప్పుడు అసహ్యం కలుగుతుంది. అక్కడి నుంచి దూరంగా వెళ్ళిపోవాలనిపిస్తుంది. అందుచేత మానవులమనే జ్ఞానం ఉన్నవారు మురికిని తొలగించుకునే అలవాటు చేసుకోవాలి.

ఏ స్థితిలోనైనా మనిషి స్వచ్ఛత కోసం తప్పనిసరిగా స్నానం చేస్తాడు. కొన్ని వ్యాధులు వచ్చినప్పుడు అది కుదరకపోవడమనేది వేరే విషయం. రోగాలను నయం చేసే వైద్యుడు కూడా పరిశుభ్రత కొరకు మార్గాలను సూచిస్తాడు.

ప్రతి ఒక్కరు నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవటమనేది చాలా ముఖ్యమైన విషయం. అలా చేయకపోతే నాలుకపై మురికి ఒక పొరలాగా పేరుకుపోతుంది. పళ్ళ మధ్యలో అన్నం మెతుకులు ఇరుక్కుంటే కుళ్ళిపోతాయి. ఉదయాన్నే పళ్ళను చక్కగా శుభ్రం చేసుకోవాలి. ఎన్నిసార్లు తింటే అన్నిసార్లు నోరు శుభ్రపరచుకోవాలి. రాత్రి పడుకునేముందు తప్పనిసరిగా నోరుకడుక్కుని పడుకోవాలి. దానివల్ల పళ్ళు ఎక్కువకాలం గట్టిగా ఉండడమే కాకుండా దుర్వాసన కూడా రాదు. మనం కూర్చోగానే ప్రక్కనున్నవారికి పారిపోయే అవసరం కూడా ఉండదు.

శరీరాన్ని అంటిపెట్టుకొని ఉండే దుస్తులను కూడా ప్రతిరోజు సబ్బుతో ఉతుక్కోవాలి. బనియన్లు, డ్రాయర్లు, పంచెలు, పైజమాలు మొదలైనవన్నీ చెమటతో తడిసిపోవడం వల్ల వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరబెట్టాలి. కోటువంటి దుస్తులు ఎక్కువగా శరీరానికి తగలవు కనుక వాటిని ప్రతిరోజు ఉతకనవసరం లేదు. పక్కబట్టలను ప్రతిరోజు ఉతకలేం కనుక ఎండలో ఆరెయ్యాలి. కప్పుకునే దుప్పట్లను వెంట వెంటనే మారుస్తూ ఉండాలి.

మూతలేని పదార్థాలపైన క్రిమికీటకాలెన్నో చేరతాయి. అందుచేత ఆహార పదార్థాలన్నింటిపైన మూతపెట్టి ఉంచాలి. దుస్తులు, గిన్నెలు, ఫర్నీచర్, పుస్తకాలు మరియు ఇతర వస్తు సామాగ్రిని, అవి ఎంత విలువలేనివైనా సరే చిందరవందరగా పడవేయకుండా యథాస్థానంలో ఉంచితే చూసేందుకు అందంగా ఉంటుంది. వస్తువులను దులిపి, తుడుస్తూ ఉండాలి. లేకపోతే వాటిపై దుమ్ము పేరుకొని, ఋతువుల ప్రభావం వల్ల మురికిపట్టి పాతబడిపోతాయి. ప్రతి వస్తువు కూడా పరిశుభ్రతను, మరమ్మత్తుల వంటి వ్యవస్థను కోరుకుంటుంది. ఇంటిలోని ప్రతి పదార్థము మనము వాటిని స్వచ్ఛంగా, సువ్యవస్థితంగా ఉంచాలని ఆశిస్తాయి, కోరుకుంటాయి. ఎవరికి పరిశుభ్రత పట్ల నిజమైన ప్రేమ ఉందో వారు శరీరమును మాత్రమే అలంకరించుకుంటూ కూర్చోకుండా ఎక్కడ ఉంటే అక్కడ పరిసరాలను, పరిశుభ్రంగా, శోభాయమానంగా ఉంచేందుకు ఇష్టపడతారు. ఇంటిలో పగలిపోయినవాటిని అతికించుకోవడం, ఇంటిని చక్కగా పేడతో అలుక్కోవడం, తలుపులకు ఉండే రంగులను జాగ్రత్తగా గమనించుకొని శుభ్రపరచుకునేందుకు ఎక్కువ ఖర్చు కూడా కాదు. ఇంట్లోని వారందరూ కలిసి సరదాగా, సహజంగా, కొంత సమయమును కేటాయించి ఈ పనులన్నీ చేసుకోవాలి. అప్పుడు ఇల్లు, ఇంట్లో ఉండే పిల్లలు, పెద్దలు మానవసహజమైన స్వచ్ఛతతో మనకు దర్శనమిస్తారు. స్వచ్ఛతనుండే కళలు ప్రారంభమవుతాయి. అవాంఛనీయతలను వ్యతిరేకించే ప్రవృత్తి శరీరములో ప్రారంభమై దుస్తుల వరకు, మనస్సు నుండి ప్రారంభమై ప్రవర్తన వరకు, స్వచ్ఛత వికసిస్తుంది. ఇటువంటి అలవాట్ల సౌందర్యం వల్ల ఈ ప్రపంచములోని భగవానుని కళానైపుణ్యాన్ని చూసి ఆనందంతో పులకరిస్తుంది. అందువల్ల పూర్ణత్వమనే లక్ష్యం వరకు చేరుకోగలుగుతాము.

మన ప్రజలకు మలమూత్రాదులకు సంబంధించిన మురికి బాగా అలవాటైపోయింది. పాతకాలానికి చెందిన పాయిఖానాల యందు ఫినాయిల్, సున్నము మొదలైనవి ఉపయోగించకపోవడం వల్ల అవి భయంకర దుర్గంధమును వెదజల్లుతుంటాయి.

**ప్రతి సమస్యకు సమాధానం ఉంటుంది**

పిల్లలకు కాలువల యందు మలమూత్ర విసర్జన అలవాటు చేయడం వలన అవి దుర్గంధపూరితమవుతాయి. ఇళ్ళముందు చెత్తను కుప్పలు కుప్పలుగా పోస్తుంటారు. కొందరు అక్కడే మూత్ర విసర్జన కూడా చేస్తుంటారు. అక్కడే తిరుగుతుంటారు. పైపెచ్చు అది పారిశుద్ధ్యపనివారు వచ్చి చేసేపని కనుక తాము శుభ్రపరచు కోనవసరంలేదని అనుకుంటారు. నిజానికి అవి మన శరీరం ద్వారా విసర్జించబడిన పదార్థాలే కదా! వాటిని మనం కొంతవరకు శుభ్రం చేసుకుంటే పారిశుద్ధ్యపని చేసేవారికి కొంత సహాయపడ్డవారమవుతాము. అలా కొంతవరకు మన కర్తవ్యము నిర్వహించినట్లవుతుంది. గ్రామాలలో ఇంకా భయంకరమైన వాతావరణం ఉంటుంది. అక్కడ దుర్గంధం వల్ల ఎన్నో రోగాలు కలుగుతాయి. ఆ ప్రదేశము చూచేందుకు రోతగా ఉంటుంది. గడ్డి, పేడ ఎక్కడివక్కడే పడి ఉంటాయి. అవి కుళ్ళిపోవడం వల్ల వచ్చే వాసనకి ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ స్థితిని గురించి మనం చాలా బాగా ఆలోచించాలి. పొడిగా ఉండే మూత్రాలయాలను, కాల్వలను, గుంటలను ఏర్పాటు చేసుకోవాలి. శౌచాలయాలను (లెట్రిన్) కర్రలతో తయారుచేస్తే ఖర్చు ఎక్కువ కాదు, తేలికగా తయారవుతాయి.

మానవ జీవితంలో ఉండవలసిన మొదటి గుణము స్వచ్ఛత. మన శరీరమును, ఉపయోగించుకునే వస్తువులను, నివసించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి. దానివల్ల మనకేకాక ఇతరులకు కూడా ఆనందం లభిస్తుంది. నిర్మలత్వము, ఆరోగ్యము, నిశ్చలత, నిర్లిప్తతలనే ఆధారములతో ఆత్మ నిర్మించబడుతుంది. దాని యొక్క పవిత్రత వల్ల మనం ఈశ్వరుని చేరుకునేందుకు అవసరమైన మార్గము చక్కగా ఏర్పడుతుంది. అందుచేత తప్పక పరిశుభ్రతను పాటించాలి.

మనం తెలివితేటలు, మంచితనమువంటి గుణాలను నింపుకొని నిరాడంబరమైన జీవితం జీవిస్తే మంచిదే. బాహ్యంగా కుటుంబాన్ని తీర్చిదిద్దుకుంటూ, సమాజానికి అవసరమైన పనులన్నీ పూర్తిచేస్తూ ఉండాలి. నిరాడంబరత అనేది మంచి తనానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఎవరి వేషభాషలు నిరాడంబరంగా ఉంటాయో వారిని అత్యంత ప్రామాణిక వ్యక్తులుగా, విశ్వసించ దగినవారిగా భావించాలి. బుద్ధిమంతులు ఆడంబరాలను ప్రదర్శించేవారిని పరువు తక్కువవారిగా భావిస్తారు. అందువల్ల మనం వాడే దుస్తులు సాదాసీదాగా ఉండేలాగా కుట్టించుకోవాలి. ఆభరణాలు దిగేసుకోకూడదు.

నిరాడంబరత వల్ల వినమ్రత, మంచితనము పెంపొందు తాయి. వీటివలన ప్రామాణికత, వివేకశీలత మరియు బుద్ధి పరిపక్వతలాంటి సద్గుణాలు తళుక్కుమంటాయి. ఇందులోనే నిజమైన గౌరవం ఉంది. నిరాడంబరత వ్యక్తులను ఆకర్షించి ప్రభావితం చేసే మాయాజాలం కాదు, తమ వాస్తవిక స్థితిని గురించి అందరికీ తెలియపరచే ఒక విధానము మాత్రమే. ఇది నిజాయితీ మరియు సత్యముతో కూడిన మార్గము. ఇది ఆదాయమును పెంచే సులువైన మార్గము కూడా. ఎందుకంటే అనవసరపు ఖర్చులు తగ్గించడమంటే ఆదాయమును పెంచడమే కదా! సాధారణ ప్రజలు సామాన్య అలంకారాలు చేసుకుంటూ పరిమిత ఖర్చుతోనే పనులన్నీ జరుపుకోవాలి. మనతో ఉన్న కోట్లాది సోదర సోదరీమణులలో మనం కూడా నిలబడి వారివంటి జీవిత విధానాన్ని అలవర్చుకోవడమే సరియైన పద్ధతి. దానివల్ల మన గౌరవం ఇనుమడిస్తుందని అర్థం చేసుకోవాలి. ఫ్యాషన్ పట్ల ఉన్న మోజు మనలను అపవ్యయం చేసేందుకు ముందుకు తోయడమే కాకుండా ఆర్థిక సమస్యలను కూడా తెచ్చిపెడుతుంది.

స్వచ్ఛతతో కూడిన నిరాడంబరత అనేది మనకు ఉన్నత స్థాయికి చెందిన ఫ్యాషన్. అందులో పేదరికం కాదు మహోనత ఉంటుంది. మనం అనుసరించే నిరాడంబర వేషధారణ మన యొక్క స్వతంత్ర ప్రతిభను, స్వతంత్ర చింతనను తెలియచేస్తూ ఉంటుంది. నక్కజిత్తులు మాని వివేకశీలతతో కూడిన మార్గమును ఎంచుకోవడంలోనే సాహసం ఉన్నది.

*– అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## చాణుక్యుడు

*చాణుక్యుని సంకల్పశక్తి అద్భుతంగా ఉండేది. చిన్నప్పుడు ఒక జ్యోతిష్కుడు ఇతని పెద్ద దంతాలను చూసి "వీడు పెద్ద అయినాక రాజుగా ఉంటూ యుద్ధాలంటే ఇష్టపడతాడని చెప్పాడు. కాని ఆయన తల్లిగారు జీవనమంతా తన బిడ్డతోనే గడపాలనే కోరుకునేది. ఒక్క సంతానం విడిపోవుట జరుగుతుందనే ఆలోచనలతో ఏడ్చింది.*

*తల్లి దుఃఖానికి కారణం తెలియగానే, ఆయన ఒక రాయితో తన పెద్ద దంతాలను విరగగొట్టుకున్నాడు. ఈ దంతాల కారణంగానే కదా నా భవిష్యత్ ఆధారపడి ఉన్నందున నేను వీటిని వెంటనే విరగగొట్టానని అని అన్నాడు. దంతాలు అడ్డు తగిలితే వాటిని తొలగింపే మంచిదని నమ్మాడు. తల్లి వీని దుస్సాహసం గమనించి దిగ్భ్రమ చెందింది.*

*– అఖండజ్యోతి, మార్చి 1984*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**సమస్యలను అధిగమించి బ్రతికేవాడే వీరుడు, శూరుడు**

వ్యక్తి నిర్మాణం

# దేవమానవులుగా తయారవండి

'మేము ఇతరులకన్నా ప్రత్యేకమైనవారం. మా వ్యక్తిత్వం స్వతంత్రమైనది అనే ఆలోచన మిమ్మల్ని అసహాయులుగా, దీనులుగా మిగిల్చే దుర్భరమైన స్థితికి చేరుస్తుంది. ఎంత సమర్థుడైనా, ఎన్ని సాధనాసంపత్తులను కలిగి ఉన్నా, ఒంటరి వ్యక్తి ఎప్పటికీ లెక్కలో లేనివాడుగానే, తుచ్ఛుడుగానే మిగిలిపోతాడు. చీకటిలోగాని, ఒంటరిగాగాని ప్రయాణము చెయ్యటానికి భయ మేస్తుంది, రకరకాలైన అనుమానాలు వెంటాడుతాయి. ఫలితంగా మనిషికి సంతోషము ఉండదు. అందుచేత ఒంటరితనం సర్వదా వర్జనీయమే!

పదిమందితో కలిసి వెళ్ళటంలో అనేకరకాల ఇబ్బందులు ఎదురవుతాయి. అయినప్పటికి మనస్సు అలా వెళ్ళటానికే ఉత్సుకత చూపుతుంది. జనబాహుళ్యంతో నిండిన ఒక సమూహం మిమ్మల్ని కూడా తమలో ఒకనిగా గుర్తిస్తుంది గనుక సహజంగానే మీలో సంతోషము కలుగుతుంది. అందువలననే మనిషి సమూహంలో ఉండటానికే ఇష్టపడతాడు. సైన్యంలో ఒక అంగంగా తయారైన సైనికుడు సాహసము, ఉత్సాహంతో ఉంటాడు. అదే ఒంటరిగా వెళ్ళవలసివచ్చిన సైనికుడు నిరుత్సాహంగా, వేదనతో వెళ్తాడు.

**'నేను ఒంటరివాడిని, నాకు సంబంధించినవారంతా వారి వారి సౌకర్యాలకోసం నామీద ఆధారపడి ఉంటున్నారు' అన్న ఆలోచనే మనిషిని రాక్షసుడిగా మారుస్తుంది.** అతడు భార్యను పలురకాలుగా వేధిస్తాడు. ఆమెను కీలుబొమ్మగా, కాలుక్రింది చెప్పులాగా, బానిసకన్నా హీనంగా చూస్తూ కొంతలో కొంత సంతృప్తి చెందుతాడు. ఆమె ఏమాత్రము అభిప్రాయభేదం కనపరచినా, తన భావాలతో ఏకీభవించకపోయినా నిప్పులు చెరగుతాడు, అప్పటివరకు ప్రదర్శించిన ప్రేమంతా బూటకంగా మిగిలిపోతుంది. దాని స్థానంలో అగ్నిజ్వాల వంటి దుర్మార్గం తాండవనృత్యము చేస్తుంది. ఇదంతా వికృతమైన మానసికస్థితి యొక్క దుష్పరిణామాలే!

కుటుంబసభ్యులను లేమిలో, సహింపశక్యముకాని దుఃఖ పూరితమైన వాతావరణములో వదలి, ఎంతోమంది వ్యక్తులు త్రాగుడు, దుర్వ్యసనములు, స్నేహితులతో విలాసంగా గడపటానికి డబ్బు ఖర్చుచేస్తూ ఉంటారు. వాళ్ళకు తమ కోర్కెను తీర్చుకొనటమే అన్నింటికన్నా ముఖ్యమైనదిగా కనపడుతుంది. అతడి కోర్కెను తీర్చటానికి కుటుంబంలోని మిగిలిన వ్యక్తులు ఎంత కష్టపడవలసి వస్తుందో వాళ్ళకు అర్థంకాదు. 'ఒంటరి మనస్తత్వము' ఉన్న వ్యక్తులకు తమకు తామే ప్రధానం. ఇతరులనుండి ఎలాంటి లాభము పొందగలం? అనిమాత్రమే వారు ఆలోచిస్తూంటారు. తల్లిదండ్రుల దగ్గరున్న సొమ్మును రాబట్టుకొనటానికి వాళ్ళ బుద్ధి చాలా వేగంగా ఆలోచిస్తుందేగానీ, తల్లిదండ్రులకు సహాయ పడటం తమ కర్తవ్యము అన్న అంశము వారికి తట్టదు. కొంతమంది చిన్నపిల్లలు తల్లి నగలు దొంగిలించి, బొంబాయి వంటి నగరమునకు జల్సాచెయ్యటానికి బయలుదేరుతారు. తద్వారా ఇంట్లో ఎంత చిచ్చురగులుతుందో వాళ్ళ ఊహకు కూడా అందదు. తమ సరదా, సంతోషములే వాళ్ళకు సమస్తం. బిడ్డ కనిపించలేదన్న వేదనతో అల్లాడిపోయే తల్లిదండ్రులు వాళ్ళకు ఏమాత్రం ప్రాముఖ్యత లేని మట్టిబొమ్మలుగా కనపడతారు. స్వార్థపరత్వం మనిషిని ఎంత కఠినుడిని గావిస్తుందో ఊహించ టానికి కూడా సాధ్యము కాదు.

కొద్దిపాటి లాభము కోసమో లేదా మనోల్లాసము కోసమో, స్వల్పమైన అవమానానికి ప్రతీకారం తీర్చుకొనడం కొరకో చాలా మంది వ్యక్తులు ప్రాణాంతకం కలిగించే దాడులు చేస్తుంటారు. ఇలాంటివి కేవలము ఆవేశము వల్లమాత్రమే జరుగవు. అలా దాడిచేసేవారి మానవత్వమే వికృతమయి పోతుంది. వాళ్ళు అటూ ఇటూ తిరుగుతున్నట్లు తిరుగుతూనే ఇతరులను వంకాయో, బెండకాయో తరిగినట్లు నరికేస్తుంటారు. గాయపడినవారికి ఎంత బాధ కలుగుతుందో, వాళ్ళ కుటుంబము ఎటువంటి కష్టములకు లోనవుతుందో అన్న ఆలోచన వారికి కొంచం కూడా ఉండదు. ఒంటరియైన మనిషి స్వార్థపరత్వపు ఊబిలోకి దిగిపోయే కొద్దీ ఇంకా ఇంకా కఠినంగా తయారౌతాడు. దొంగలు, మోసగాండ్రు, హంతకులు, దోపిడీ దారులు, దుష్టులు మొదలైన వారందరికీ ఇటువంటి క్రూరమైన పనులంటే వినోదంగా ఉంటుంది. ఒంటరి తనము యొక్క స్వార్థ పరాయణత్వం వల్ల కలిగే కఠినత్వము వారిలో పాతుకుపోవడమే దీనికి కారణము.

నేరాలు పలురకాలు. వాటి స్వరూపస్వభావాలు కూడా భిన్నమైనవే. క్రూరమైన పనులను చేసే, చేయించే పద్ధతులుకూడా

బ్రతికుంటే ఏదైనా సాధించవచ్చు

వేర్వేరుగానే ఉంటాయి. కానీ నిజానికి చెప్పాలంటే అవన్నీ స్వార్థమనే ఒక మొక్కకు చెందిన ఆకులు, పూలు మాత్రమే! స్వార్థపరుడైన వ్యక్తి ఒకవేళ పిరికివాడు, భయస్తుడు అయితే దుష్టుల యొక్క సహాయమును తీసుకుంటాడు. అతడే స్వయంగా ఉగ్రస్వభావము కలిగిన ఉద్ధండుడైతే ఇక చెప్పేదేముంది? అతడు తిరుగులేని ఆక్రమణదారు, పీడించేవాడుగా తయారవుతాడు. ఒక స్వార్థపరుడైన వ్యక్తి సంపర్కములోనికి వచ్చినవారికి ఇబ్బందులు తప్పవు. భార్య, పిల్లలకు కూడా ఈ బాధ తప్పదు. స్వార్థపరులైన భర్తలు అడుగడుగునా పెట్టే బాధలు, హింసలకు గురవుతూ ప్రతిక్షణం కసాయివాడి కత్తి అంచున నిలబడినట్లు బ్రతుకును వెళ్ళదీస్తున్న స్త్రీమూర్తులెందరో ఉన్నారు. నరకమనేది ఎక్కడో లేదు, దాని తాలూకు క్రూరత్వమును స్వార్థపూరితమైన వాతావరణంలో ఎక్కడైనా చూడవచ్చు.

వణుకు పుట్టించే భూతప్రేతపిశాచాలు శ్మశానం లాంటి బీభత్సకరమైన ప్రదేశాలలో ఒంటరిగా తిరుగుతూ ఉంటాయని ప్రజల నమ్మకము. అలాంటి భూతాలు ఉన్నాయో లేదో సందేహమే కానీ స్వార్థపరుడైన వ్యక్తి మనస్తత్వము ఇలాగే ఉంటుందనేది మాత్రము నిస్సందేహం. వాళ్ళు ఒంటరిగా ఉంటుంటారు. తమ కోర్కెలను, కాంక్షలను నెరవేర్చుకొనటానికి, అహంకారమును చల్లార్చుకొనటానికి ఏమి చెయ్యటానికైనా వారు సంసిద్ధులే. పొరుగువాడి శవము ప్రక్కనే కాలుతున్నా వాళ్ళు ఏమాత్రం చలించరు, సరికదా వినాశనమును చూడాలనే వాళ్ళ దుర్మార్గపు బుద్ధికి మరింత పుష్టి చేకూరుతుంది. నిర్మాణాత్మకమైన పనులను వాళ్ళు ఎన్నడూ చెయ్యలేరు. ధ్వంసాన్ని చూసి సంతోషపడతారు. ఇతరులను భయపెట్టడం, రోగాలబారినపడవెయ్యటం, ఇంకా అనేకమైన పలురకాల ఇబ్బందులను కలిగించడం భూతాలు, దెయ్యాల పని అని వింటుంటాం. అనవసరంగా రకరకాలైన బాధలను అవి సృష్టిస్తుంటాయి. ఇలాంటి పిశాచ ప్రవృత్తిని చాలా మందిలో మనము చూడవచ్చు. వాళ్ళు బ్రతికి ఉన్నప్పటికి మరణించినవారితో సమానము. అలాంటివారికి దెయ్యాలు, పిశాచాలు అని పేరుపెట్టినా తప్పులేదు. ఒంటరిగా ఉన్న వ్యక్తి సంతోషంగా ఉండటము సాధ్యం కాదు.

'సృష్ట్యాదిలో భగవంతుడు ఒక్కడే ఉన్నాడు. ఆ ఒంటరి తనంతో ఆయనకు విసుగు కలిగింది. అసహనం ఏర్పడింది. ఎంతోకాలం ఆ స్థితిలో ఉండటము అసాధ్యం అనిపించినది. ఒకటినుండి అనేకమేర్పడుగాక! అని సంకల్పిస్తూ తనను తాను అనేకం కావించుకున్నాడు. జడమైన పరమాణువును, చేతనత్వముతో నిండిన జీవాణువును కూడా ఆయనే సృష్టించాడు. పదార్థమును, ప్రాణిని కూడా సృజించాడు. తాను సృజించిన ఆ సృష్టిలో విహరిస్తూ ఆయన సంతోషాన్ని, ఆనందాన్ని పొందాడు' అని ఉపనిషత్తులలో ఋక్కులు ప్రవచించాయి. ఈ సత్యం వినటానికి కొంచెము కల్పితంగా ఉన్నప్పటికి మానవ జీవితంలో ఈ సత్యము ధృవీకరించబడినది. ఏకాంతపు స్థితిలో మనిషికి విసుగు, తద్వారా అసహనము ఏర్పడతాయి. తన ఆత్మీయులు పెరిగినప్పుడు శాంతి ఏర్పడుతుంది. తనది అనే క్షేత్రమును విస్తృతంగావించుకునేకొద్దీ అతడి కార్యరంగము ఉల్లాసపూర్ణమవుతూ ఉంటుంది. విస్తృతమైన జనసమూహంతో తనను తాను అనుసంధానం గావించుకున్నప్పుడే పదిమందిలో తిరగటం సంతోషంగా ఆనందంగా ఉండగలగటము మనిషికి సాధ్యపడుతుంది.

మానవుని సహృదయము, ఔదార్యము, పుణ్యపరమార్థములకు సంబంధించిన శ్రేష్ఠమైన సత్కర్మలద్వారా వెల్లడి అవుతూనే ఉంటుంది. ఈ ఔదార్యము అంటే ఏమిటి? వ్యక్తి తనను తాను విస్తృతపరచు కొనవలెననే ఉద్దేశ్యము తప్ప మరేమీ కాదు. మనలను మనము విస్తృతమైన క్షేత్రంలోకి విస్తరించుకుంటూ పోయే కొద్దీ సమస్తమైన వస్తువులు మనవే అన్న భావన స్థిరపడుతుంది. అప్పుడు మన వస్తువులను ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో, పరాయివారి వస్తువులు కూడా జాగ్రత్తపరచటం, సదుపయోగం చేయటం వంటి విషయాలపైన స్వంత వస్తువుల పైన ఉండే శ్రద్ధలాంటిదే ఏర్పడుతుంది. మనది అనే పరిధి పరిమితమైనప్పుడు ఫలానా వస్తువు మనది కాదు, అది బాగుంటే మనకేమి? చెడిపోతే మనకేమి? అందుచేత దానిని జాగ్రత్త పరచటం వల్ల మనకేమి లాభము కలుగుతుంది? వంటి ఆలోచనలు కలుగుతాయి. ఈ పరిధిని పెంచుకుంటూపోయేకొద్దీ నాది నీది అనే భేదభావము నశించి సమస్తమైన వస్తువులు భగవంతునివని, ఆయన మనకు ప్రసాదించినవి అన్న భావము బలమై వాటిని సంరక్షించటము, వ్యవస్థీకరించడము వంటి పనుల పట్ల ఇష్టం కలుగుతుంది.

సంకుచితమైన మానసికస్థితికలవారికి ఈ శరీరము మాత్రమే నాది అనే భావముంటుంది. దానికి సకల సదుపాయములు ఏర్పరచటానికి ఇతర కుటుంబసభ్యులను నిర్లక్ష్యం చెయ్యటం, వారికి అన్యాయము చెయ్యటం కూడా జరుగుతుంది. సరిగ్గా దీనికి వ్యతిరేకంగా ఆలోచించే వ్యక్తులు ఆత్మీయతను అభివృద్ధి పరచుకుంటూ స్వయంగా కష్టపడైనాసరే తాను లేమిలో ఉన్నాసరే

**స్నేహం అమృతం లాంటిది, జీవాన్ని ఇస్తుంది**

ఇతర కుటుంబసభ్యులకు అవసరమైన సుఖసౌకర్యములను సమకూర్చటంలో నిమగ్నమవుతూ ఉంటారు. సంకుచిత హృదయము కలిగినవారికి భార్యాపిల్లలను పోషించటమే మహా గొప్పఔదార్యం. కానీ తన అనే రంగమును విస్తృతపరచుకున్న వారు తల్లిదండ్రులు, సోదరీసోదరులు మొదలైనవారికి సంపూర్ణమైన సుఖశాంతులు లభించేవిధంగా పాటుపడతారు. తన కోసం ఏమీ శ్రద్ధచూపించరు. ఆత్మవికాసం అభివృద్ధి చెందేకొద్దీ గ్రామం, నగరం, ప్రాంతం, దేశం ఆఖరుకు ఈ యావత్ ప్రపంచములోని సమస్త ప్రాణులపట్ల మమకారము పెరుగుతుంది. అందరిలో ఒకే ఆత్మ, ఒకే విశ్వాత్మ ఓతప్రోతమౌతూ (కలగలసిపోతూ) దృష్టికి గోచరిస్తుంది. అందరూ తనవారే అనే భావన కలుగుతుంది. పరాయివారు అనబడే వారెవ్వరూ కనిపించరు. ఫలితంగా ఔదార్యము, సేవ, సహాయములతో నిండిన భావపూరిత హృదయము అందరిపట్లా ఏర్పడుతుంది. ఈవిధమైన ఆత్మ విస్తారం ఏర్పడటమే సమస్తమైన అధ్యాత్మ విజ్ఞానము యొక్క ఒకే ఒక్క లక్ష్యము.

కాలం గడిచేకొద్దీ ఈ ఆత్మీయతా భావం మనుష్యులకు మాత్రమే పరిమితం కాక, సకలప్రాణులపట్ల అదే భావం ఏర్పడుతూ, విస్తృతమవుతూ ఉంటుంది. అప్పుడు ఇతర ప్రాణులు కూడా తమ కుటుంబసభ్యులే అనిపిస్తాయి. వాటికి తగిన సౌకర్యాలు ఏర్పరచటంలో శ్రద్ధ కలుగుతుంది. వాటి సంతోష కరమైన అభివృద్ధి కలిగినప్పుడు స్నేహ, సౌజన్యములనే సముద్రం పెల్లుబుకుతుంటుంది. ఇలాంటి వ్యక్తులు ఇతర ప్రాణులను చంపి వాటి మాంసమును తినాలనే ఊహనుకూడా భరించలేరు. ఈ హింసాత్మకమైన పని వారికి చాలా వేదనను కలిగిస్తుంది. ఆ వేదన ఒక సాధారణమైన వ్యక్తికి తన సోదరుడినో, పుత్రుడినో చంపి వారి మాంసమును తినడంతో సమానంగా ఉంటుంది. జిహ్వాచాపల్యము లేదా శరీర దారుఢ్యమువంటి తుచ్ఛమైన స్వార్థపూరితమైన తృష్ణతో ఇతర ప్రాణులను హింసాత్మకమైన బాధకు గురిచెయ్యటము పాషాణ హృదయము కలిగిన రాక్షస ప్రవృత్తి కలిగినవారుమాత్రమే చేసే పని. ఉన్నతస్థాయికి చేరుకున్న ఆత్మశక్తి కలవారు మాంసాహారమును ముట్టటానికి కూడా అంగీకరించరు. ఈ పని చెయ్యటానికి వారి హృదయము దడదడ లాడుతుంది, చేతులు వణుకుతాయి.

ఈ సృష్టియావత్తూ కేవలము మనకోసము మాత్రమే సృజించ బడలేదు. యావత్ప్రపంచం, సమస్త విశ్వం మన స్వంత ఆస్తి కాదు. ఇతర ప్రాణులుకూడ భగవంతునిచే సృజించబడినాయి. ఈ భూమిపై నివసిస్తూ ప్రకృతి సంపదలను అనుభవించే హక్కు వాటికి కూడా ఉన్నది. వాటి అధికారమును, హక్కులను లాక్కుని వాటి ఉనికిని ప్రమాదంలో పడేసి మన స్వార్థం కోసమే ఆలోచించటమనేది అత్యంత తుచ్ఛమైన, స్వార్థపూరితమైన, నీతిబాహ్యమైన పని. దీనివలన మానవత్వం యొక్క గౌరవం పతనమైపోతుంది. మనం ఒంటరివారముకాము అని ఆలోచించడం ఉచితమైన పని. నాది అనే పరిధిని విస్తరించుకుంటూంటే మానవుని ఔన్నత్యం, తద్వారా సంఘంలో సుఖ శాంతులు స్థిరంగా వెల్లివిరుస్తాయి.

*– అఖండజ్యోతి, మార్చి 1999*

*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*

## క్రికెట్‌లో ఆధ్యాత్మికత

**(ఆధ్యాత్మిక దృష్టితో క్రికెట్ దర్శనం)**

| | |
|---|---|
| పంచ జ్ఞానేంద్రియాలు + పంచ కర్మేంద్రియాలు + ఒక మనస్సు | 10 మంది ఆటగాళ్ళు ఒక కెప్టెన్ |
| యమ నియమాల కట్టడిలో | ఇద్దరు అంపైర్లు |
| వెన్నెముకపై | పిచ్‌పై |
| ఇడ, పింగళ అనే శ్వాసలు | ఇరువురు బ్యాట్స్‌మన్ |
| అరిషడ్వర్గాలను ఎదుర్కొంటూ | ఆరు బంతులు |
| షట్చక్రాల మధ్య శ్వాస పైకి క్రిందికి నడుస్తూ | రెండు వికెట్ల మధ్య పరుగులు తీస్తూ |
| తొలుత మూలాధార చక్రాన్ని దాటి ఓజస్సును పొందుతూ | సింగిల్ రన్ |
| తదుపరి అనాహత చక్రాన్ని చేరి వర్చస్సును పొంది | నాలుగు పరుగులతో బౌండరీ చేరి |
| చివరగా సహస్రాన్ని చేరి బ్రహ్మ వర్చస్సును స్వంతం చేసుకోవాలి | సిక్సర్ కొట్టి విజయాన్ని సాధించాలి |

ఈ రీతిగా నిజ జీవిత క్రికెట్ ఆటలో జీవుడు షట్చక్ర బేధనం కావించి కుండలినీ శక్తిని స్వంతం చేసుకోవాలి.

దృష్టి మారితే సృష్టి మారుతుంది. అన్నింటిలో ఆధ్యాత్మికతను దర్శించుటే అసలైన ఆధ్యాత్మికత.

*మూలం : డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారు*

*సంకలనం : మారెళ్ళ రవికుమార్*

**తల్లిదండ్రులు పిల్లలతో స్నేహితుల వలె మెలగాలి**



## ఆదిశక్తి యొక్క లీలాకథలు - 39

# సాధకుని జీవితములో ఎదురయ్యే ఒకే ఒక్క అవరోధము 'మోహం'

ఆదిశక్తి లీలాగాథ మానవ జీవితము యొక్క రూపాంతరణ గురించి తెలియజేసే కథ! జగన్మాతయైన ఆదిశక్తినుండి విముఖమైన జీవాత్మ నిరంతరము ఈ ప్రాపంచిక బంధనములలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతుంటుంది. బంధనము తాలూకు క్రొత్త క్రొత్త మోహపాశములు ఆధ్యాత్మికపథమును అడ్డుకుంటుంటాయి. ఆధ్యాత్మికపథములో ఉన్న వ్యక్తిని అతని ఆలోచనలు, భావనల ద్వారా గుర్తించవచ్చునని శాస్త్రములే కాదు, పండితులు కూడా చెప్తున్నారు. 'ఆలోచనల దిశ ఎటువైపు ఉన్నది? వాటి స్వరూపము, నిర్మాణము ఎలా ఉన్నది?' ఈ అంశములను బట్టి ఒక వ్యక్తి ఆధ్యాత్మికమార్గములో ఉన్నాడా? లేక ప్రాపంచిక మార్గములో ఉన్నాడా? అనేది నిర్ధారించబడుతుంది. ఆలోచనలలో అస్థిరత, ఆందోళన ఉన్నవా? లేక శాంతి, సమర్పణ ఉన్నవా? ఆలోచనలు ఎక్కడ సమర్పించబడుతున్నవి? ఈ అంశములను బట్టి ఆ వ్యక్తి సాధకుని స్థాయిలో ఉన్నడో లేక సామాన్య మానవునివలె ప్రాపంచిక విషయములతో చుట్టు ముట్టబడి ఉన్నాడో తెలుస్తుంది. భక్తుడా? లేక భవబంధనములతో బంధించబడినవాడా? అన్నది ధనవైభవములతో కాక, అతని ఆలోచనలు, భావనలనుబట్టి గుర్తించవచ్చు, పరీక్షించవచ్చు.

జీవితములో అత్యంత కఠినమైన ఆఘాతములకు గురియైన సురథ మహారాజు తన పుణ్యప్రభావము వలన, మేధాఋషి ఆశ్రమములోకి రావడమైతే జరిగిందికానీ, అతని మనస్సు, హృదయం మాత్రము అక్కడి వాతావరణములోనికి ఇంకా ప్రవేశించలేదు. గతకాలపు స్మృతులు మనస్సును వికలం చేస్తున్నాయి. అతనికి తన రాజ్య సుఖము, పూర్వ వైభవము పదే పదే గుర్తుకొస్తున్నవి. ఆ స్మృతుల వేదన ఎంత తీవ్రమైనదంటే, మేధాఋషి ఆశ్రమము యొక్క సౌమ్యమైన సురమ్య వాతావరణము కూడా అతనికి శాంతిని చేకూర్చలేకపోయినది.

శత్రువుల కుట్ర, వారి కుయుక్తులు, తను ఓడిపోయిన వైనము, శత్రువులచేత తన రాజ్యము ఆక్రమించబడిన విధానము మొదలైనవన్నీ అతనికి మరల మరల గుర్తుకొస్తున్నవి. తాను సంపాదించి దాచిన ధనవైభవములన్నింటినీ శత్రురాజులు అనుభవిస్తున్న వైనము అతని హృదయమును వికలము చేస్తున్నది. ప్రపంచం చేత తాను తిరస్కరించబడి నప్పటికీ ప్రపంచమును వదిలిపెట్టలేని స్థితిలో ఉన్నది మహారాజు మానసికస్థితి!

ఆదిశక్తి లీలాగాథకు చెందిన గతసంచికలో ఇదే సత్యమును ఉద్ఘాటించడము జరిగినది. 'ఒకప్పుడు నన్ను అనుసరించి, నా దయకు పాత్రులైన ప్రజలు ఇప్పుడు ఇతర రాజులను అనుసరిస్తున్నారు. వ్యర్థముగా ఖర్చుచేసే వ్యక్తులు, ఇప్పుడు నిరంతరము వారి ఇష్టం వచ్చినట్లు ఖర్చుచేస్తూండవచ్చు' మొదలైన ఆలోచనలతో సురథ మహారాజుగారి మనస్సు వికలమౌతూండటం చేత ఒక్కక్షణమైనా ఆయనకు శాంతి లభించటము లేదు. హతాశ, నిరాశలకు గురియైన ఈ మానసిక స్థితిలో ఆయన పదేపదే గతకాలపు స్మృతులలోకి నెట్టివేయబడుతుండేవాడు. **జీవితములో లాభము, నష్టము దేనినైనా పొందగలగటము-పొందలేకపోవటము అనేవి మన ఇష్టాయిష్టాల వల్లకాక, కేవలము కర్మయొక్క కఠోర నియమమును అనుసరించి జరుగుతుంటాయనే సత్యమును మోహజనితమైన భ్రమలలో చిక్కుకుని, రాజు మరచిపోతున్నాడు.**

ఆయన జీవితములోని ఈ సత్యము ఆదిశక్తి లీలాగాథ యొక్క ఈ క్రింది శ్లోకమంత్రము ద్వారా తెలియజేయబడుతున్నది.

**సఞ్చితః సోఽతిదుఃఖేన క్షయం కోశో గమిష్యతి ।**
**ఏతచ్చాన్యచ్చ సతతం చిన్తయామాస పార్థివః ॥ (1/1/16)**

**అర్థము:** 'అనవసరముగా వ్యయము చేసే వ్యక్తుల వల్ల, ఎంతో కష్టపడి సంపాదించి జమ చేయబడిన నా ధనమంతా ఖర్చయి పోతుంటుంది' అని, ఇంకా ఇలాంటివే మరికొన్ని ఆలోచనలు ఆయన మనస్సును పట్టి వేధిస్తున్నాయి.

ఆదిశక్తి లీలాగాథకు చెందిన ఈ మంత్రము సాధకుల ఆలోచనలకు ఒక హెచ్చరిక వంటిది. సాధకుని మనస్సు, ఆలోచన, చేతనత్వము ఈ మూడూ కూడా అతని నియంత్రణలో స్థిరంగా ఉండాలి. పైన చెప్పిన మూడింటిలో ఏవిధమైన భ్రమగాని, పొరపాట్లుగాని, అస్థిరత్వముగాని ఏర్పడినట్లయితే అతని ద్వారా చేయబడే సాధన వ్యర్థమైపోతుంది. అందుచేతనే మనస్సును, హృదయమును నిరంతరము భవతారిణియైన భవానీ మాత యొక్క నామము, రూపము, గుణములు, లీలాకథల యొక్క కథన-శ్రవణములయందు, పఠనమునందు లగ్నము చెయ్యవలసిన ఆవశ్యకతను గురించి, శాస్త్రములు పలుమార్లు హెచ్చరిస్తున్నాయి. అందుచేతనే సత్సంగము యొక్క ప్రాముఖ్యత గురించి అనేక

**ఐకమత్యమే బలం**

మార్గ్లు, ఎన్నోవిధాలుగా చెప్పబడినది కూడా! మనస్సును చంచలము కానీయకుండా, దానికి ప్రేరణ, ప్రకాశములు లభించ టానికి సత్సంగము దోహదము చేస్తుంది. ఏ కారణము చేతనైనా మనస్సు అస్థిరమైనప్పటికీ, సత్సంగము ద్వారా లభించే మంచి ఆలోచనలు దానిని మరల సన్మార్గములోనికి మళ్ళించగలవు.

'సాధన అనేది కేవలము ఒక క్రియమాత్రమే కాదు. అది మాతయైన భవానిలో భావపూరితముగా లీనం కావటం' అని సాధు సంత్‌లు, సాధకులు చెప్తున్నారు. 'భావనాత్మకముగా లీనము కావడము' అనేది జరగనప్పుడు, మిగిలిన క్రియలన్నీ కేవలము భ్రమ, మనలను మనము మోసగించుకొనడం మాత్రమే అవుతాయి. ఈ విషయమై బెంగాలుకు చెందిన ప్రఖ్యాత సాధువు విజయకృష్ణ గోస్వామి జీవితమునకు సంబంధించిన ఒక సంఘటన ఎంతో కుతూహలమును కలిగిస్తుంది. వ్రజక్షేత్రములో, యమునా తీరమున వారు తపస్సు చేసుకుంటున్నప్పటి సమయమునకు సంబంధించినది ఈ సంఘటన! ప్రాతః సాయంకాలములు, రాత్రింబవళ్ళు, అన్ని జాములలోను సర్వదా వారు భగవంతుని నామస్మరణలోనే లీనమై ఉండేవారు. జీవితమునకు సంబంధించిన ఇతర కార్యకలాపములన్నీ ప్రకృతి ప్రేరణాత్మకముగా వాటంతటి అవే జరిగిపోతూండేవి. కానీ వారి భావపూరితమైన ఆలోచనలు, భావనలు సదా భగవంతుని యందే లగ్నమై ఉండేవి.

ఎప్పటివలెనే ఆరోజుకూడా వారు ప్రాతఃకాలము, బ్రహ్మ ముహూర్తములో యమునా తీరమునకు వచ్చి జపము చేసుకోవటానికి కూర్చున్నారు. జపము చేసుకొనటానికి అనువైన ఆసనమును వారు ఇంకా స్థిరపరచుకోకముందే, నీడలాంటి ఒక ఆకృతి వారి కళ్ళముందు కదలాడింది. ఆ ఆకారము యొక్క నోటినుండి గాయత్రీ మంత్రము ఉచ్చరించబడుతున్నది. అయితే ఆ ఆకారము యొక్క ముఖము మాత్రము అశాంతితో ఉన్నది. ఆ నీడ ఉండుండి కనబడుతూన్నా, వెనువెంటనే మాయమై పోతుండేది. దాని పరిస్థితి చూస్తే ఏదో చెప్పాలనుకుంటున్నట్లు, కానీ చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు అనిపిస్తున్నది. నీడవంటి ఆ ఆకృతిని చూసి గోస్వామిగారు కూడా ఆలోచనలోపడ్డారు. ఆయన తమ కమండలములోని నీటిని ఆ ఆకృతిమీద చిలకరించారు. తపశ్శాలియైన ఆయన చిలకరించిన పవిత్ర జలము ప్రభావముతో ఆ నీడ ఇప్పుడు స్థిరంగా నిలబడింది.

'ఎవరు నీవు? ఏమి చెప్పాలనుకుంటున్నావు' అని గోస్వామి వారు ప్రశ్నించగా, 'నా పేరు రామప్రసాదవంద్యోపాధ్యాయ. నేను గాయత్రీ సాధకుడను! కానీ నేను పైకి గాయత్రీమంత్రమును వల్లించేవాడినే కానీ నా అంతరంగము ఎప్పుడూ ధనమును కూడబెట్టడము మీదనే లీనమై ఉండేది. జీవితపు చరమాంకములో నా అదృష్టము కొద్దీ బృందావనమునకు వచ్చాను. అక్కడే నేను అంతిమశ్వాస విడిచాను. కూడబెట్టుకున్న ధనం మీద వ్యామోహం నన్ను ప్రేతాత్మగా మార్చింది. ఇక మీరే నన్ను రక్షించాలి' అని ఆ ఛాయారూపము తన గాథను వినిపించినది. ఆ కథను విన్న గోస్వామిగారు చకితులయ్యారు. 'నిన్ను రక్షించడము ఎలా?' అని ఆయన ఆ ఛాయనే ప్రశ్నించారు.

'నేను దాచుకున్న ధనమును ఫలానా ప్రదేశములో పాతి పెట్టాను. దానిని త్రవ్వి బయటకు తీసి సత్కార్యములకు వినియోగించండి. ఈ విధముగా చెయ్యటము వల్ల దానిపట్ల నాకున్న మోహబంధము నశించిపోతుంది. ఆ చేయబడే సత్కార్యముల పుణ్య ప్రభావమువల్ల నాకు ముక్తి లభించగలదు' అని ఆ ప్రేతాత్మ సమాధానమిచ్చినది.

నీవు కోరుకున్న విధముగా చేస్తానని, విజయగోస్వామివారు ఆ ప్రేతాత్మకు చెప్పి ఊరడించారు. గాయత్రీ మంత్రమును జపించినప్పటికీ ప్రేతయోనిలోకి వెళ్ళవలసిన అగత్యం ఎందుకు కలిగిందో చెప్పమని ఆయన కోరిన మీదట ఆ ఛాయారూపము 'మహాత్మా! గాయత్రీమహామంత్రము యొక్క సామర్థ్యము మీద సందేహము వద్దు. ప్రేతయోనిని పొందటానికి నాలోని మోహ బంధమే కారణము! గాయత్రీమంత్రజపము యొక్క ప్రభావము వల్లనే మీవంటి తపస్సంపన్నులైన మహానుభావులను కలవ గలిగాను. తమరే నన్ను ఉద్ధరించే మార్గము చూడగలరు' అని ప్రత్యుత్తరమిచ్చినది. ఆ సమాధానమునకు విజయకృష్ణగోస్వామి గారు సంతృప్తిచెందారు. వారు ఆ ఛాయారూపము చెప్పిన విధంగానే అన్ని పనులను నిర్వహించారు. తరువాత ఆ ప్రేతాత్మకు విముక్తి లభించి మేలు చేకూరినది. తన జీవితములోని ఈ ప్రసంగమును వినిపిస్తూ ఆయన తన శిష్యులతో, 'సాధకుని జీవితములో ఏదైనా అవరోధమున్నదీ అంటే అది ఒక్క మోహమే!' అని చెప్పేవారు. సురథ మహారాజుగారు కూడా ఈవిధమైన మోహ బంధనముతోనే చుట్టివేయబడి ఉన్నారు. భవతారిణియైన భవానీ మాత యొక్క దయమాత్రమే ఆయనను రక్షించగలిగే సామర్థ్యము కలిగి ఉన్నది.

ఆదిశక్తి లీలాగాథకు చెందిన ఈ శ్లోకమంత్రములో ఇమిడి ఉన్న ఈ ఆధ్యాత్మిక-దార్శనిక భావనలతోపాటు, దీనియొక్క విశేష సాధనా విధానము కూడా క్రిందన ఇవ్వబడినది.

**చీకటి అంటే మన కన్ను చూడలేనిది**

## సాధనా విధానము

**వినియోగ:** ఓం అస్యశ్రీ 'సఞ్చిత సోఽ తి దుఃఖేన' ఇతి సప్తశతీ షోడశ మన్త్రస్య శ్రీబ్రహ్మఋషిః, శ్రీమహాలక్ష్మీదేవతా, క్రీం బీజం, క్షేమకరీశక్తిః, బగళామహావిద్యా, తమోగుణః, శ్రోత జ్ఞానేన్ద్రియం, ద్వేషో రసః, లిఙ్గ కర్మేన్ద్రియం, సౌమ్య స్వరం, జల తత్త్వం, నివృత్తికళా, హ్లీం ఉత్కీలనం, యోని ముద్రా, మమ జ్ఞానభక్తివైరాగ్య పూర్వకం క్షేమస్థైర్యాయురారోగ్యాభివృద్ధ్యర్థం శ్రీఆదిశక్తి గాయత్రీమాతా రూపేణ యోగమాయా భగవతీ శ్రీమహాదుర్గా ప్రసాదసిద్ధ్యర్థం చ నమోయుత ప్రణవ-వాగ్బీజ-స్వబీజ-లోమ-విలోమ పుటితోక్త షోడశమన్త్రజపే వినియోగః ॥

### న్యాసః

| | కరన్యాసః | షడంగన్యాసః |
|---|---|---|
| ఓం ఏం క్రీం | అంగుష్ఠాభ్యాం నమః | హృదయాయ నమః |
| నమో నమః | తర్జనీభ్యాం నమః | శిరసే స్వాహా |

సఞ్చితసోఽ తిదుఃఖేన మధ్యమాభ్యాంనమః శిఖాయై వషట్

క్షయం కోశోగ మిష్యతి అనామికాభ్యాంనమః కవచాయ హుమ్

ఏతచ్చాన్యచ్చ సతతం కనిష్ఠికాభ్యాంనమః నేత్రత్రయాయ వౌషట్

చిన్తయామాస పార్థివః కర-తలకరపృష్ఠాభ్యాంనమః అస్త్రాయ ఫట్

### ధ్యానం

కాన్త్యా కాఞ్చన సన్నిభాం హిమగిరి-ప్రఖ్యైశ్చతుర్భిర్గజైః ।
హస్తోక్షిప్త-హిరణ్యామృత-ఘటైరాసిచ్య మానాం శ్రియమ్ ।
విభ్రాణాం వరమబ్జ, యుగ్మమభయం హస్తై కిరోటోజ్జ్వలామ్ ।
క్షౌమాబద్ధ నితమ్బబిమ్బ వలితాం వన్దేఽ రవిన్ద స్థితామ్ ॥

### మంత్రం

ఓం ఏం క్రీం నమః
సఞ్చితః సోఽ తి దుఃఖేన క్షయం కోశో గమిష్యతి ।
ఏతచ్చాన్యచ్చ సతతం చిన్తయామాస పార్థివః ॥
నమో క్రీం ఏం ఓం ॥ 15 ॥
**1000 జపాత్ సిద్ధిః - పాయస హోమః ।**

అనగా పాయసముతో హోమము చేయవలెను.

**గాయత్రీమహామన్త్ర జప - 10,000**
**గాయత్రీ విధానేన దశాంశ హోమః ॥**

గాయత్రీమహామంత్ర జపము 10,000 చేయాలి. అందులో పదవవంతు గాయత్రీ విధివిధానముతో హోమము చేయాలి.

10 మాలలు గాయత్రీ మంత్రం చేసి ఒక మాల సప్తశతీమంత్రం చేయాలి. ఈవిధంగా పదిరోజులు చేయవలెను. ఆ తరువాత ప్రతిదానికి పదవవంతు హవనము చేయాలి.

**ఆధ్యాత్మిక ఫలశృతి:** మోహ బంధనమును గురించిన అంతర్ జ్ఞానము కలుగుతుంది.

**లౌకిక ఫలశృతి:** మోహము వల్ల కలిగే వేదనలనుండి ఉపశమనము.

గాయత్రీమంత్రముతో పాటు చేసే ఈ సప్తశతీమంత్ర సాధన వలన సాధకుని అంతరంగములో భగవతి దయవలన ప్రకాశము ఉదయిస్తుంది. తద్వారా సాధకుడు తనలో ఏర్పడుతున్న మోహమును గుర్తించగలుగుతాడు. దానితోపాటు అతడు తన వివేకముతో, మోహమువల్ల ఉత్పన్నమయ్యే మనోవికారములను నివారించు కొనుటలోను, అడ్డుకొనుటలోను సమర్థుడు అవుతాడు. అంతే కాదు, మోహము లేదా బంధము వల్ల ఏర్పడ్డ బాధలు వాటంతట అవే ఉపశమిస్తాయి.

*- అఖండజ్యోతి, ఏప్రిల్ 2010*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## జరధుస్త్

*పారశీ ధర్మ ప్రవక్త 'జరధుస్త్' అనే ఆయన విద్యాధ్యయనం పూర్తిచేసి, విద్వాంసుడుగా ఇంటికి తిరిగి వచ్చిన శుభ సందర్భంలో ప్రసన్నుడయిన తండ్రి నా సంపద నుండి నీవు ఏది కావాలన్నా కోరుకొమ్మని ఆదేశిస్తాడు. కానీ ఈయన వినయంతో తండ్రికి నమస్కరించి విలువైన తండ్రి సంపదలను కోరక ఆయన నడుముకి ఉండే పటకా (బెల్టు లాంటిది) ఇవ్వమని ప్రార్థిస్తాడు. తండ్రి ఆనందాశ్చర్యాలతో ఏ ఆదర్శాల కోసం తాను జీవితమంతా నడుము బిగించి పురుష ప్రయత్నం చేశాడో, ఆ పటకాను ఆనందంగా ఊడదీసి కుమారుని చేతిలో పెడతాడు. ఆసురీ ప్రవృత్తులను నశింపచేసి, దైవత్వానికి ఘనవిజయాన్ని సంపాదించాలని సంకల్పం చేసి 'జరధుస్త్' తండ్రి ఇచ్చిన పటకాతో నడుము బిగిస్తాడు. సంపద, సాధనల కంటే ఆదర్శాలకే ఎక్కువ విలువ ఇవ్వగల ఈ బాలుని శిష్యునిగా పొందిన గురువు, తనయునిగా పొందిన తండ్రి ధన్యులయ్యారు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**నిశ్శబ్దం అంటే మన చెవులకు వినిపించనిది**

మనం - మన ఆరోగ్యం

# ఆరోగ్యానికి మూడు రక్షణ గోడలు

వ్యాధి సోకిన తరువాత చికిత్స చేయటానికి ప్రయత్నిస్తాము. కాని అసలు ముందే తగిన జాగ్రత్తలు తీసుకొంటే రోగాల బారిన పడే అవకాశమే ఉండదు.

సృష్టిలోని సమస్త జీవరాశుల్లో ప్రకృతి నుండి లభించిన వరదానంతో అన్ని ప్రాణుల శరీరాలలో రోగనిరోధక శక్తి అనాయాసంగానే ఉంటుంది. దెబ్బ తగిలి గాయాలైనా లేక అనుకోని దుర్ఘటనల వంటి విషయాలను మినహాయిస్తే వాటికి రోగాలు రావు. ఇళ్ళలో పెంచుకొనే పశువులకు తప్ప, అరణ్యాలలో, వనాలలో ఉండే పశు-పక్షులకేకాక, మృగాలకు కూడా వ్యాధులనేవి రానేరావు. రోగాలు వస్తే వీటికి ఏ టానిక్ దొరుకుతుంది? బలానికి, ఏ ఔషధాలు సేవిస్తాయి? అసలు అటువంటి అవసరమే రాదు. ప్రకృతి నియమానుసారం జీవించుట చేతనే, వాటన్నిటి ఆరోగ్యం సహజంగానే సురక్షితంగా ఉంటుంది.

ఆరోగ్యంగా ఉండటానికి రహస్యమైన విధానం ఏదైనా ఉన్నదా? వ్యాధులు రాకుండా ఆపగలిగే చమత్కారం చూపగల రసాయనమేదైనా ఉంటుందా? వీటికి జవాబుగా లేదనే చెప్పవలసి ఉంటుంది. కారణమేమంటే, వేలమైళ్ళ దూరదూరంగా నివసించే ప్రాణులు ఏ విద్య నేర్చుకొని, ఆ జటిల పరిస్థితులను తట్టుకొని ఎలా జీవనం సాగిస్తున్నాయి. వివిధ ఋతువుల ప్రకోపాలను సహిస్తూ, ఆహారం లభించని స్థితిలో కూడా, రోగాల బారిన పడకుండా ఎలా జీవనం సాగిస్తున్నాయి? ఇది బాగా ఆలోచించ వలసిన విషయం.

మానవ శరీరం ఇతర ప్రాణుల శరీరాలతో పోల్చుకుంటే, ప్రతి విషయంలో ఎంతో శ్రేష్ఠమైంది. మస్తిష్కపు సంరచనలోనే గాక, మందంగా, బలంగా ఏర్పడి, దానిలోనికి సాధారణ రోగ కీటకాలు ప్రవేశం చేయజాలని విధంగా ప్రకృతి సిద్ధంగా ఏర్పాటు జరిగింది. ఒకవేళలోనికి ప్రవేశించినా, అక్కడున్న రక్షణ కాపలదారులను యుద్ధం చేసి జయించజాలవు. ఈ సమయంలో మనం, అశుభ్రతను శుభ్రపరచు వ్యక్తులను ఉదాహరణగా తీసుకొందాం. కొంతమంది అంటువ్యాధి రోగుల మల-మూత్రాదులను శుభ్రం చేస్తూ, వారి గుడ్డలను ఉతికి, వారి సేవలోనే నిరంతరం ఉంటారు. డాక్టర్లు, కాంపౌండర్లు, నర్సులు మొదలైన వారు రోగులను ముట్టుకొని చికిత్సానంతరం చేతులు కడుగుకొంటూ ఉంటారు. అయితే రోగుల శ్వాసప్రశ్వాస ద్వారా వ్యాపించు రుగ్మతలను కలిగించే రోగాల సేనను ఏవిధంగా ఆపి దూరంగా పారద్రోలగలరు? ఇంటి పరివార సభ్యులు, క్షేమ సమాచారాన్ని తెలుసుకోగోరే బంధువులు, స్నేహం, ప్రేమను చూపి రోగులను స్పర్శించినప్పుడు అంటురోగాల బారిన పడగలరు గదా! అలాగే రోగిష్టి తల్లి సంపర్కానికి అలమటించు ఆపినా ఆగని చిన్న పిల్లలు రక్షణకు ఎటువంటి బందోబస్తు ఏర్పాటు చేయవలసి ఉంటుంది? వారి రక్షణ ఎలా జరపాలి? ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవలసి ఉంటుంది?

మనలోని రక్తం, విశేషంగా తెల్లకణాలు, స్రవించు రసాయనాలు అన్నీ రోగ కణాలను ఎదుర్కొని నాశనం చేయగల సమర్థతను కలిగి ఉంటాయి. జటిల పరిస్థితి ఎప్పుడొస్తుందంటే, మనం ఈ రక్షణ వ్యవస్థను స్వయంగా చేతులారా చెడగొట్టుకుంటూ ఉంటే! సహజంగానే రోగరహితులుగా ఉంటే, వ్యాధుల వాతావరణంలో ఉన్నప్పటికి, మనకు రక్షణ లభించగలదు. ఎప్పుడు అంటురోగాలు వ్యాపించినా, అప్పుడు అనేక స్వయం సేవకులు, అనేక సేవలను అందించటమేగాక, చనిపోయిన వారి శవాలను దహనం చేయుటకు నిరంతరం సిద్ధంగా ఉంటారు. అటువంటి స్థితిలో కూడా వారికి ఎటువంటి ఇబ్బంది ఉండదు.

ఆరోగ్యం కొరకు మూడు రక్షణ స్థలాలను ఏర్పాటు చేసుకోవటం అనివార్యం. అందులో **మొదటి రక్షణ గోడ ఆహారం;** ఆహారపు మొదటి సురక్ష గోడలో అత్యంత గొప్ప విషయం ఆకలితో ఉన్నప్పుడు తక్కువగా తినటం. బాగా ఆకలి అనిపిస్తే తప్ప ఎటువంటి ఆహారం తినకూడదు. వేపుళ్ళు, మృదువైనవి లేక మసాల దట్టించిన రుచికరమైన పదార్థాలను రుచిగా ఉన్నాయని ఎక్కువగా తినటం చేత అజీర్ణం కలిగే అవకాశం ఉంటుంది. అందుకని త్వరగా జీర్ణంకాగల పాలు, పళ్ళు కూరగాయలు, జొన్నపిండి, కిచిడీ మొదలైన వాటిని బాగా నమిలి తింటే త్వరగా జీర్ణమై శుద్ధరక్తంగా మారినందున, రోగాలు రాకుండా ఉంటాయి.

'నిషా' కలిగించే పదార్థాలు, పానీయాలు ఆరోగ్యం మీద భయంకర దెబ్బ కొడతాయి. సిగరెట్లు మొదలుకొని సారాయి సేవనం వరకు అన్ని రకాల మాదకద్రవ్యాలు, తమ విషాన్ని

**భార్యాభర్తలు ప్రతి విషయాన్ని స్నేహితులలాగా చర్చించుకోవాలి**

శరీరంలో విరజిమ్మి, అన్ని అంగాలను శక్తిహీనం చేయటమే గాక, విషతుల్యంగా మార్చివేయగలవు. వీటి నుండి జాగ్రత్త వహించాలి. ఏవిధంగానైతే విషసర్పాల కాటు, తేలుకాటు, విష పురుగుల నుండి రక్షణ చేసుకొంటామో, ఆ విధంగా 'నిషా' కలిగించు పదార్థాల నుండి జాగ్రత్త వహించాలి. వాటిని సేవిస్తే అనేక రోగాలను ఆహ్వానించునట్లే అవుతుంది. ఒకసారి అవి శరీరంలోనికి ప్రవేశిస్తే, ఆ తరువాత వాటి మూలాలను తొలగించుట చాలా కష్టతరమవ గలదు.

**రెండవ రక్షణ గోడ "శ్రమ".** శ్రమించుట ద్వారా శరీరంలోని అన్ని అంగాలు సంచలనం జరిగి, ఓర్పుతో కూడిన సక్రియతను కలిగి ఉంటాయి. కొంతమంది పెద్ద మనుషులు బడాయికిపోయి, శరీర పరిశ్రమ చేయటం తమ ప్రతిష్టకు భంగమని తలంచి, ఊరికే తిని కూర్చొని సోమరులుగా కాలం గడుపుతూ ఉంటారు. బౌద్ధిక శ్రమను వాస్తవమైన శారీరిక శ్రమగా భావించకూడదు. దీనిలో ఆహారపు జీర్ణక్రియకు ఈ సహాయం లభించదు. ఇంకా అవయవాలకు సుసంచలనంగా ఉండే ప్రక్రియలో అవరోధం ఏర్పడగలదు. ఉపయోగించని చాకు కూడా కొంత కాలానికి తుప్పుపట్టి ఎందుకు పనికిరాకుండా పోతుంది. శ్రమ చేయనివారు, కష్టపడనివారు, లావెక్కిపోయి, షుగర్, రక్తపోటువంటి రోగాల బారిన పడతారు. ఒకవేళ ఎవరికైనా పొలం పనులు, శ్రామికమైన పనులుండవో, అటువంటివారు ప్రతినిత్యం నడకవంటి అలవాట్లు చేసుకొని, ప్రొద్దుట సాయంకాలం ఒక్క మైలుదూరమైనా నడుము తిన్నగా ఉంచుకొని, చేతులు ముందు వెనుకకు బాగా ఊపుకొంటూ వేగంగా నడుస్తూ ఉంటే కూడా శరీరంలోని అన్ని అంగాలలో సంచలనం జరిగి ఆరోగ్యం పొందవచ్చు. మరొక విధానం పక్క మీద పడుకొని అన్ని శరీర అవయవాలను క్రమబద్ధంగా క్రిందకుపైకి, ప్రక్కలకు తిప్పుకొంటూ కొంత సమయం వరకు చేయగలగాలి. వ్యాధిగ్రస్తులు; చిన్న పిల్లలు; వృద్ధులువంటివారికి ఈ విధమైన వ్యాయామం సరళంగా ఉంటుంది.

ఇక **మూడవ రక్షణ గోడ "మానసిక సంతులనం".** సదా మానసిక సంతులనం కలిగి ఉండాలి. ఏదో ఒక ఘటన వలన సందేహం, అనుమానం, ఆవేశం లేక ఆందోళనకు గురిఅవుతూ ఉంటారు. ఆవేశమనగా క్రోధం, చింత, భయం, ఈర్ష్యవంటివి. ఆందోళన ఏమనగా నిరాశ, ఉదాసీనత, ఆత్మహీనత మొదలైనవి. ఏ విధంగా శరీరంలో వేడి, చల్లదనం సరైన శాతంలో లేకపోతే శరీరం అస్తవ్యస్తమైపోతుంది. ఆ విధంగానే మానసిక అసంతులనం కూడా అటువంటి స్థితినే కలిగిస్తుంది. దాంతో శరీరము యొక్క సహజ స్వాభావికత తొట్రుపాటుకు లోనై మనస్సు అస్తవ్యస్థతకు గురై, దాని ప్రభావం శరీరం మీద పడి ఆందోళన కలిగిస్తుంది.

ఎల్లప్పుడూ మనిషి నవ్వుతూ నవ్విస్తూ, నిశ్చింతగా, నిర్భయంతో సంతుష్టమైన స్వభావం కలిగి, అందంగా, సంతోషంగా, సద్గుణులతో సాహసంగా గంభీరంగా తయారైతే, శరీరంలోపల జరిగే క్రియాకలాపాలు ఆరోగ్యం సంతరించుకోవటంతో, ఎటువంటి వ్యాధులు రావటానికి ఆస్కారముండదు. మానసిక సంతులనం మనుషులను, బుద్ధిమంతులుగా, దూరదర్శనం కలవారిగా, సాహసవంతులుగా తయారుచేసి, బయట నుండి ఏ రోగాలకు అవకాశమివ్వకుండా ఒకవేళ రోగాలు వచ్చినా వాటిని ఎదుర్కొనే శక్తిని సముపార్జించుకొని ఉన్నందున వాటి ప్రభావం శరీరం మీద పడదు.

మంచి స్వభావం గల వ్యక్తి బయట నుండి ఎదురయ్యే ఎటువంటి కష్టాలనైనా నిబ్బరంగా సహించి, తన మంచితనం, స్వభావ కారణంగా సంతుష్టుడై, ప్రసన్నంగా ఉంటాడు. ఎవరి మనసులో మోసం, కపటం, అబద్ధంవంటి గుణాలు ఉంటాయో, అటువంటి వారు నిరంకుశులుగా, కాఠిన్యంతో కూడిన గుణాలు వారిలోపల రెట్టింపై, పరస్పరం విరోధ వ్యక్తిత్వం పెరిగి, ఆందోళనతో కలవరపడి జీవించు వారిలో అనిద్ర, అశంకవంటి రోగాలు చుట్టుకొంటాయి. ఉద్విగ్నతతో జీర్ణవ్యవస్థ మీద చెడు ప్రభావం పడి, జీర్ణక్రియకు అవరోధం ఏర్పడుతుంది. ఎవరు మానసిక శాంతి లేకుండా ఉంటారో అటువంటి వారి మనోదశ అశాంతితో అలమటించిపోతూ ఉంటుంది. అంతేగాక రక్త సంచారంలో, శ్వాసప్రక్రియలో, మూత్రాశయ పనితీరులో మరియు జీర్ణరసాలు సరైనవిధంగా స్రవించుటలో అవరోధం ఏర్పడి శరీరంలోని ఆరోగ్యకరమైన జీవాణువులు ఎండిపోయి రోగ క్రిములు పుట్టుకొస్తాయి. లోనున్న చెడు శుభ్రపడకపోతే, లోపలి భాగాలు కుళ్ళి, ఎన్నో రోగాలు అనాయాసంగా వ్యాపించి పోతాయి. అయితే ఎవరిలో పైన వివరించబడిన సురక్షితాత్మక మూడు గోడలు సుదృఢంగా ఉంటాయో, అటువంటివారు వ్యాధులకు లోనుకారు. ఒకవేళ తప్పనిస్థితిలో ఏదైనా ప్రకోపం ఏర్పడినా అది ఎక్కువ సమయం ఉండజాలదు.

*– అఖండజ్యోతి, జులై 1985*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**తల్లిదండ్రులు పిల్లల ఎదుట పోట్లాడుకోకూడదు**

# మానవునికి పరాజయం లేదు

ఆస్ట్రేలియాలో 1956 సంవత్సరంలో 65 సంవత్సరాల పారిశ్రామిక వేత్త ఫ్రేంక్ బ్యారే గుండె ఆగిపోవటం వల్ల చనిపోయారు. గొప్ప, పేద, కూలి, పారిశ్రామికులు అన్న భేదం లేకుండా ప్రతిరోజు అనేకమంది వ్యక్తులు అనేక రోగాల వల్ల చనిపోతూనే ఉంటారు. వారి వారి బంధువులు దుఃఖసాగరంలో మునిగిపోతుంటారు. కొంత కాలానికి తిరిగి మామూలు జీవితాలని గడుపుతున్నారు. కాని ఫ్రేంక్ బ్యారే చనిపోయిన తర్వాత ఆయన ఫ్యాక్టరీలో పనిచేసే 4,000 మంది సిబ్బంది తాము అనాధులయి పోయినట్లు విలపించారు. దానికి కారణం ఫ్రేంక్ బ్యారే తన ఫ్యాక్టరీలోని శ్రామికులతోను, ఉద్యోగస్థులతోను స్నేహ వాత్సల్యాలతో మసిలేవాడు. వారిమీద ఎక్కువ శ్రద్ధ చూపేవాడు. చనిపోయి నప్పుడు ఆయన తన 20 కోట్ల రూపాయల ఆర్థిక సామ్రాజ్యాన్ని వదిలివేశాడు. ఆ సంపద అంతా స్వయంకృషితోనే సంపాదించినదే. ఆయనకి చిన్నతనం నుండే గుండె జబ్బు ఉండేది. అయినా మిక్కిలి శ్రమతో కష్టపడి అంత డబ్బు సంపాదించాడు.

ఆస్ట్రేలియాలో ఒక చిన్న వృత్తి చేసుకొనే ఒక సాధారణమైన కుటుంబంలో ఫ్రేంక్ బ్యారే జన్మించారు. నిమ్నవర్గ కుటుంబాలలో జన్మించిన వారు ఆర్థికంగా ఎన్నో కష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది. అలాగే ఫ్రేంక్ కుటుంబం కూడా అనేక కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. తల్లిదండ్రులు తమ పిల్లవాడికి అవసరమైన పాలు మొదలైన పౌష్టికమైన ఆహారాన్ని ఇవ్వలేక పోయారు. దాని ఫలితంగా ఫ్రేంక్ చిన్నప్పటినుంచి బలహీనంగా కొంచెం అస్వస్థతగా ఉండేవాడు. బహుశా ఆ జబ్బు వల్లే తమ గారాలబిడ్డ చనిపోతాడేమోనని ఆయన తల్లిదండ్రులు బెంగపడే వారు. పేదవారికి కూడా తమ పిల్లల పట్ల ప్రేమ మమకారాలు ఉంటాయి కదా.

5-6 సం॥ల వయస్సులోనే ఫ్రేంక్ బాగా జబ్బుపడ్డాడు. ఆయనకి వాతరోగం వచ్చింది. రాత్రింబగళ్ళు జ్వరం తీవ్రంగా ఉండేది. శరీరం బాగా వేడిగా ఉండేది. కాళ్ళు చేతులు నొప్పులుగా ఉన్నాయని అంటూ ఉండేవాడు. ఆయనకి వైద్యం చేయించే స్థోమత తల్లిదండ్రులకు లేదు. జ్వరంకూడా తనని ఎవరు పట్టించు కోవటం లేదని ఫ్రేంక్‌ని వదిలేసింది. కానీ ఏ విధంగా అయితే ఒక కోపిష్టి బిచ్చగాడు తనకు భిక్ష లభించకపోతే తన కర్రతో తలుపుని బాదిపోతాడో, అలాగే ఫ్రేంక్ యొక్క జబ్బు ఆయన ఆరోగ్యంపైన తన చిహ్నాలను వదిలివేసింది. ఆ జబ్బు ఆయన గుండెని బలహీనం చేసింది. దాని ప్రభావం వల్ల గుండెలో దోషం ప్రవేశించింది. కొన్ని రోజుల తర్వాత ఆయనకి గుండెజబ్బు అని తెలిసింది. అక్కడ డాక్టర్లు జబ్బు తగ్గటం అసాధ్యమని, ఎక్కువ రోజులు బ్రతకడని కూడా చెప్పారు. కానీ డాక్టర్లు అసాధ్యమని చెప్పిన ఆ జబ్బు తీవ్రత తగ్గటం మొదలైంది. అప్పుడు ఆయన వయస్సు 12-13 ఏళ్ళు, ఆ వయస్సులో ఏ విధంగా ఆరోగ్యాన్ని తన వశం చేసుకున్నాడో చెప్తూ ఉండేవారు. **"నేను జీవించి ఉండాలని, ఆరోగ్యంగా ఉండాలని నాకు ఆకాంక్ష ఉండేది. ప్రపంచానికి ఏదో ఒకటి చేసి చూపించాలి" అని అనుకుంటూ ఉండేవాడిని. ఈ పట్టుదల, దృఢసంకల్పమే ఆ జబ్బుని ఓడించాయి.**

ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఫ్రేంక్ తన మనస్సులో నుంచి జబ్బు విషయాన్ని పూర్తిగా మరచిపోయాడు. తనకి అసాధ్యమైన గుండె జబ్బు ఉన్నదన్న విషయాన్ని మనస్సు నుండి పెరికివేశాడు. ఆయన మిగతా పిల్లలలాగా చదువులోను, ఆటలలోను మునిగిపోయేవాడు. ఆ గ్రామంలో ఈత పోటీలు జరిగినాయి. ఫ్రేంక్ కూడా తన స్నేహితులతో పాటు ఈతల పోటీలు చూడటానికి వెళ్ళాడు. పోటీలలో పాల్గొనే వాళ్ళకి సన్మానం చేశారు. విజయం సాధించాలని శుభాకాంక్షలు చెప్పారు. పోటీలు అయిన తర్వాత గెలిచిన వారికి బహుమతులు ఇచ్చారు. దాని ప్రభావం ఫ్రేంక్ మీద చూపింది. ప్రజల యొక్క స్నేహం, గౌరవం ఆర్జించాలని తను కూడా ఈతగాడు అవాలని ఫ్రేంక్ అనుకున్నాడు. ఆ సంకల్పంతో ఈతను అభ్యసించటం ప్రారంభించాడు, ఇతర ఆటలని మానేశాడు. ఎక్కువ సమయం ఈతను అభ్యసించటం అందులోని మెళకువలను ఆకళింపు చేసుకోవటం కొనసాగించాడు. కొద్ది సంవత్సరాలలోనే ఆస్ట్రేలియా 'ఛాంపియన్ షిప్' సొంతం చేసుకున్నాడు. తర్వాత ఒలంపిక్స్ పోటీలలో కూడా పాల్గొని విజయం సాధించాడు. ఈత క్షేత్రంలో ఉన్నతమైన సఫలత్వం పొందాడు.

దురదృష్టం గుండె జబ్బు రూపంలో మరల దాని ప్రభావం చూపింది. కాని ఫ్రేంక్ తన సంకల్పంతో జీవితాంతం ఆ జబ్బును ఓడిస్తానని ప్రమాణం చేశాడు. కొద్దిరోజుల తర్వాత మరల ఆరోగ్య వంతుడైనాడు. ఇంత తీవ్రమైన జబ్బు ఎలా తగ్గిందా అని డాక్టర్లు కూడా చాలా ఆశ్చర్యపోయారు. సాధారణ స్థితిలో కూడా ఈ జబ్బు ఉన్నవారు తమ పనులను తాము స్వయంగా చేసుకోలేరు. కాని ఫ్రేంక్ ఆ జబ్బు తీవ్రంగా ఉన్నప్పటికి బ్రతికే ఉన్నాడు.

**నువ్వు కోపగించుకునేవారే నీకు సహనాన్ని నేర్పే గురువులు**

ఆయన తన ఈత అభ్యాసాన్ని ఆపేసారు. అయినా ఈతపట్ల ఆయనకి మక్కువ తగ్గలేదు. 9 మందికి ఈత నేర్పటం ప్రారంభించాడు.

ఈ సంఘటన ఫ్రేంక్ బ్యారె వయస్సు 31 సంవత్సరములు ఉన్నప్పుడు జరిగింది. ఒకసారి తన శిష్యులకు సముద్రంలో ఈత అభ్యాసం చేయించటానికి తీసుకొని వెళ్ళాడు. అప్పుడు వారిమీద ఒక షార్క్ చేప ఆక్రమణ చేసింది. 9 మంది ఈతగాళ్ళు గాయపడ్డారు. ఎవరూ కూడా తిరిగి ఒడ్డుకి రాలేక పోయారు. ఫ్రేంక్ వెంటనే తన ఈతగాళ్ళని రక్షించడానికి వెనక ముందు చూడకుండా సముద్రంలోకి దూకాడు. గాయపడ్డ శిష్యులను ఒడ్డుకి తెస్తున్నాడు. అప్పుడే వాళ్ళపైన మరొక షార్క్ చేప దండయాత్ర చేసింది. అతికష్టం మీద చేపబారి నుండి తనని తాను రక్షించుకుంటూ శిష్యులను కూడా రక్షించి ఒడ్డుకు తేగలిగాడు. ఈ సంఘటన గురించి వార్తా పత్రికలో ప్రముఖంగా వ్రాశారు. ఫ్రేంక్‌కి గుండెజబ్బు ఉన్నదని డాక్టర్లు అతన్ని హెచ్చరించారని కూడా వార్తాపత్రికలో వెలువడింది. రోగముతో బలహీనం అయినప్పటికి ఫ్రేంక్ నిజంగా అద్భుతమైన వీరునిగా నిరూపించు కున్నారు. ఆయనకి, ఆయన శిష్యులకు ఆస్ట్రేలియా ప్రభుత్వం పతకాలు, బహుమతులను ఇచ్చింది. అతని వీరత్వం మరియు సాహసం గురించి ప్రజలు చాలారోజుల వరకు ప్రశంసిస్తూనే ఉన్నారు.

ఇతరులు బహుమతి రూపములో పొందిన డబ్బును ఏమి చేసారో తెలియదు కాని ఫ్రేంక్ మాత్రము ఆ డబ్బుతో వ్యాపారం ప్రారంభించాడు. ఆ డబ్బుతో టైర్లు రిపేరు చేసేపని ప్రారంభించాడు. ఈ పని తక్కువ రొక్కంతోనే చేసాడు. కాని దాని అభివృద్ధి కోసం ఫ్రేంక్ రాత్రింబగళ్ళు కష్టపడ్డాడు. ఆయన పరిశ్రమ వల్ల, వినియోగదారులు సంతుష్టులైనారు. ఆయన వ్యాపారం దినదినాభివృద్ధి చెందింది. 12 సంవత్సరాలలో బాగా డబ్బు సంపాదించాడు.

ఫ్రేంక్ వచ్చిన డబ్బును తిరిగి పెట్టుబడి పెట్టి టైర్లు తయారు చేసే ఫ్యాక్టరీని స్థాపించాడు. శ్రమ, నమ్మకం, న్యాయం ఆయన ఫ్యాక్టరీని అభివృద్ధి చేసింది. ఆయన మెల్లమెల్లగా తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. 22 సంవత్సరాలలో ఫ్రేంక్ ఎంత సంపాదించా డంటే ఆయన చనిపోయే సమయానికి ఆయన దగ్గర 20 కోట్ల కంటే ఎక్కువ సంపద ఉన్నది.

ఫ్రేంక్ ఆదర్శ సఫల వ్యాపారస్థుడే కాదు, ఇతరుల పట్ల ఆయనకి జాలి, సానుభూతి కూడా ఉండేవి. ఇతరుల కష్టాల బాధలు తెలిసినవాడు. పేదరికం అంటే ఏమిటో ఆయనకి బాగా తెలుసు. పేదవారిపట్ల ఇతరులు ఎలా ప్రవర్తిస్తారో అనుభవ పూర్వకంగా తెలుసు. ఆ స్థాయిలో ఉన్న ఫ్రేంక్ పేదవాడయినా, గొప్పవాడయినా, చిన్న అయినా, పెద్ద అయినా ఇతరుల పట్ల గౌరవంగా ఉండేవాడు. ఆయనలో ఉదారత్వం, వ్యక్తిత్వం, వ్యవహార కుశలత అద్భుతమైన సమన్వయం ఉండేది. ఈ గుణాల వల్లే ఆయన కేవలం తన ఫ్యాక్టరీలో పనిచేసే ఉద్యోగస్థుల హృదయాలనే గాక సాధారణ ప్రజల హృదయాలని కూడా జయించాడు. ఆయన మంచిప్రవర్తన వల్ల సాధారణ వ్యక్తులే కాక విశిష్ట వ్యక్తులు కూడా ఆయన్ని గౌరవించేవారు. ఫ్రేంక్‌తో సంపర్కం పెట్టుకున్నవాళ్ళందరికి ఆయన మీద నమ్మకం ఏర్పడింది. ఆ కారణం వల్లనే 1940లో ఆస్ట్రేలియాలో రెండవ ప్రసిద్ధికెక్కిన నగరం మెల్‌బోర్న్‌కు ప్రథమ పౌరుడుగా ఉండాలని అందరు కోరగా ప్రజల యొక్క భావాలను గౌరవిస్తూ వారి కోరికలను తీర్చటానికి అంగీకరించాడు. ఆ పదవిలో ఉంటూ మెల్‌బోర్న్ వాసులకు మంచి సేవ చేసాడు. దాని ఫలితంగా ఆయనని 1942లో 'సర్' అనే బిరుదుతో సత్కరించారు.

సంపద ఎలా పెరుగుతూ ఉన్నదో అలాగే ఫ్రేంక్ హృదయంలో ఔదార్యం పెరుగుతూ ఉన్నది. అనేక విద్యాసంస్థలను స్థాపించాడు. అనేక ఆస్పత్రులను కట్టించాడు. తన ఉద్యోగస్తులకు ఏదైనా ఆపద వచ్చినప్పుడు, వారికి ఏదైనా కఠిన సమస్య వచ్చినప్పుడు వారికి సహాయంగా ధార్మికనిధిని నెలకొల్పాడు. దీనివల్ల ఉద్యోగస్తులు సుఖశాంతులతో ఉండాలని ఆయన అభిలాష. 65 సం॥ వయస్సులో ఆయనకి జబ్బు తిరగపెట్టింది. ఈ సమయంలో ఆయనకి వైద్యం చేయించుకోవటానికి అనేకమైన సౌకర్యాలు ఉన్నాయి. ఫ్రేంక్ తన జీవితంలో తన జబ్బును జయించి లక్ష్యాన్ని సాధించాడు. తను అనుకున్నది సఫలమైనది. ఆయన వైద్య సహాయానికి ఏర్పాట్లు చేస్తూ ఉంటే "నాకు జీవితంలో తృప్తి కలిగింది ఇంక నాకేమి కోరికలు లేవు నా కోసం ఉపయోగించే డబ్బును అవసరమైన వారికి ఉపయోగించండి" అని చెప్పాడు.

అయినప్పటికి ఫ్రేంక్‌కి వైద్యం చేయిస్తూనే ఉన్నారు. కాని ఫ్రేంక్ శరీరాన్ని వదిలివేశాడు. ఆయన 20 కోట్ల సంపదలో ఎక్కువ భాగం జన కళ్యాణం కోసం దానం చేశాడు. మిగిలినది శ్రమించే పరిజనులకు వదిలి వేశాడు. అలాంటి మంచి మనస్సు, ఉదార స్వభావంగల యజమాని కోసం కూలీలు మిక్కిలి విలపించటం సహజమే కదా.

*– అఖండజ్యోతి, డిసెంబరు 1980*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజ్యం*

**ఇంటిని చూస్తే ఇంటివారి మనస్సు ఏమిటో అర్థమవుతుంది**

## సమయదానం-వానప్రస్థం - 2

# వర్ణాశ్రమ ధర్మం యొక్క మహత్త్వపూర్ణమైన భూమిక

వర్ణాశ్రమధర్మమునకు తనదైన గొప్పతనమున్నది. దాని ద్వారా శ్రమ మరియు బాధ్యతలు విభజింపబడతాయి. పూర్వీకులు ఏ వృత్తులు చేస్తూ వస్తున్నారో, వాటిని భావితరము కూడా మరింత మెరుగైన రీతిలో చేయగలుగుతుంది. ఉపాధ్యాయుని పిల్లవాడు అతనికంటే మంచి ఉపాధ్యాయుడు కాగలుగుతాడు. వ్యాపారస్థుల సంతానములో వ్యాపారాత్మకమైన కుశలత కనబడుట స్వాభావికమే! అంతేకాక, వారి కార్యకుశలత వృద్ధిచెందుతూ ఉంటుంది. ప్రయత్నము, శ్రమల విభజన కూడా సంతులనముగా ఉంటుంది. ఇటువంటి ఎన్నో ప్రత్యేకతలను దృష్టియందు ఉంచుకుంటూ భారతీయ సంస్కృతిలో ఒక మహత్త్వపూర్ణమైన వర్ణవ్యవస్థ విశేషరూపములో నిర్మించబడి, వికసింపజేయబడినది.

వర్ణాశ్రమధర్మవ్యవస్థ వంటి మహత్త్వపూర్ణమైన సామాజిక ప్రక్రియను, ఒక సమాజమును ఖండఖండాలుగా, ముక్కలు ముక్కలు చేసి దూరంగా విసిరిపారేసినవారి దుర్భాగ్యమును ఏమని చెప్పగలము? దూరదృష్టి లేకపోవడం వలన అనేక ఉచ్చ-నీచ భేదభావములకు జన్మనిచ్చినది. ఒక సమాజము అసంఖ్యాకమైన ముక్కలుగా విభజింపబడి చెల్లాచెదరైపోయింది. వర్ణాశ్రమధర్మ వ్యవస్థ మూలస్వరూపము మొత్తం ఇప్పుడు దాదాపుగా నష్టమైపోయింది. దాని స్థానములో కులాల వికృతభావన వేళ్ళూనుకుంది. కులాల నుండి ఉపకులాల విషపు తీగలు చిగురించి అవి సర్వత్రా అల్లుకుపోసాగాయి. ఈ చిక్కుముడి ఇప్పుడు దేశ జీవనములో అంతఃకలహము యొక్క భూమికను నిర్వహిస్తున్నది. ధర్మము, వృత్తి, వ్యాపారము, రాజనీతి మొదలైన వాటన్నింటిలో కులముల ప్రచారము బాగా పుంజుకున్నది. ప్రాంతీయవాదము, భాషా వాదములవలెనే ఇప్పుడు కులవాదం సైతము లోలోపలే అగ్నివలె ప్రజ్వరిల్లుతున్నది. అది దేశ ఐకమత్యమును భస్మీపటలము చేయబోతున్నది.

ఈ పరిస్థితులలో వర్ణవ్యవస్థను గురించి నూతన దృక్కోణములో ఆలోచించవలసి ఉన్నది. దానిలో మౌలిక మరియు క్రాంతికరమైన పరివర్తన చెయ్యవలసి ఉన్నది. జన్మ-జాతి అనే వర్తమాన అభిప్రాయములను తుడిచిపెట్టెయ్యవలసి ఉన్నది. మనిషికి-మనిషికి మధ్య కులాల పేరుమీద ఉచ్చనీచముల యొక్క ఏ రివాజు అమలులో ఉన్నదో దానిని తొలగించవలసి ఉన్నది. వృత్తి ఆధారముగా వంశపరంపరాగతమైన వృత్తి కొనసాగవచ్చును, మంచిచెడు కర్మల ఆధారముగా ఉచ్చనీచములను నిర్ధారించవచ్చును. ఈ క్రాంతికారకమైన పరివర్తనలతో నిశ్చయముగా వర్ణ వ్యవస్థను సమయానుకూలముగా తిరిగి నిర్ధారించవలసి ఉన్నది.

వానప్రస్థము స్వీకరించుటకు ప్రథమ చరణము బ్రహ్మవిద్యా పారాయణ చేయుట, దానిలో పారంగతులు అవ్వటమే! జ్ఞానామృతముతో పరిపూర్ణుడైన వ్యక్తే బ్రహ్మనిర్వాణమును పొందగలడు. లోకనిర్మాణము వంటి మహాప్రయోజనము కొరకు అధికారి అవుతాడు అని వేరుగా చెప్పనవసరము లేదు.

మనీషులు ఉత్తరార్ధములో గల ఏ వానప్రస్థాశ్రమ ఉపయోగమును గురించి నొక్కివక్కాణించి, ప్రతిపాదించారో దాని ద్వితీయ చరణము తపోసాధన, యోగాభ్యాసము! ఆత్మను ఆవరించి ఉన్న కషాయకల్మషములు, మల-ఆవరణలు మరియు విక్షేపములను ఈ అగ్నిసంస్కారము ద్వారానే నివారించి నశింపజేయుట సంభవమౌతుంది. అణగారి ఉన్న ఆంతరిక ప్రఖరత ఈ మార్గములో ప్రయాణించుటచేత తిరిగి కాంతులీనుతుంది. ఆత్మబలము సంపాదించుటకు తపస్సే ప్రధానమార్గమై ఉన్నది. ఆ విధముగా చేసిన తపస్సు వలన కాలక్రమములో అంతఃక్షేత్రము లోను, పంచకోశములలోను తేజోవంతుడు అవుతాడు. షట్చక్రములలోను, మూడు శరీరములలోను ఒకదానిలో కంటే మరొకదానిలో అద్భుతమైన విభూతులు దాగి ఉన్నాయి. వాటిని మూర్ఛిత స్థితి నుండి తపోమార్గము ద్వారా తట్టిలేపి ప్రఖరముగాను మరియు ప్రచండముగాను తయారుచేయవచ్చును, యోగవిద్య లేకుండా ఆత్మను పరమాత్మతో ఏకీకృతము చేయలేము. ఈశ్వరుని సమర్థన, సహయోగము ప్రాప్తించనంతవరకు మహామానవుల, ఋషుల భూమికలోనికి ప్రవేశించుట కష్టమైన కార్యము. యోగసాధనల ద్వారానే ఆత్మను, దేవాత్మగా మలచుకుంటూ, దానిని పరమాత్మ స్థాయికి చేర్చగలము. ఇందువలన తపోసాధన అనే పరమ పురుషార్థమును కూడా చేయవలసి ఉంటుంది. శ్రేయార్థి తాపసిక జీవితరీతిని, నీతిని అనుసరించవలసి ఉంటుంది. బ్రహ్మతేజస్సు దానిలోనుండే కాంతులీనుతుంది. ఈ అపూర్వ బలము, సమర్థత ఆధారముగా మనిషి తన జీవననౌకను నిర్ధారించుకున్న లక్ష్యమునకు చేరుస్తాడు. అంతేగాక తనతోపాటు అందులో కూర్చున్న అనేకమందిని కూడా తీరమునకు చేర్చగలడు.

బ్రహ్మవిద్యద్వారా ఉపలబ్ధులను పొందుట, యోగాభ్యాస

**ఎయిడ్స్ ప్రాణాంతకమైన వ్యాధి, అంతకన్నా ప్రాణాంతకమైనది నిరాదరణ**

పరమైన తపశ్చర్యలే కాకుండా పరమార్థజీవనపు మూడవ అడుగు-సేవాసాధన! 'ధనవంతులు-మాన్యులు' ఈ భౌతికసేవా సాధనను చేయగలరు. కానీ జనమానసములలో ఉత్కృష్టతా బీజములను నాటి, అంకురింపజేసి, వృద్ధిచేయుట అన్నది కేవలము బ్రహ్మపరాయణులైన మహోన్నతులకే సంభవమౌతుంది. వాచాలుడు ఆ పనిని పూర్తిచెయ్యలేడు. పరమార్థ ప్రయోజనములను సగము మాత్రమే పూర్తిచేసే ధర్మశాలలు, మందిరములు, సత్రములు, విద్యాలయములు, వైద్యశాలలు, ఉద్యోగశాలలు, వ్యాయామశాలలు వంటివాటిని ధనవంతులు, సంపన్నులే నిర్మించగలరు. వారి ధనము కూడా ఇటువంటి కార్యములలోనే సదుపయోగమౌతుంది. అయితే జనుల మనస్సులలో ఉచ్చస్తరీయ భావనలను, ప్రవృత్తులను నాటి, వృద్ధిచేయుట అన్నది కేవలము ఉచ్చకోటికి చెందిన పరమార్థపరాయణులైన వ్యక్తులకే చెల్లుతుంది. ధనవంతులైన ప్రచారకులు లోకరంజనము అనే పనిని పూర్తిచేయ గలరు. వారు చేసే ప్రయత్నములు వినేవారి కుతూహలమును తృప్తిపరచగలవు. అయితే ఎవరినైనా మార్చుట అన్నది వారికి శక్యము కాని పని. **తనను తాను మార్చుకోనివాడు, ఇతరులను ఎలా మారుస్తాడు?** వక్తల, ప్రచారకుల సైన్యము ప్రతి సంస్థ ద్వారాను పూరింపబడుతుంది కానీ వాటిలో ప్రచారము, ధనోపార్జన తప్ప మరే లాభము ఉండదు. తమను తాము పరివర్తింపజేసుకుని, ఉచ్చశిఖరాలను అందుకొన్న మేరునగధీరులే ఉన్నతికి చేర్చుటకు, మార్పుతెచ్చుటకు సమర్థులు! ఈ మహోన్నత సమాజ సేవాసాధనను జ్ఞానవృద్ధులు, తపస్వులు, సేవా పరాయణులు, వానప్రస్థులు, సమయదానమిచ్చినవారే సంపూర్ణముగా నిర్వహించగలరు. అంతేకాదు, వారే ఆ పనిని చెయ్యవలసి ఉన్నది.

ఆటపాటలతో గడిచిన చిన్ననాటి స్మృతులు మళ్ళీ మళ్ళీ మనసు తలుపు తడుతుంటాయి. ఈ ఆనందము తనదైన రీతిలో అపూర్వము, అద్భుతము అయినది. యౌవనావస్థలోని మదోన్మత్తత సైతము తనదైన రీతిలో అద్భుతమైనదే. ధనోపార్జన చేసిన గౌరవము, దాంపత్యజీవితపు రహస్య ఆకర్షణల పోటు, తండ్రి అయ్యానన్న గర్వము, పరిపుష్టిగా ఉన్న శరీరపు సాహసికత, లెక్కకు మిక్కిలిగా చేసిన పురుషార్థముల శ్రేయస్సు-సన్మానము వంటి అగణిత ఉపలబ్ధులు యౌవనకాలములోనే హస్తగత మవుతాయి. యౌవనపు మైకం ఎలా ఉంటుందంటే అప్పుడు కాలునేలమీద నిలువదు, గగనాకాశములో విహరిస్తుంది. రెక్కలు లేకుండానే ఆకాశములో ఎగురుతుంది. కల్పనలు, కామనలు, ఆకాంక్షల దట్టమైన మేఘమాలికలు బారులు తీరి మస్తిష్కమనే అంతరిక్షములో ప్రతిక్షణము శ్రావణమాసపు ఆహ్లాదకరమైన తొలకరి చిరుజల్లులను వర్షింపజేస్తూ, సరసత (మాధుర్యము)ను పెంచుతూ నలుదిశల నుండి కమ్ముకుంటాయి. యౌవన కాలపు రోజులు అంత అందమైనవి. వృద్ధాప్యము వాటిని గుర్తుచేసుకుంటు న్నప్పుడు రేయింబవళ్ళు బాధతో కళ్ళ నుండి అశ్రువులు స్రవిస్తుంటాయి. ముసలితనము మీదపడిన స్థితిలో మనిషి ఎంతో అంతర్వ్యధను అనుభవిస్తాడు. ఈ తథ్యమును చూసినప్పుడు 'యౌవనకాలపు రోజులు ఎంత అమూల్యమైనవి, మహత్త్వ పూర్ణమైనవి' అన్న విషయమును సహజముగానే తెలుసుకుని, అర్థము చేసుకొనగలము. భౌతిక ఉపలబ్ధులు, మాధుర్యము యౌవనకాలములో ఎంత తీవ్రమైన కోరికలను ఉత్పన్నము చేస్తాయంటే దానితో మనిషి మదాంధుడై మత్తులో జోగుతుంటాడు.

భౌతిక జీవన మాధుర్యము జీవితపు పూర్వార్థములో తన పూర్ణాహుతిని పూర్తిచేసుకుంటుంది. ప్రాపంచిక దృష్టితో చూసినప్పుడు ఉత్తరార్థము రోగములు, పీడ, అసమర్థత, అవమానము, ఉపేక్షకు గురిఅయ్యే కాలము. జ్ఞానేంద్రియముల పటుత్వము తగ్గుతుంది. కర్మేంద్రియములు శిథిలావస్థకు చేరుకుంటాయి. అనుపయోగమైన, భారభరితమైన, పనిలేని, ఉపేక్షించబడిన, అవహేళనకు గురైన జీవితమును నెట్టుకు రావడము కష్టమౌతుంది. ఒక్కొక్కరోజు భారముగా గడుస్తుంది. గడచిన రోజులు గుర్తుకొచ్చి, అవి ముళ్ళవలె, తేలుకొండివలె గ్రుచ్చుకుంటాయి. చిర్రుబుర్రులాడటము పెరుగుతుంది, స్వభావములో విసుగు, కోపము రెట్టింపు అవుతాయి.

భౌతికదృష్టితో చూసినప్పుడు జీవితపు ఉత్తరార్థము తనకు తాను కష్టకారకమైనది, కుటుంబానికి మెల్లమెల్లగా మోయలేని బరువుగా పరిణమిస్తూ ఉంటుంది. 'భగవంతుడా! నాకు మరణమును ప్రసాదించు!' అని వేడుకునే రోజులు సమీపిస్తాయి. పరివారసభ్యులు కూడా మనస్సు లోలోపల ఇదే కోరుకుంటూ ఉంటారు, ఈశ్వరుడిని ప్రార్థిస్తూ ఉంటారు. ఈ హేయమైన పరిస్థితిరాక మునుపే, **సమయము ఉండగానే జాగృతిచెందాలి, ఆధ్యాత్మిక భూమికలోకి ప్రవేశించి తన కార్యక్రమాలను వానప్రస్థ స్థాయికి పెంచుకున్నచో, నూతనజన్మ లభించినట్లు అనుభవమవు తుంది. అలా చేయుట వలన పూర్వార్థము ఎంత ఆనందమయ మైనదో, మహాగొప్పదో, ఉత్తరార్థము దానికంటే కూడా వేలాది రెట్లుగా అధిక ప్రసన్నతను, మాధుర్యమును ప్రసాదించే సంజీవనీ మూలికగా చేతికందుతుంది!** దూరదృష్టి గల ఋషులు, మనీషులు ఈ దృష్టితోనే వానప్రస్థం యొక్క విధివ్యవస్థను రూపొందించారు. దానికి సాంస్కృతిక జీవన ప్రక్రియలో అత్యంత ఉన్నత స్థానమును కల్పించారు.

*- అఖండజ్యోతి, జులై 1973*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలంటే మంచి స్నేహితులు, మంచి పుస్తకాలు అవసరం**

## పూజ్య గురుదేవుల అమృతవాణి

# గాయత్రియే కామధేనువు - 3

**(గత సంచిక తరువాయి...)**

**గత సంచికలో పూజ్యగురుదేవులు తమ ప్రబోధముల ద్వారా 'గాయత్రియే కామధేనువు. ఆమె యొక్క అనుగ్రహ-ఆశీస్సుల వల్లనే మానవ జీవితములో ఎన్నో అద్భుతములు జరుగుతుంటాయి, మనము వాటినే ప్రత్యేకమైన దైవీసంఘటనలుగా చెప్పుకుంటూ ఉంటాము' అని స్పష్టంగా చెప్పిన విషయమును మనము చదువుకున్నాము. అయితే ఈ అనుగ్రహమును పొందటానికి మనము మన జీవితములను సంస్కరించుకొని పవిత్రం, స్వచ్ఛము గావించుకొనటం తప్పనిసరి. భగవంతుడిని చేరటానికి కేవలము శ్రద్ధ (విశ్వాసము) ఒక్కటే మార్గము అని పూజ్యగురుదేవులు తెలియజేస్తున్నారు. ఆ విశ్వాసమే ఏకలవ్యుడు, మీరా, శ్రీరామకృష్ణపరమహంస మున్నగువారు అర్చించిన రాతి ప్రతిమలలో భగవంతుడిని ఉత్పన్నము చేగలిగినది, ఆ శ్రద్ధయే మన జీవితములకు శ్రేష్ఠత్వమును సమకూర్చగలదు.' భగవంతుడిని మోసం చేయలేము, మురిపించలేము. ఆత్మశోధన, సంస్కరణల ద్వారా మాత్రమే ఆయన కృపను పొందగలము, దీని పేరు ఆధ్యాత్మికత' అని యుగఋషి పూజ్యగురుదేవులు ఘంటాపదముగా చెప్తున్నారు. పూజ్యగురుదేవుల అమృతవాణిని మరింత హృదయంగమము చేసుకుందాము రండి!**

### భగవంతుడి అనుగ్రహము ఎలా లభిస్తుంది?



మనము మన జీవితములను సంస్కరించుకొనకుండా, దేవీ దేవతలను వశము చేసుకొనవలెనంటే అది సాధ్యమయ్యే పనికాదు. మొదట మీరు ఆత్మపరిశోధన గావించుకొని, మిమ్మల్ని మీరు సంపూర్ణముగా ప్రక్షాళన చేసుకోండి. ఇక గమనించండి భగవంతుని దయ, అనుగ్రహము వాటంతట అవే మీపైన వర్షిస్తాయి. మేఘములు వర్షించేటప్పుడు మనము ఇంటిలో పెద్ద గుంటని తయారుచేసుకుంటే అందులో నీరు నిలుస్తుంది. పొలములపై వర్షము కురుస్తుంది, కొండలపైనుండే పెద్ద పెద్ద బండరాళ్ళమీద కూడా వర్షము కురుస్తుంది. అయితే పొలములోని మట్టి మెత్తగా ఉండటముచేత నీటిని పీల్చుకుని సారవంతమవుతుంది. బండలమీద పడిన వర్షపునీరు వ్యర్థముగా జారిపోతుంది.

అదేవిధముగా మీ మనస్సు, జీవన విధానం రాతిబండవలె ఉంటే, దైవీ అనుగ్రహమును పొందటానికి మీరు అర్హులు కాలేరు. మనిషి ఎంతటి దుష్టుడు, దురాచారుడు, పాపి అయినప్పటికీ కూడా, తనని తాను సంస్కరించుకొని, భగవంతుడిని శరణువేడితే అతడు రక్షింపబడతాడు. వేశ్యయైన ఆమ్రపాలి, రామనామమును స్వీకరించిన పిదప నృత్యగానములను, వేశ్యావృత్తిని వదిలి సన్యాసినియై మోక్షమును పొందినది. అదేవిధముగా సూరదాసు, తులసీదాసు, అంగులీమాలుడు, వాల్మీకివంటి మహనీయుల జీవితములను గమనిస్తే, పూర్వ జీవితములో వారెంతటి దురాచారులైనప్పటికీ, ఆత్మశోధన గావించుకొని భగవంతుడిని ఆశ్రయించిన పిదప వారి జీవితములలో ఎంతటి అద్భుతమైన మార్పు వచ్చిందో మనము అర్థము చేసుకొనవచ్చు.

### ఆధ్యాత్మికత లాభసాటి వ్యాపారము

పూజామందిరములో బ్రహ్మజ్ఞానిగా తయారవటానికి, ఋషిగా మారటానికి ఒక గంటసేపు యోగాభ్యాసం, ధ్యానం, పూజ మొదలైనవానిని ఆచరించి, బయటకు వచ్చిన పిదప అసలైన రావణునిగా మారి దుష్కర్మలన్నింటినీ యథాప్రకారము కొనసాగిస్తూ ఉంటే అది మిమ్మల్ని మీరు మోసగించుకొనటమే అవుతుంది. జీవితములో ఒక గంట మాత్రమే దైవధ్యానం, మిగిలిన 23 గంటలు దుష్కర్మభరితం అయితే అంతకన్నా హీనమైన పని మరియొకటి ఉండదు. మిమ్మల్ని మీరు మోసగించుకునే హక్కు మీకెప్పుడూ ఉన్నది. సర్వసమర్థుడైన భగవంతుడిని మీరు మోసగించలేరు' అని గుర్తుంచుకోండి.

**చేసిన తప్పులను ఒప్పుకోవడానికి సిగ్గుపడవలసిన అవసరం లేదు**

ప్రపంచములో ఎన్నిరకాల వ్యాపారములు, వ్యవహారములు, ఉద్యోగములు ఉన్నాయో వాటన్నింటిలోను ఆధ్యాత్మికత ఒక్కటే అత్యధికముగా లాభదాయకమైనది. దీనిని మించిన వ్యాపారమే లేదు, మేము దీనితో వ్యాపారము చేసి ఎంతో సంపన్నులమైనాము, మాతో సమానమైన లాభమును మరెవ్వరు పొందలేకపోయారు. మా పరిచయస్తులు, దాయాదులు, బంధువులు అందరు మమ్మల్ని భయపట్టారు. దీనివల్ల మీకు చాలా బాధలు కలుగుతాయి, చేసిన పనికి తలపట్టుకు రోదించవలసివస్తుందని హెచ్చరించారు. అలా మాట్లాడినవారు ఇప్పుడు మమ్మల్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. మాకు లభించిన అంతులేని ఆధ్యాత్మిక సంపదను చూసి నివ్వెర పోతున్నారు. ఇది ఎలా సాధ్యమైనది? మేము చేపట్టినది అసలైన ఆధ్యాత్మికత కాబట్టి. ఇంత గొప్ప ఫలితము లభించినది. శ్రద్ధ, ప్రజ్ఞ, నిష్ఠ, ఉదార హృదయము కలిగి ఉండటమే ఆధ్యాత్మికతకు నిదర్శనము.

## ఇతరులకోసము ఉదారముగాను, మీ పట్ల కఠనముగాను ఉండండి!

మాయొక్క వ్యక్తిగత జీవితమును చాకలి బట్టను ఉతికినట్లు ఉతికాము. దూదేకులవాడు దూదిని ఏకినట్లు ఏకివేశాము. ఇతరులపట్ల మేము ఎంతో ఉదారముగా ఉంటాము. మాపట్ల మేము కఠినాతి కఠినముగా వ్యవహరిస్తాము. తప్పు కనిపిస్తే ప్రాణమునైనా పణముగాపెట్టి దానిని సరిచేసుకొనటానికి ప్రయత్నిస్తాము.

చక్కగా ఉతకబడిన వస్త్రములు ధవళకాంతులీనుతూ ఎంతో పరిశుభ్రముగా మెరుస్తూ బాగుంటాయి. అలాంటి వస్త్రములు ధరించి మీరు బయట ప్రపంచములోకి వెడితే మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. అదే రంగువస్త్రములు ధరిస్తే ఇక చెప్పేదేముంది? 'మేము మిమ్మల్ని చక్కగా ఏకి ఉంచాము. ఏకడమంటే మీ వ్యక్తిత్వమును తీర్చిదిద్దటము. వ్యక్తిత్వము అంటే బ్రాహ్మణత్వమును పొంది ఉండటము. మంచి వ్యక్తిత్వము లేకపోతే మీరు జపించిన మంత్రము సార్థకము కాదు. మీ హృదయములో ఉదారత్వమనేది లేకపోగా మీరు స్వార్థపూరితులు, కపటులు, దురాశాపరులు అయినట్లయితే ఆధ్యాత్మికత మీ చెంతకురాదు. మీ మంత్రజపము సార్థకతను పొందదు' అని గుర్తుచేసుకోండి.

దశరథమహారాజు పుత్రకామేష్ఠి చేయటానికి 'శృంగి' మహర్షిని ఆహ్వానించాడు. శృంగిఋషి వాక్కుద్వారా వెలువడే మంత్రము, అద్భుతముగా జరిగి తీరుతుంది. కాబట్టే ఋషి 'పుత్ర యజ్ఞశ్చ' అనే మంత్రమును ఉచ్చరించగానే భగవంతుడు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల రూపములో దశరథునికి నలుగురు పుత్రులుగా అవతరించాడు. ఆయన వాక్కు అంత అద్భుతమైనది!

## సంస్కరించబడిన వ్యక్తిత్వమునకే మంత్రశక్తి లభిస్తుంది

మంత్రమును జపించే వ్యక్తి సరియైనవాడైతే, అతని వాక్కుకు శక్తి ఉంటుంది. జపించే వ్యక్తి వాక్కులో శక్తి ఎంత మాత్రం లేకపోతే, ఆ మంత్రము ఫలించదు. నవరాత్రి సమయములో దేవీ మాహాత్మ్యం, చండీపారాయణ, లక్ష్మీపారాయణ చేసే వ్యక్తులు కోకొల్లలుగా కనబడతారు. వారందరూ చేసే ప్రతి ఒక్క పారాయణ ఫలవంతమౌతుందా అంటే నూటికి నూరుపాళ్ళు అవుతుందని చెప్పలేము. ఎందుకంటే పారాయణ చేసే వ్యక్తి నియంత్రణ లేనివాడు, బ్రహ్మచర్యమును పాటించనివాడు, శక్తిహీనుడు అయితే అతనికి బ్రహ్మతేజస్సుకాని, వర్చస్సుకాని ఉండవు. ఫలితముగా అతని వాక్కుకు బలము కూడా చేకూరదు. మంత్రమనేది కేవలము నాలుకమీదనుండే పలుకకూడదు. మంత్రము ఆత్మ నుండి, ప్రాణము నుండి వెలువడుతుంది. ఆత్మ, ప్రాణము నుండి వెలువడిన మంత్రము వాక్కు ద్వారా ప్రకటీకృత మౌతుంది. నాలుక మీదనుండి వ్యాప్తిచెందుతుందేకాని, అక్కడి నుండి వెలువడదు. సంస్కారపూరితమైన, పవిత్రమైన ప్రాణము నుండి వెలువడే వాక్కు శక్తివంతమై, అద్భుతములను సృజించగలదు.

లోమశ మహర్షి తపస్సులో ధ్యానస్థుడై ఉండగా, అటుగా వచ్చిన పరీక్షిత్ మహారాజు ఆయన మెడలో చచ్చిపోయిన పామును వేసి వెళ్ళిపోయాడు. మహర్షి ఈ అవమానమును సహించి ఊరుకున్నారు. ఆయన కుమారుడైన శృంగి తండ్రికి చేసిన అవమానమునకు ఆగ్రహించి, 'ఈ చచ్చినపాము బ్రతికి బయటకు వెళ్ళి ఇది వేసిన వ్యక్తినే వారమురోజులలోపు కాటువెయ్యడము ద్వారా నా తండ్రిని అవమానించిన వ్యక్తి మరణించుగాక!' అని శపించాడు. ఋషివాక్కుకు జీవంతమైన పాము, సరసరా ప్రాకుతూ వెళ్ళిపోయి, సరిగ్గా ఒక వారములోపే పరీక్షిత్ మహారాజును కాటు వేసింది. ఇది సంభవమా అంటే, అవును మంత్రశక్తితో ఇది సంభవమే అని నిరూపించబడినది.

అయితే ఈ మంత్రశక్తి అనుభవముతోటి వచ్చే శక్తి కాదు. అక్షరముల శక్తి కాదు, వాక్కు యొక్క శక్తి కాదు. **మంత్రశక్తి మానవుని వ్యక్తిత్వము (శరీరము) ద్వారా ఉత్పన్నమయ్యే శక్తి.** తుపాకీలో పనిచేసే శక్తి – తుపాకీ గుండు. తుపాకీగుండులోని చిన్న పొరను పేల్చడము ద్వారా అందులో నిప్పు రగులుతుంది. గుండు బయటకు దూసుకుపోతుంది. గుండును నడిపించటానికి

**మనిషిని నడిపించేది ఆశ**

నిప్పు ఏ విధముగా అవసరమో, మంత్రము పనిచెయ్యటానికి ప్రాణము కూడా అదేవిధముగా అవసరము. ఆ ప్రాణమనేది మానవుని వ్యక్తిత్వము ద్వారా, ఉదాత్తమైన జీవనము ద్వారా నిర్మింపబడినదై ఉండాలి.

మంత్రమునకు సంబంధించి మరొక కథ ఇక్కడ మనము చదువుకోవాలి. లోమశ మహర్షి పరీక్షిత్ మహారాజుకు తన పుత్రుడు ఇచ్చిన శాపమును గురించి వివరిస్తూ ఒక సందేశ వాహకుడిని పంపారు. వారు సందేశవాహకునితో 'పరీక్షిత్ మహారాజు ఎంతో పుణ్యాత్ముడు. కానీ నా పుత్రుడు ఇచ్చిన శాపము వ్యర్థము కాదు. కాబట్టి ఆయన మరణించి తీరవలసి ఉన్నది. కనుక ఈ శేషసమయమును సదుపయోగము చేసుకొని, భాగవత పురాణ శ్రవణము చేయమని మహారాజుతో చెప్పండి' అని వచించారు. ఆ సందేశము యథాతథముగా పరీక్షిత్ మహారాజుకు అందించబడినది. భాగవతము వ్రాసినది వ్యాసుడు కాబట్టి ఆ గాథను ఆయన నోటినుండే వినడము మంచిదని, వ్యాసులవారిని పిలిపిస్తే బాగుంటుందని పండితులు సలహా ఇచ్చినప్పుడు మహారాజు వ్యాసులవారిని కాక, ఆయన పుత్రుడైన శుకదేవులను రమ్మని వర్తమానము పంపారు. ఇది విని ప్రజలు ఆశ్చర్య చకితులైనారు. 'భాగవత కథామృతమును రచించిన మహా పండితుడైన వేద వ్యాసుల ద్వారా చెప్పబడిన భాగవత గాథ తనని రక్షించలేదని, కేవలము ఇరువది సంవత్సరముల యువకుడైన శుకదేవుని వాణి తనను ఉద్ధరించగలదని మహారాజు భావించడంలో గల ఆంతర్యమేమిటి?' అని విస్మయము చెందారు.

పరీక్షిత్ మహారాజు దీనికి జవాబుగా ఒక కథను ప్రజలకు వినిపించారు. ఒకసారి వ్యాసులవారు చెరువుకు వచ్చి స్నానాదికములు చేయనారంభించారు. అప్పటికే అక్కడికి వచ్చి చెరువులోకి దిగి ఉన్న కొందరు యువతులు వ్యాసులవారిని చూసి, బయటకు వచ్చి వస్త్రములు ధరించి, చెట్టుమాటుకు తప్పుకున్నారు. వ్యాసులవారు వెళ్ళిపోయిన పిదప శుకదేవులు వచ్చారు. వారు పరమహంస! 22 సంవత్సరముల వయసుకలిగి నగ్నముగా సంచరించేవారు. వస్త్రములేకాదు, కౌపీనము కూడా ధరించేవారు కాదు. వారు చెరువులో దిగి స్నానాదికాలు ప్రారంభించగానే, చెట్టుమాటున దాగిన యువతులు కూడా వచ్చి స్నానమాచరిస్తూ క్రీడాకలాపములు చేయసాగారు. వారికి ఏవిధమైన అభ్యంతరము అనిపించలేదు. మహారాజు వెనుకగా నిలబడి ఈ రెండు సంఘటనలను వీక్షించారు. ఆ యువతులను పిలిచి వృద్ధుడైన వ్యాసుని చూసి పారిపోవటానికి, యుక్తవయస్కుడై నగ్నముగా ఉన్న శుకదేవుని చూసి సంకోచించకపోవటానికి కారణమేమిటని ప్రశ్నించారు.

వీరిద్దరి మధ్యా ఎంతో అంతరమున్నది. అది మీకు తెలియని విషయము. వ్యాసులవారు తమ సోదరుల భార్యల ద్వారా సంతానమును పొందారు. శుకదేవులు పరమహంస! వారికి స్త్రీ-పురుష భేదము తెలియదు. అందుచేత మేము నిస్సంకోచముగా వారి ముందు సంచరించగలుగుతున్నాము' అని యువతులు ప్రత్యుత్తరమిచ్చారు.

కాబట్టి వాక్కుతోపాటు ఉదాత్తమైన వ్యక్తిత్వము కలిగి ఉండటము కూడా ఎంతో అవసరము. ఉదాత్తమైన జీవితం, ఉన్నతమైన వ్యక్తిత్వం. ఈ రెండింటినీ మిళితము చేయలేకపోతే, ఇది కేవలము కర్మకాండ, బొమ్మలాట, మనస్సును మభ్య పెట్టుకొనడము, శరీరమును మభ్యపెట్టుకొనటముగా మాత్రమే మిగిలిపోతుంది. దేవతలను మురిపించటానికి చేసే ప్రయత్నమిది. దీనివలన మనకు లభించేదేమీ ఉండదు.

*- అఖండజ్యోతి, డిసెంబరు 2012*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## డా॥ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

*డా॥ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బెంగాలులో ప్రతిష్ఠావంతుడైన వకీలు. ఈయన ఇంగ్లండులో బారిష్టరీ పాసయి తిరిగి వచ్చినపుడు, ధనార్జన చేసి ఆ ధనంతో తమను ఉద్ధరిస్తాడని కుటుంబ సభ్యులందరు ఆశించారు. కాని కుటుంబం గడవటానికి కావలసిన ఏర్పాట్లు ఎప్పటి నుండో జరుగుతూనే ఉండటం వల్ల జీవించటానికి అవి చాలునని భావించి, వీరు కుటుంబ సభ్యుల వైపు కన్నెత్తి అయినా చూడక, కాలం యొక్క అవసరాన్ని గుర్తించి దేశసేవలో నిమగ్నమయ్యారు. బెంగాలులో దుర్భిక్షం సంభవించినప్పుడు ఈ మహామానవుడు చేసిన సేవ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. వీరు కేంద్ర ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు పనిలేని వారికి పని కల్పించడానికి రూపొందించిన క్రొత్త పథకాలు అందరిని ఆశ్చర్యచకితుల్ని చేశాయి. ప్రభుత్వంతో అభిప్రాయ భేదాలు వచ్చినా కూడా జన సంఘాల్ని స్థాపించి ఆ రోజుల్లోని పలు విధాలయిన చిక్కు సమస్యల్ని పరిష్కరించడంలో వీరు అసాధారణమైన కృషి చేశారు. ఇటువంటి నవరత్నాలే భారతమాత జన్మనిచ్చిన అసలయిన సంతానం అని చెప్పక తప్పదు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**ఏ కళ అయినా స్వాంతానికి కాదు**

నా వారితో నా మాట

# సామూహిక గాయత్రీ సాధన

పరమపూజ్య గురుదేవులు ఈశ్వరీయ ప్రణాళికలో భాగంగా అవతరించారు. తమకంటూ ఎటువంటి వ్యక్తిగత ప్రణాళికలు తీసుకురాలేదు. ఈశ్వరుని ప్రతినిధిగా వారి సందేశాన్ని తీసుకొచ్చారు. వారు ఆశ్వయుజ కృష్ణ త్రయోదశినాడు (20 సెప్టెంబరు 1911) న అవతరించారు. మహాపురుషుల జన్మ, కర్మలన్నీ దివ్యంగా ఉంటాయి, కాబట్టి తిథులలో వారిని బంధించ లేము. విస్తారమైన, విరాట్ బహుముఖ జీవనాన్ని గడపడానికి వచ్చి గాయత్రీ మహావిద్య మనందరికీ నేర్పించడానికి వచ్చారు. జీవితాంతం (2 జూన్, 1990, గాయత్రీ జయంతి వరకు) వారు తమ జీవితం ద్వారా అందరికీ ఇదే బోధిస్తూ వచ్చారు.

వారి జీవితంలో ధర్మం, సంస్కృతి, సమాజం, మానవత, రాష్ట్రీయతల భావం సంపూర్ణంగా అల్లుకుపోయినట్టు కనిపిస్తుంది. వారి వ్యక్తిత్వాన్ని, కర్తృత్వాన్ని అధ్యయనం చేసిన వారికి ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ధర్మం ఎన్నో ఖండాలుగా విడిపోయిన కాలంలో గురుదేవులు అవతరించారు. సంస్కృతి, సమాజాలు వికృత రూపం దాల్చిన సమయమది. శ్రీరామకృష్ణ పరమహంస అవతరించి స్వామి వివేకానంద ద్వారా 40 ఏళ్ళు శ్రమపడ్డా కూడా 20వ శతాబ్దంలోని ప్రథమ దశాబ్దిలో కూడా ఒక సంక్రమణ కాలంగుండా ప్రయాణించవలసి వచ్చింది. అటువంటి సమయంలో పరమపూజ్య గురుదేవులు అవతరించారు. పరమేశ్వరుడు వారిలో సనాతన ధర్మతత్త్వాన్ని ఇమిడ్చి భూమి పైకి పంపారు. అందుకు ప్రతీకగానే గాయత్రి అవతరించింది. వారి రాకకు ముందు గాయత్రి లేదని కాదు. ఉన్నా, అందరికీ అందుబాటులో ఉండేది కాదు. సనాతన ధర్మానికి శాశ్వత స్వరూపం గాయత్రీ మహావిద్య, ఇది వారి ద్వారానే అందరికీ తెలియచేయబడింది. అనేక రకాలుగా తప్పుదోవ పట్టినప్పుడు శాశ్వతమైన ధర్మ స్వరూపం చేజారిపోతుంది. సనాతన ధర్మానికి శాశ్వత, సమగ్ర వ్యాఖ్య ద్వారా పరమపూజ్య గురుదేవులు గాయత్రిని ఆమూలాగ్రం స్పృశించారు. గాయత్రిని వేదమాత అన్నారు. వేదాలు పరమాత్మ యొక్క నిశ్వాసలు, ప్రతీకలు. అవి అపౌరుషేయాలు. సృష్టి లాగానే గాయత్రి కూడా పురాతనమైనది, సనాతనమైనది, గొప్పది. అందుకే వారు స్వయంగా దీర్ఘకాలం గాయత్రీ సాధన చేసారు. ఆ సాధన సంగ్రామం వల్లనే గాయత్రీ పరివారం ఏర్పడింది.

## గాయత్రీ మంత్రం ఆధారభూతమైనది

పరమపూజ్య గురుదేవులు ఎన్నో చోట్ల వ్రాసారు - "కాలాను గుణంగా పెరిగే మొక్కలు తొందరగా నాటుకుంటాయి, ఎక్కడ పడితే అక్కడ పెరుగుతాయి. కాని శతాబ్దాల కొద్దీ పెరిగే వృక్షాలైతే, చాలాకాలం శ్రమతో, సేద్యం చేసి, బాగోగులు చూసుకుంటేనే పెరుగుతాయి. కొన్ని సాధనలు బంతిపూలు నాటటం లాంటివి. కాని గాయత్రీ సాధన స్వరూపాన్ని అర్థం చేసుకోవడమంటే వట వృక్షాన్ని పెంచడమే. మన వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకుని, ఇతరులను మనలా తయారు చేయడానికి గొప్ప సాధనాత్మక శ్రమ అవసరం. గాయత్రీ మంత్రం వల్లనే ఇది సాధ్యం." ఈ విషయాన్ని ప్రతి మనిషికి తెలియచేసారు, వారి మనసులలో స్థాపించారు, జీవితాంతం ఈ ఉద్దేశంతోనే గడిపారు. గాయత్రీ మంత్రాన్ని త్రిపద అన్నారు అంటే మూడు చరణాలు కలిగింది. అది అమృతం, పరసువేది, కల్పవృక్షం. దీని వల్ల శ్రద్ధ, ప్రజ్ఞ, నిష్ఠ జాగృతమవుతాయి. ఎప్పుడు? ఈ మూడు చరణాలను అర్థం చేసుకున్నప్పుడు. మంత్రాన్ని వల్లె వేయడం, నాలుకతో పైపై ఉచ్చారణ వల్ల గాయత్రీ మహాశక్తి కృపను పొందడం కుదరదు. దాన్ని సమగ్రంగా అర్థం చేసుకుని జీవితంలో ఆకళింపు చేసుకోవాలి.

## మొదటి చరణం

మొదటి చరణం 'తత్సవితుర్వరేణ్యం'. అంటే శ్రేష్ఠత్వాన్ని వరించడం. మన చుట్టుపక్కల ఎన్నో విషయాలను ఎంచు కోవచ్చు, కాని శ్రేష్ఠత్వాన్నే వరించాలి. ఇది నీర-క్షీర (నీరు-పాలు) వివేకంపై ఆధారపడి ఉంటుంది. మన ఎంపికను బట్టే వ్యక్తిత్వం తయారవుతుంది. వివేకం ఉంటేనే శ్రేష్ఠమైనదానిని ఎన్నుకుంటాం. పొరపాటున కూడా నికృష్టమైన వాటి జోలికి పోము. ఈ మర్మాన్ని అర్థం చేసుకున్నప్పుడే సర్వతోముఖంగా గాయత్రి వల్ల లాభం పొందగలం. అర్థం చేసుకోవడమే కాదు, జీవనశైలిలో, సంబంధ బాంధవ్యాల వ్యవహారాలలో శ్రేష్ఠత్వం అలవర్చుకోవాలి. అప్పుడే గాయత్రీసాధనా క్షేత్రంలో మొదటి అడుగు ముందుకు వేయగలం.

పరమపూజ్య గురుదేవులకు ఎన్నో అవకాశాలు వచ్చాయి, జమీందారులకు వారసుడు. తలుచుకుంటే రాజకీయాలలోకి కూడా వెళ్ళగలరు. వేలఎకరాల పంట పొలం ఉండేది. ప్రతిష్ఠాత్మక

**అందరు మన వారే అనే భావనే సత్యయుగానికి పునాది**

పదవుల్ని చేపట్టే ఎన్నో అవకాశాలున్నా ఈశ్వరుని ఉత్కృష్టతతో చేయి కలపడానికే నిశ్చయించుకున్నారు. 'నా దగ్గరున్న సందేశాన్ని అందివ్వడానికే వచ్చాను, నా గురువు యొక్క సందేశవాహకునిగా వచ్చాను. మీరు కూడా నిర్భయ జీవితాన్ని గడపండి, ఆత్మలో దాగి ఉన్న దైవత్వాన్ని మేల్కొల్పండి' అన్నారు స్వామి వివేకానంద. పరమపూజ్య గురుదేవుల కూడా ఇటువంటి గొప్ప ఉద్దేశంతో వచ్చినవారే. మీకొకటి నేర్పించాలనుకుంటున్నాను అంటూ వచ్చారు. గాయత్రీ మంత్రాన్ని మీ జీవన విధానాల్లోకి నింపాలను కుంటున్నాను. మనలను చుట్టుముట్టిన విపత్తులకు కారణం మనమే. మన సుఖదుఃఖాలకు కారణం మన భాగ్యం కాదు, మనం ఎంచుకున్న వాటి పరిణామమే. కాబట్టి శ్రేష్ఠత్వాన్నే ఎంచుకోవాలి.

## రెండవ చరణం

శ్రేష్ఠత్వం తరువాతి చరణం – "భర్గో దేవస్య ధీమహి". తేజస్సును ధరించండి. ఇదంత సులువైంది కాదు. సూర్య తేజస్సును ధరించడానికి ముందు ఎన్నో రకాలుగా సిద్ధమవ్వాలి, జీవిత సాధన పూర్తవ్వాలి. శ్రీరామకృష్ణ పరమహంస శరీరాన్ని వదిలేటప్పుడు (1836)లో జనవరి ఒకటవ తారీకున తమ చుట్టుపక్కలున్న శిష్యులందరి కోరికలు తీర్చారు. నా కాలం సమీపించిందన్నారు. ఎవరిని నిరాశపరచలేదు. అందరికీ ఏదో ఒకటి లభించింది. సిద్ధులు జాగృతమయ్యాయి. ఒక వ్యక్తి బైటనుండి వచ్చాడు. అతనిని కూడా కృతార్థుడిని చేయాలని గట్టిగా పట్టుబట్టాడు. నువ్వింకా సిద్ధంగా లేవు, నీకివ్వలేను, అన్నారు ఆయన. బాగా మొండికెక్కడంతో అతని శరీరాన్ని తాకారు. అంతే, శరీరం స్తంభించినట్లయి నోట్లోంచి నురుగు వచ్చింది. రామకృష్ణ పరమహంస తమ శక్తిని వాపసు తీసుకున్నారు. అతను సామాన్య స్థితికి తిరిగొచ్చాడు. నీకిది సరైన సమయం కాదు, మున్ముందు అవకాశం వస్తుంది అన్నారు. నేటికీ ఆ రోజును 'కల్పతరువు దినోత్సవం' గా రామకృష్ణమిషన్ వారు జరుపుకుంటారు. పరమ పూజ్య గురుదేవులు కూడా ఇదే చేసారు. మొదటి చరణాన్ని ధరించిన వారు, సత్కర్మలతో, సదాలోచనలతో జీవించిన వారు మాత్రమే తేజస్సును ధరించగలరు. నిలకడగా, సమూలంగా గాయత్రీ సాధన చేస్తేనే పాత్రత లభిస్తుంది. వారి జీవితం విశాల వృక్షంలా అందరికీ కనిపిస్తుంది. మనము అలా మారాలి.

## మూడవ చరణం

పై రెండు చరణాలను జీవితంలో దింపుకున్నాకనే అందరితో కలిసి ప్రకాశ మార్గంలో నడవాలనే ప్రేరణ కలుగుతుంది – "ధియోయోనః ప్రచోదయాత్". సామూహికంగా ప్రయాణించడం. సాధన ద్వారా లభించిన ఫలాన్ని అందరికీ పంచడమే మన జీవిత లక్ష్యం కావాలి. పరమపూజ్య గురుదేవులు ఎంతో సాహిత్యం రచించారు, ఎన్నో విషయాలు చెప్పారు, లెక్కలేనంత మందిని పతనం కాకుండా రక్షించారు, వారికి జీవనదిశను చూపించారు. ఇప్పుడు ఈ పని గాయత్రీ సాధకులందరూ చేయాలి. సామూహిక సాధన – అందరికీ ఉజ్జ్వల భవిష్యత్తు కలగాలని చేసే ప్రార్థన.

1940 మొదట్లో ప్రచురించిన అఖండజ్యోతిలో ఇలా వ్రాసారు, "అఖండజ్యోతి ఒక పత్రికైతే, నా కోరికకు ప్రతి రూపమైతే ఇది ఎప్పుడో అప్పుడు ఆగిపోతుంది. మా గురువుగారి చెప్పిన విధానంలో ఇది ఈశ్వరునికి మాధ్యమంగా ఉన్నంతవరకు, భగవంతుడే అన్ని వనరులు సమకూరుస్తూ ఈ కుటుంబాన్ని పెద్దగా, మరింత పెద్దగా విస్తరింపజేస్తూనే ఉంటాడు." అదే జరిగింది. అఖండజ్యోతి కుటుంబం పెరిగి పెరిగి ఇప్పుడు ప్రపంచంలోని ప్రతి ఒక్కరి కంటికీ కనిపించేంత పెద్దగా విస్తరించింది. నేను నా దైవం చేతిలో మురళిని అన్నారు. తమని తాము సత్పాత్రులుగా తీర్చి దిద్దుకున్నారు, అహంకార చిక్కు ముళ్ళు విడదీసుకుంటే స్వరాలు పలికాయి. ఈ విశాల విస్తృతికి మూలమర్మం ఇదే.

## యుగశక్తి గాయత్రి

మొదటి నుండే పరమపూజ్య గురుదేవులు గాయత్రిని యుగశక్తిని చేయాలంటుండేవారు. నా దగ్గరొక టెలిస్కోపుంది, మానవ జాతి విశ్వవ్యాపక ఉజ్జ్వల భవిష్యత్తు కనిపిస్తోంది. గతంలోకి తొంగి చూడగలిగితే, వారి సాధన, సమష్టిగత సాధన, పురుషార్థం వల్లనే లెక్కలేనన్ని ఆపదలు తొలిగిపోయాయి, ప్రపంచ యుద్ధం సైతం ఆగిపోయింది. స్టార్ వార్ అనే మహావిపత్తు నుండి బైటపడ్డాం. నేటికీ సంక్షోభాలు చాలా ఉన్నాయి. పరోక్ష జగత్తు బాగా దూషితమైపోయింది. స్వచ్ఛంద యౌనాచారం, యుద్ధోన్మాదం నుండి అపరాధ మనోవృత్తి, అవినీతి, రాజకీయాలు, క్షేత్రీయవాదం, జాతివాదం నలువైపులా కమ్ముకుంది. పర్యావరణానికి ముప్పు పరాకాష్టకు చేరుకుంది. అందరికీ ఇప్పుడు డబ్బు సంపాదించాలని, ఎట్టి పరిస్థితుల్లోనైనా ఐశ్వర్యవంతులవ్వాలనే కోరిక నెత్తికెక్కింది. దానికోసం ప్రకృతి వనరులన్నిటినీ కొల్లగొట్టడం, అడవులు నరకడం, పట్టణాలకు వలసపోవడం, పారిశ్రామికీకరణ అనే వెర్రి నలువైపులా అలుముకుంది. నీళ్ళ కొరత కనిపిస్తూనే ఉన్నది. గంగ దూషితమైపోయింది. దేశంలోని నదులన్నీ ఎండుతున్నాయి. ఇవన్నీ ఇలా ఉన్నా, సామూహిక సాధనాత్మక పరిశ్రమ కొనసాగితే,

**పర్యావరణ పరిరక్షణలోనే ఇహపర శ్రేయస్సు**

ఈ విపత్తులన్నీ తొలిగిపోతాయి అంటారు గురువుగారు. అన్నిటి కన్నా ముందు భగవంతునిపై నమ్మకముండాలి. తరువాత సాధనాత్మక జీవనశైలిని అలవర్చుకుని సామూహిక కృషి చేయాలి. సామూహిక సత్కర్మల ఫలం ఖచ్చితంగా లభిస్తుందని విశ్వసించాలి.

"గాయత్రీ మంత్రంలో 'నః' పదం వచ్చిందంటేనే అర్థం మనం ఒంటరిగా లేము, అందరం కలిసి ఉండమనే అర్థం. సామూహికంగా చేసే గాయత్రీ సాధన యొక్క సాధనాత్మక పరిశ్రమ బ్రహ్మాస్త్రంలాగా పని చేస్తుంది. గాయత్రీ మంత్రంలో అసత్తు నుండి సత్తు, చీకటి నుండి వెలుగు, అజ్ఞానం నుండి జ్ఞానం అందించగల ప్రత్యేకమైన శక్తి ఉంది. సామూహిక ప్రార్థన మొత్తం వాతావరణాన్ని కుదిపేయ గలదు. దుర్గ సామూహిక శక్తికి ప్రతీక. కాబట్టి సామూహిక గాయత్రీ సాధనా ప్రయోగాలు జరుగుతూ ఉండడం అవసరం. వాతావరణాన్నంతటినీ గాయత్రీమయం చేయాలి.

### స్థానిక శిబిరాల ద్వారా సామూహిక శక్తి జాగరణ

ఇదంతా ఆలోచించే స్థానిక సాధనా శిబిరాలు ఏర్పాటు దేశంలోని శక్తిపీఠాలన్నిటిలో జరుగుతోంది. సాధక కార్యకర్తల సాధన స్థాయిని అభివృద్ధిపరచటం కోసం మొదటి దశలో 24 శక్తి పీఠాల్లో 5 రోజుల సాధన శిబిరాలు ఏర్పాటు చేయబడతాయి, వీలైతే 108 మంది సాధకులతో అందరూ అక్కడే ఉంటారు, నిత్య సాధన, స్వాధ్యాయం, సత్సంగాలతో అక్కడే గడుపుతారు. ఇందులో పాలుపంచుకునే సాధకుల సాధనాత్మక స్థాయి పెరిగి వాతావరణంలో పరిశోధనతో పాటు కొత్త సృజన అనే బాధ్యతను కూడా తీసుకుంటారు. ఈ శ్రావణ మాసం నుండే ఇది మొదలు పెట్టాలని నిశ్చయించడం జరిగింది. ఇందుకు తగ్గ 50 శక్తి పీఠాలు ఎంపిక చేయబడ్డాయి. వీటిలో రెండు దశల్లో ఈ సాధనాక్రమం కొనసాగుతుంది. సాధకుల నివాసం, భోజనం, సాధనాది దిన చర్య యొక్క వ్యవస్థ శక్తిపీఠాలు స్వయంగా సమకూర్చుకోవాలి. కాబట్టి మొదట్లో 50 చోట్ల మాత్రమే జరగబోతోంది. వానలో నీరు వర్షించినట్టు, సాధనాత్మక శక్తి యొక్క వరాలు కురిసే క్రమం మొత్తం భారతదేశంలో కొనసాగాలనే ప్రయత్నం నిరంతరంగా సాగుతోంది. శిబిరాల్లో మంత్రజపం, జపంతో పాటు ధ్యానం, జీవన సాధనకు సంబంధించిన స్వాధ్యాయం, సమీక్ష లేఖనం, సాధనకు సంబంధించిన ప్రశ్నోత్తరాలు మొదలైనవి ఉంటాయి. "ప్రజ్ఞా అభియాన్" పాక్షిక పత్రిక ద్వారా విస్తృతంగా ఈ విషయం తెలియచేయబడుతోంది. ఈ శ్రమ ఖచ్చితంగా ఉజ్వల భవిష్యత్తును అవతరింపజేస్తుంది, మరియు దెబ్బతిన్న పరోక్ష జగత్తుకు సూక్ష్మంగా పరిచర్యలు చేస్తుంది. ఈ నమ్మకం దృఢంగా ఉండాలి.

*- అఖండజ్యోతి, ఆగస్టు 2013*
*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్, జయలక్ష్మి*

---

## భగవంతుడు ఎక్కడ ఉన్నాడు?

*ఒకరోజు రమణమహర్షిని, కొంతమంది భక్తులు ఇలా అడిగారు. "భగవంతుని మాకు దర్శింపజేయగలరా?". మహర్షి వారితో ఇలా చెప్పారు. "ఇది సంభవమే! దర్శింపజేయగలను. కాని భగవంతుని గుర్తుపట్టగలిగే కన్నులు కావాలి!" అంటూ కొంచెంసేపు ఆగి "ఒకవారము రోజుల పాటు వైభవంగా ఉత్సవం నిర్వహించినచో చిట్టచివరి రోజున భగవంతుడు వస్తాడు, ఆయనను గుర్తించి దర్శించుకోవాలి" అన్నారు. భక్తులు వెంటనే ఉత్సాహంగా ఉత్సవాలను ప్రారంభించారు. నిత్యం నామ సంకీర్తనలు చేస్తున్నారు. రమణమహర్షి కూడా అప్పుడప్పుడు వచ్చి కూర్చొని వెళ్తున్నారు. ఆఖరిరోజున పూర్ణాహుతి జరుపుచున్నారు. దీనికై రకరకాలైన వంటలు తయారుచేసి సిద్ధంగా ఉంచారు. మందిరానికి ఎదురుగా ఉన్న చెట్టు క్రింద మాసిన మురికి బట్టలు ధరించి ఒక కుష్ఠువ్యాధిగ్రస్తుడు నిలబడి ఉన్నాడు. మందిరంలో పంచబడుచున్న ప్రసాదము తనకు కూడా పెడతారనే ఆశతో ఎదురుచూస్తున్నాడు అతడు. ఒక వ్యక్తి ప్రసాదం తీసికొని ఆ కుష్ఠువానికి పెట్టటానికి బయలుదేరగా, మరొకడు అతనిని వారిస్తూ "ప్రసాదం భక్తుల కొరకు ఉద్దేశింపబడింది కాని, యాచకులకు, కుష్ఠువారికి కాదు అని కటువుగా పలికి ప్రసాదాన్ని వెనుకకు తీసికొని వెళ్ళారు. రమణమహర్షి ఈ దృశ్యాన్నంతా చూస్తూ ఉన్నాడు. పూజోత్సవ సప్తాహం ఆఖరి రోజున భక్తులు రమణమహర్షిని అడిగారు. "ఈరోజు సప్తాహం చివరి రోజు కదా! భగవంతుడు ఇంకా రాలేదేమి?" మహర్షి శాంతచిత్తుడై జవాబిచ్చాడు. "మందిరం వెలుపల నిలబడి ఉన్న కుష్ఠు రోగిని చూచారా? అతడే భగవంతుడు. మీరు ఆయనను గుర్తించలేదు. మందిర ప్రసాదాన్ని పంచే సమయమందు కూడా మీరు తరతమ భేదాలను పాటించారు." దీనిని విన్న వారంతా సిగ్గుతో తలవంచుకొన్నారు.*

*- అఖండజ్యోతి మే 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

---

## వృక్ష సంపదను కాపాడుకోవాలి

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం)

# సత్సాహస - సంఘర్షణ ప్రకరణం

**దుర్వాసమస్తు మహర్షిః సమాన్యతానాం సమర్థనమ్ ।**
**శృత్వా స్వానాం ప్రసన్నోఽభూద్వివశోః చిన్నత్తథా ॥ 87**

పరాక్రమము, సాహసము, సౌజన్యం, సత్ప్రవర్తన అనే గుణ గణాలు లక్ష్యసిద్ధికి తోడ్పడుతూ, మానవ జీవన పరిపూర్ణతకు తోడ్పడతాయి. ఋషులలో శ్రేష్ఠుడు, వరిష్ఠుడు అయిన దుర్వాస మహర్షి, ఎంతటి తపోనిష్ఠాగరిష్ఠుడైనా, కేవలం 'క్రోధం' కారణంగా బ్రహ్మర్షి స్థానాన్ని కోల్పోయి, తిరిగి సాధించడానికి ఎన్ని ప్రయత్నాలు చేయవలసి వచ్చిందో తెలుసుకుంటే, ప్రతి మనిషి తన 'కోపాన్ని' విడిచిపెట్టక తప్పదు. పాదంలో గల జ్ఞాననేత్రాన్ని కోల్పోవడం, అంబరీషుని కష్టపెట్టి, విష్ణువు యొక్క సుదర్శన చక్రాన్ని చూసి పారిపోవడం వంటి సంఘటనలు మనకు చక్కటి సందేశాన్ని అందిస్తాయి. ప్రసన్నచిత్తం, పరమార్థతత్త్వ శోధనలను అలవర్చుకోవడమే మనిషి చేయవలసిన పని.

**క్రోధావేశాచ్చ పంగుః స్యాన్నరోఽన్యాంధిక్షయేత్కిము ।**
**వికృతో జాయతేఽసిద్ధః కిం పరాన్ సాధయేదహో ॥ 88**

కోపము, ఆవేశము అనే దుర్గుణాలు మనిషి ప్రగతిని నిరోధించి కుంటివాడిగా చేస్తాయి. దానివల్ల అతడు లక్ష్యాన్ని చేరుకోలేడు. లక్ష్యసాధన, ఆత్మ సంశోధన, సంయమనం లేనివాడు ఇతరులకు ఎలా మార్గదర్శనం చేయగలడు? ఇతరులు అతనిని ఎలా అనుసరించగలరు? "తనకోపమే తన శత్రువు" అన్న 'సుమతి' శతక కర్త మాటలను మనం మన జీవితానికి అన్వయించుకుంటూ, అవినీతి, అన్యాయం, అధర్మం అనే చీకటి నుండి బయటకు రావాలి. అలా రావాలంటే 'ఆవేశం' ఉండరాదు. తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదు. నిదానంగా నిర్మల హృదయంతో, నిశ్చలతత్త్వంతో తనను తాను సంస్కరించుకుని ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలవాలి. అటువంటి సమయంలోనే ఇతరులు ఆ మార్గాన్ని అనుసరిస్తారు. గురుదేవులు తాము ఆచరించి, ఇతరులకు చూపిన మార్గమే ఇందుకు నిదర్శనం.

**సంశోధన విధౌ భావం గృహేత్వా సర్వదైవతు ।**
**చికిత్సకస్య రుగ్ణస్య స్నిగ్ధం పరుషమాచరేత్ ॥ 89**

మానవ ప్రవర్తనలో మార్పును తీసుకువచ్చే ప్రయత్నంలో కఠినతను పాటించాలి. రోగికి చికిత్సను అందించే ప్రయత్నంలో వైద్యుడు ఎలా 'పథ్యం' (ఆహార నియమాలు) వ్యాయామం, చేదు మందులను (రోగి ఇష్టంతో ప్రమేయం లేకుండా) ఇచ్చి, ఆరోగ్యాన్ని కాపాడతాడో, అలాగే మమకార, స్నేహ భావాలను తాత్కాలికంగా ప్రక్కనబెట్టి, క్రమశిక్షణకు ప్రాధాన్యమిచ్చినప్పుడే వ్యక్తి, వ్యవస్థలు బాగుపడతాయి. ఇతరులకు ఉపదేశించే ముందు శ్రీరామకృష్ణపరమహంస, తాను ముందుగా ఆచరించి, అనంతరం ఇతరులకు ఉపదేశ బోధ చేసినట్లు ప్రతివ్యక్తి పూనుకోవాలి.

**సమాప్తం పంచమం సత్రం తదారణ్యకమథాత్ర తే ।**
**శ్రోతారో బ్రహ్మవిద్యాయా మహత్త్వం మేనిరే భృశమ్ ॥ 90**

"పంచ దినముల ఆరణ్యకము" అనే ఈ అధ్యాయము ముగిసినది. దీనిని విన్నవారికి 'బ్రహ్మవిద్య' మహత్త్వం తెలియటమే కాక, ఆ తత్త్వము యొక్క అనుగ్రహము కలిగి బ్రహ్మజ్ఞానము పొందెదరని శాస్త్రము తెలుపుతోంది. ఈ 'పంచ దినముల' ఆరణ్యకమును దుర్వాసుల వారి బోధలను మానవ జీవితములో అన్వయించుకోవాలి. అపుడే మానవజన్మకు సార్థకత కలుగుతుంది.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం ప్రజ్ఞోపనిషద్ నుండి*
*అనువాదం: సాధన నరసింహాచార్య*

## సత్పురుషుల కుటుంబాలు

*వివిధ క్షేత్రాలలో విశిష్ట కార్యాలు చేస్తున్న మహా మానవులను రాష్ట్రీయ, అంతరాష్ట్రీయ స్థాయిలో అధ్యయనం చేయగా ఇంచుమించు అగ్రశ్రేణికి చెందిన వారందరు కుటుంబ బాధ్యతలను, కుటుంబాలను కూడా చాలా పరిమితంగా ఉంచుకొన్నట్లు తేలింది.*

*భారతీయ స్వాతంత్ర్య సంగ్రామంలో పాలు పంచుకొన్న అగ్రశ్రేణి నాయకులలో కొంతమంది వ్యక్తులు అసలు సంతానాన్ని కననివారు కూడా ఉన్నారు. మదన మోహన మాలవ్యా, లోకమాన్యతిలక్, నెహ్రూ, రాజగోపాలచారి, ఆచార్య కృపలానీ, పటేల్ వంటి అనేక మంది మహనీయులు కుటుంబాలను అతి చిన్నవిగా ఉంచుకొని అవసరాలను పరిమితం చేసుకొన్నారు. వారు ఆ విధంగా ఆత్మ సంతోషాన్ని, లోకమంగళాన్ని దృష్టిలో ఉంచుకొని ఎంతో సాధించటమే గాక పూర్ణ సాఫల్యాన్ని పొందగలిగారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**చెట్లు నాటడం మానవ మనుగడకు అత్యంత అవసరం**

# నరసింహ శతకం-నవనీత సూక్తం - 2

మానవునిగా జన్మ పరిపూర్ణతను పొందాలంటే భగవంతుని అనుగ్రహం ఒక్కటే మార్గం. భగవంతుని అనుగ్రహం పొందాలంటే నవవిధ భక్తి మార్గాలే శరణ్యం. అందులో కీర్తనం 'స్మరణం' అనే మార్గం శ్రేష్టమైనది. అందుకే నారద, తుంబురాది మునులు, ప్రహ్లాదుడు, హనుమంతుడు వంటి భక్తులు, త్యాగయ్య, రామదాసు, క్షేత్రయ్య, అన్నమయ్య మొదలైన వాగ్గేయకారులు ఈ మార్గాన్ని ఎంచుకుని తరించారు.

"మననాత్ త్రాయతే ఇతి మంత్రః" అంటే "మననం" చేస్తే చాలు ఆ భగవంతుడు తక్షణం అనుగ్రహించి రక్షిస్తాడని నమ్మకం. అందుకే గోవిందనామ స్మరణ, రామనామ స్మరణల ద్వారా ముక్తి మార్గ సాధకులవుతారు భక్తులు.

శేషప్ప కవి ఆ అమృతతత్త్వ మంత్ర పఠనా శక్తిని గురించి ఇలా వివరించారు.

*సీ॥ నరసింహ! నీ దివ్యనామమంత్రము చేత*
*దురిత జాలములెల్ల - ద్రోలవచ్చు*
*నరసింహ! నీ దివ్యనామమంత్రము చేత*
*బలువైన రోగముల్ - పాపవచ్చు*
*నరసింహ! నీ దివ్యనామమంత్రము చేత*
*రిపు సంఘముల సంహరించవచ్చు*
*నరసింహ! నీ దివ్యనామమంత్రము చేత*
*దండహస్తుని బంట్ల - దరమవచ్చు*

*తే॥ భళిర! నేనీమహామంత్ర - బలము చేత*
*దివ్యవైకుంఠ పదవి సాధింపవచ్చు*
*భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస*
*దుష్ట సంహార! నరసింహ! దురితదూర ॥*

ఓ నరసింహ స్వామీ! నీ నామ మంత్ర జపం వల్ల సర్వ పాపములు నాశనమవుతాయి. ఇక్కడ సర్వపాపములు (దురిత జాలము) అంతే 1) బ్రహ్మ హత్య 2) శిశు హత్య 3) స్త్రీ హత్య 4) గో హత్య 5) గురు హత్య అనే పంచ మహాపాతకాలు తొలగించ బడతాయి. 'అజామీళుడు' అనే క్రూర రాక్షసుడు కేవలం 'నారాయణ' నామ ఉచ్చారణ చేతనే శ్రీకృష్ణ పరమాత్మని అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. ప్రహ్లాదుడు నృసింహ రూప సాక్షాత్కారాన్ని కేవలం విష్ణునామ స్మరణ ద్వారా పొందాడు. గజేంద్రుడు కూడా ఆ కోవకు చెందినవాడే. కాబట్టి మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధిగా భగవంతుని నామజపం చేసినప్పుడు ఆ దేవదేవుని అనుగ్రహం తప్పక సిద్ధిస్తుంది.

నామస్మరణం వల్ల దీర్ఘకాలంగా బాధించే రోగాలు (దేహ సంబంధమైనవి, మనస్సుకు సంబంధించినవి) మటుమాయ మవుతాయి. ఔషధాలకు లొంగని వ్యాధులు సైతం తొలగిపోతాయి. అలాగే "రిపు సంఘములు" అంటే శత్రు సమూహములు. అరిషడ్వర్గాలు "కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము" మానవ మనస్సుపై ప్రభావం చూపకుండా ఉండాలంటే, దానికి దైవనామ స్మరణమే శరణ్యం. దివ్య "వైకుంఠపదప్రాప్తికి" (పునర్జన్మ భయంలేని రీతిలో) వైకుంఠాన్ని చేర్చగలిగేది మంత్రోచ్చారణ మాత్రమే అన్న సత్యాన్ని అర్థవంతమైన రీతిలో వివరించిన శేషప్ప కవి నిత్యస్మరణీయుడు.

*సీ॥ ఆది నారాయణ! యనుచు నాలుక తోడ*
*పలుక నేర్చినవారి పాదములకు*
*సాష్టాంగముగ నమస్కారమర్పణ జేసి*
*ప్రస్తుతించెదనయ్య బహువిధముల*
*ధరణిలో నరులెంత దండివారైనను*
*నిన్ను గానని వారినే స్మరింప*
*మేము శ్రేష్ఠుల మంచు మిదుకుచుండెడివారి*
*చెంతజేరగ బోను శేషనయన*

*ఆ॥ పరమసాత్త్వికులైన నీ భక్తవరుల*
*దాసులకు దాదుడను సుమీ! ధరణిలోన*
*భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!*
*దుష్ట సంహార! నరసింహ! దురితదూర ॥*

– సాధన నరసింహాచార్య

## జాగరూకుడై ఉండాలి

*దౌర్భాగ్యం మనిషి తలుపుని తెరుచుకునేంత వరకు తడుతూనే ఉంటుంది. కానీ సౌభాగ్యం ఒక్కసారి తలుపు తట్టి నెమ్మదిగా వెళ్ళిపోతుంది. అందువలన మనం మంచి అవకాశం కొరకు ఎదురు చూస్తుండాలి, జాగరైకుడివై ఉంటాలి.*

*– అఖండజ్యోతి, జూన్ 1993*
*అనువాదం: అరుణా సీతారాం*

**వృక్షాలు మనిషికి జననం నుండి మరణం వరకు తోడుగా ఉంటాయి**

మెస్మరిజం-4

# మెస్మరిజం యొక్క తత్వ్యజ్ఞానం

మెస్మరిజం విద్యను అనుసరించి ఉత్పన్నయ్యే శక్తికి మూడు ఆధారాలుంటాయి. 1. ఇచ్ఛాశక్తి (will power), 2. ఆదేశము (suggestion), 3. మార్జనము (passes). మెస్మరిజంను ప్రయోగించేవారు ఈ మూడు సాధనల ద్వారా ఆశ్చర్యకరమైన ఫలితాలను పొందుతారు. మనమిప్పుడు ఈ మూడు సత్యములను గురించి తెలుసుకుందాము.

**1. ఇచ్ఛాశక్తి (will power) :** ఈశ్వరుడు ఒక్కడినే అనేకం అవుదునుగాక!' అని కోరుకున్నాడు. ఫలితంగా ఈ సృష్టి రచింపబడింది. ఈ ఇచ్ఛ కారణంగానే మానవుడు స్వర్గము- నరకము, బంధము- మోక్షము, జననము- మరణము అనే చక్రములలో తిరుగుతూ ఉంటాడు. ప్రపంచంలోని కదలికలన్నీ సంకల్పం ఆధారంగానే జరుగుతున్నాయి. ఎక్కడ ఏ పని జరిగినా ఇచ్ఛ కారణంగానే జరుగుతున్నది. చైతన్యము కలిగిన ప్రాణుల చేతనత్వము ఇచ్ఛతోనే కలిసి ఉంటుంది. వారందరికీ ఏదో ఒక కోరిక ఉంటూనే ఉంటుంది. ఆ ప్రేరణ చేతనే వారు శారీరిక, మానసిక క్రియాకలాపాలను జరుపుతుంటారు. ఇచ్ఛ, చేతనత్వము రెండూ ఒకదానినుండి మరొకదాన్ని విడదీయలేని తత్వములు. అఖిల విశ్వ బ్రహ్మాండమంతటా పనిచేస్తున్న చేతనత్వమంతా సంకల్పమయమే. సంకల్పము శాంతించగానే చేతనత్వము కూడా సమాప్తమైపోతుంది.

టి.డి. బ్రేనే అనే వైజ్ఞానికుడు జడప్రకృతికి చెందిన అతి సూక్ష్మపరమాణువునందు ఉండే ఎలక్ట్రాన్‌లో లండన్ వంటి మహా నగరాలను కూడా క్షణకాలంలోనే భస్మము చేయగలిగేంత శక్తి ఉంటుంది అని కనుగొన్నాడు. జడప్రకృతికి చెందిన పరమాణువుల యందున్న ఈ శక్తి ఎంతో లెక్కించడం జరిగింది. అయితే చైతన్య జగత్తుకు సంబంధించి ఏదైనా ఒక పరమాణువును అన్వేషించిన తరువాత దానియందున్న శక్తి జడపరమాణువుకు ఉన్న శక్తి కంటే వేయి రెట్లు ఎక్కువని తెలుస్తుంది. **జడపదార్థములపై చైతన్యముదే సంపూర్ణ అధికారము.** ఏది చైతన్యమును కలిగి ఉన్నదో అది తనకున్న సామర్థ్యము వలన జడపదార్థములను ఇష్టము వచ్చినట్లు ఉపయోగించుకోగలుగుతుంది. దీనివల్ల చైతన్యమునందు జడము కంటే అధికశక్తి, ఉన్నతస్థాయిశక్తి ఉన్నదని మనకు అర్థమౌతుంది.

చైతన్యమున్న ప్రాణులన్నింటిలోకి మానవుడు సర్వశ్రేష్ఠుడు. అతనియందు సామాన్య జీవధారులయందుండే చేతనత్వముతో పాటు ఉన్నతస్థాయిలో వికసించిన ఆత్మచేతన కూడా ఉంటుంది. ఈ చేతన్వమునందు అపరిమితమైన బలం ఉంటుంది. వికాస క్రమమును ప్రతిపాదించిన డార్విన్ మహాశయుడు మాంసాహారము తినే పక్షులకు కనపడకూడదనే కోరిక వల్ల సీతాకోక చిలుక రంగు రంగుల రెక్కలను తయారుచేసుకుందని వివరించారు. చెట్లక్రింద నీడకోసం విశ్రమించేటప్పుడు ఇతరులు తమని గుర్తు పట్టకూడదనే ఇచ్ఛవల్ల జీవులు తమ శరీరము యొక్క రంగును మార్చుకుంటాయి. గడ్డిలో దాక్కునే జీవులు ఆ రంగులోకే మారిపోతాయి. ఇలా చిన్నచిన్న జీవులు కూడా ఇచ్ఛ (తీవ్రమైన కోరిక) మూలంగా పెద్దపెద్ద పరివర్తనలు తీసుకురావడములో సఫలీకృతమైనాయని మనకు తెలుస్తుంది. మరి మానవుని సంగతి వేరే చెప్పాలా? అతని ఇచ్ఛాశక్తి నిర్జనమైన, ఏకాంతమైన, ఎగుడుదిగుడు భూములను కూడా కళకళలాడేలా చేసింది. దానితో ఈ పృథ్వి రకరకాల అద్భుతమైన ఆవిష్కరణలతో, కళా కౌశలములతో విచిత్రంగా మారిపోయింది. ఒకప్పుడు మండుతున్న గోళంవలె ఉండే పృథ్విని ఇప్పటి పచ్చదనముతో కళకళలాడుతున్న ఈ పృథ్వితో పోల్చుకుంటే మానవుని యొక్క ఈ సంకల్పబలానికి, రచనాత్మకశక్తి యొక్క గొప్పతనానికి ఆశ్చర్యచకితులు అవుతారు. మానవుడు ఇప్పటిదాకా చూపించిన శక్తి కొంచెమే, ఇంకా బయటపడని ఎన్నో రెట్ల శక్తి అతనిలోనే దాగి ఉంది.

**నిస్సందేహంగా సంకల్పశక్తి చాలా గొప్పది. ఇంకా చెప్పాలంటే అది అన్నింటికంటే గొప్పది.** ఇచ్ఛాశక్తి బలము వల్లనే జీవుడు మహత్తరమైన కార్యములను చేస్తాడు. అటువంటప్పుడు మెస్మరిజం ప్రయోగం చేయడము అనే యోగ్యతను సంపాదించడం అతనికి చాలా సులభమైనది, సాధారణమైనది. 'కోరిక'–'ఇచ్ఛ' అనేవి రెండూ వేరువేరు విషయాలు. 'కోరిక'లో ఆడంబరాలతో కూడిన ఊహలే తప్ప పెద్ద విశేషమేమీ ఉండదు. దీనివల్ల శక్తి ఉత్పన్నం కాదు. ఇచ్ఛాశక్తి వెనుకనైనా ఏకాగ్రత, గాంభీర్యం, ధృఢత్వము, తత్పరత, తీవ్రత, ప్రయత్నశీలత ఉంటేనే అది ఫలితాన్నిస్తుంది. అది నిష్ఫల మయ్యేందుకు అవకాశమే లేదు. శ్రీమతి ఒ. విష్ణుహారా మానసిక శక్తులను గురించి వివరిస్తూ 'మస్తిష్కములో తీవ్రమైన ఇచ్ఛాశక్తితో కూడిన భావనలేవైతే ఉత్పన్నమవుతాయో వాటినుండి చాలా

**సమస్యలు ఎదురైతే వాటిని సవాలుగా తీసుకోవాలి**

శక్తివంతమైన తరంగాలు ఉత్పన్నమవుతాయి' అని నిరూపించారు. ఈ తత్వాలు ఈథర్‌తత్వములోపలికి అత్యంత వేగంగా వెళ్ళిపోయి కోరుకున్నది జరిగేందుకు అవసరమైన పరిస్థితులను నిర్మిస్తాయి. ఇంకా ఆవిడ అభిప్రాయం ప్రకారం ఏ వస్తువు లేదా పనిపట్ల మనకు తీవ్రమైన ఇచ్ఛ కలుగుతుందో ఆ ఇచ్ఛయొక్క విద్యుత్తరంగాలు నియమిత స్థానానికి చేరుకుని కావలసిన అనుకూలతను నిర్మిస్తాయి. మనోవైజ్ఞానిక సిద్ధాంతాన్ని అనుసరించి తీవ్రమైన ఇచ్ఛయందు ఇతరులను ప్రభావితం చేయగలిగేంతటి శక్తి ఉంటుంది. **తులసీదాసు శ్రద్ధ మరియు విశ్వాసములను భవాని, శంకరులతో పోల్చారు.** భగవంతుడైన ఉమాశంకరుడు సర్వశక్తివంతుడు. శ్రద్ధ మరియు విశ్వాసముల యొక్క ప్రచండశక్తిని ఎవరు కాదనగలరు?

విజ్ఞులైన పాఠకులందరికీ సంకల్పశక్తి గురించి తెలిసే ఉంటుంది. మన యొక్క భావనలలోని తీవ్రత ద్వారా భగవంతుడు ప్రత్యక్షమవుతున్నప్పుడు మెస్మరిజం అనే యోగ్యత మనకు ఖచ్చితంగా అలవడుతుందనడంలో ఎటువంటి సందేహము లేదు. భూతద్దం ద్వారా పడే సూర్యకిరణాలను ఏకత్రితం చేస్తే అగ్ని ఉత్పన్నమౌతుంది. మొత్తం శరీరమంతటా వ్యాపించిన శక్తులన్నింటినీ ఒకే స్థానంపై ఏకత్రితం చేసి మరోచోటికి వాటిని విసరగలిగితే ఆ తాడనము అసాధారణరీతిలో ఉంటుంది. మెస్మరిజం ప్రయోగించేవారు తీవ్రమైన సూక్ష్మశక్తితో మానసికశక్తులన్నింటినీ ఏకీకృతం చేసి ఏ వ్యక్తిమీదైనా ప్రయోగిస్తే ఆ దెబ్బ వృధాగా పోదు కానీ నెమ్మదిగా ప్రభావమును చూపిస్తుంది. ఈ ప్రభావాన్నే ప్రజలు "మెస్మరిజం యొక్క చమత్కారము" అని పిలుస్తారు.

**2. ఆదేశము (suggestion) :** మానవుడు బంకమట్టిలాంటి వాడు. అతడిని ఎలా కావాలంటే అలాగ మలుచుకోవచ్చు. పాలు త్రాగే పసివాడు తనను పోషించే వారి భాషనే నేర్చుకుంటాడు. వారివలెనే ఆలోచిస్తాడు, గ్రహిస్తాడు, నడుచుకుంటాడు. పాకీపని చేసేవాని బిడ్డకు మురికిని చూస్తే అసహ్యం కలగదు. కానీ అగ్రవర్ణములో పుట్టిన బిడ్డకు అలాంటి స్వభావముండదు. ఈ తేడా ఎందుకు? దీన్ని గురించి అన్వేషించిన మీదట పాకీవాని పిల్లవాడిపై ఏ వ్యక్తుల ప్రభావము ఉన్నదో వారు మురికిని చూసి అసహ్యించుకోరు కనుక ఆ పిల్లవాడు తన మార్గదర్శకుల ప్రభావమును స్వీకరించాడు. అదేవిధంగా అగ్రవర్ణానికి చెందిన బాలుడు తన సంరక్షకుల ప్రభావమును గ్రహించి ఆ ప్రకారమే నడుచుకుంటాడు.

మానవుని నిర్మాణము ఆదేశములతోనే జరుగుతుంది. ఎవరు ఏ వాతావరణంలో, ఆలోచనలలో ఏ పరిస్థితుల్లో పెరిగారో వారు ఆ విధంగానే తయారవుతారు. ఒకసారి ఆఫ్రికాలో ఒక తోడేలు ఒక మానవబాలుడిని ఎత్తుకెళ్ళింది. అద్భుతమేమిటంటే అది వాడిని తినకుండా పెంచింది. చాలా రోజుల తరువాత కొంత మంది వేటగాళ్ళు ఆ పిల్లవాడిని తోడేళ్ళ గుంపులో చూసి ఆశ్చర్య పోయారు. వాడు అచ్చంగా తోడేళ్ళవలెనే నాలుగుకాళ్ళతో నడవడం, ఎగరడం, వేటాడి పట్టుకొని పచ్చి మాంసం తినడం చేస్తున్నాడు. వాళ్ళు ఆ పిల్లవాడిని మానవతత్వ పరిశోధకుల ప్రయోగశాలకు అప్పగించారు.

ప్రస్తుతం వైజ్ఞానికులందరు 'మానవుడు ఒక తెల్లని కాగితం వంటివాడు, దానిపై ఏది వ్రాసి ముద్రిస్తే అదే అచ్చవుతుంది' అనే అభిప్రాయానికి వచ్చి కొంతమంది పిల్లలను వేరువేరు గదుల్లో ఉంచి పరీక్షిస్తున్నారు. వీరి పాలనపోషణ అంతటినీ చూసు కునేందుకై విజ్ఞత కలిగిన వైజ్ఞానికులు సంరక్షకులుగా నియమింప బడ్డారు. వారివద్దకు వీరు తప్ప మిగిలిన వారెవ్వరూ వెళ్ళలేరు. ఈ ప్రయోగము ద్వారా ఆ పిల్లలను ప్రస్తుతమున్న మానవులకంటే అన్ని విధాలా వేరుగా ఉండే ఆలోచనలు, విశ్వాసాలు, శక్తులున్న వారిగా తయారుచేయాలని చూస్తున్నారు. వైజ్ఞానికులు ఇందులో విజయం సాధిస్తామనే పూర్తి నమ్మకంతో ఉన్నారు.

సాంగత్యము యొక్క ప్రభావమును ఎవ్వరూ కాదనలేరు. సాంగత్యము యొక్క ప్రభావమును మానవుడు గ్రహిస్తాడు. ఎవరు ఆ ప్రభావమును తమపై పడనివ్వరో వారు మహాత్మాగాంధీ వంటి మహాపురుషునితో పాటు ఉన్నా కూడా తమ దుర్మార్గము స్వభావమును వదిలించుకోలేరు. స్వీకరించేవారు దూరంగా ఉన్నప్పటికీ ప్రభావమును గ్రహించగలరు. 'ఏకలవ్యుడు' అనే భిల్లుడు దూరంగా ఉన్న గురువు యొక్క మూర్తిని తయారుచేసి ఆ ప్రతిమ ద్వారానే విలువిద్యను నేర్చుకున్నాడు. 'సాంగత్యము' అంటే దగ్గరగా కూర్చోవడమని అర్థము చేసుకోకూడదు. దగ్గరగా కూర్చోవడమనేది ఒక సాధనము మాత్రమే. ఒకవేళ అలా కూర్చున్నా ప్రభావం ఉండకపోవచ్చు. దూరంగా ఉన్నా ప్రభావం పడవచ్చు. ఇందుకు చాలా స్పష్టమైన కారణమే ఉంది. **నిజమైన అర్థంలో 'సత్సంగము' అంటే ప్రభావమును గ్రహించుట అని తెలుసుకోవాలి.**

'ప్రభావము' యొక్క శక్తి అద్భుతమైనది. దీనివల్ల మానవుడు ఏదైనా సాధించగలడు. మెస్మరిజం విద్యనందు 'ఇచ్ఛాశక్తి' తరువాతి స్థానం 'ప్రభావం' చూపే శక్తిది. దీనినే 'ఆదేశము' అని 'సూచనలు' (suggestion) అని అంటారు. ప్రభావము చూపించేందుకు

**ప్రతి అపజయాన్ని ఒక మెట్టుగా చేసుకొని ఎదగాలి**

ఆలోచనలపై దృష్టి సారించడం ముఖ్యం. నోటితో చెప్పకుండా ఆచరణ ద్వారా ప్రభావం చూపించవచ్చు. ఆచరణ యొక్క ప్రభావం లోతుగా పడుతుంది. ఎందుకంటే అందులో ఎటువంటి సందేహాలు ఉండవు. వాక్కు ద్వారా చెప్తే సందేహాలు కలుగుతూనే ఉంటాయి. అందుచేత కేవలం ఆలోచనలను ప్రభావితం చేయడంతోనే మెస్మరిజం చేసేవారి పని పూర్తికాదు. ఇతరులను ప్రభావితం చేయాలంటే వాక్కు, ఆచరణ రెండింటి సహాయమును తీసుకోవలసినదే.

తర్కము, అవిశ్వాసము, సందేహము వంటివి మనస్సులో తలెత్తితే ఇతరులు మనపై చూపే ప్రభావము నిరర్ధకమౌతుంది. ఈ విశ్వమునందున్న ఈథర్ తత్వములో రేడియోవాణి ప్రతిధ్వనిస్తూ ఉంది. కానీ రేడియో అనే యంత్రమును ఎవరు పెట్టుకుంటారో వారు మాత్రమే ఆ శబ్దములను వినగలుగుతారు. ఇదే విధంగా ఒకే వ్యక్తి యొక్క ప్రభావము ఎప్పుడూ ఒకేలా ఉన్నప్పటికీ ఎవరి మనస్సు గ్రహించేందుకు అనుకూలంగా ఉంటుందో వారు మాత్రమే దాన్ని గ్రహిస్తారు. అవిశ్వాసముతో కూడిన తర్కము, సందేహము యొక్క స్థానములో శ్రద్ధ, విశ్వాసము, స్వీకృతి వచ్చి చేరతాయి.

బాహ్యమనస్సు (objective mind) నందు తర్కము, సందేహముల యొక్క శక్తి ఉంటుంది. అంతర్ మనస్సు (subjective mind) నందు శ్రద్ధ మరియు విశ్వాసము నివసిస్తూ ఉంటాయి. అందుచేత మెస్మరిజం చేసేవారు తమ ప్రభావము చూపేందుకై ఒక అద్భుతమైన ఉపాయమును వాడుకలోకి తీసుకు వచ్చారు. వాళ్ళు ఒక విశేష ఆధ్యాత్మిక క్రియ ద్వారా బాహ్య మనస్సును నిద్రావస్థలోకి పంపిస్తారు. అందువల్ల తర్కమునకు, సందేహమునకు ఉన్న శక్తి క్షీణించిపోతుంది. తలుపులు తెరిచివుంటే ఇంటి లోపలికి ప్రవేశించడం తేలిక అవుతుంది. అదేవిధంగా తర్కము, సందేహము, వివేచనలను నిద్రింపచేస్తే అంతర్మనస్సు మీద సులభంగా ప్రభావం చూపడం సాధ్యమవుతుంది. సాధారణ జీవితంలో తర్కము, సందేహము అనేవి వస్తూనే ఉంటాయి కనుక మంచి, చెడు ప్రభావాలు పడుతుంటాయి. కనుక వివేకమును ఆధారముగా చేసుకొని వాటిని విశ్లేషించి ఏవి ఉపయోగపడతాయి అనేది బాగా పరీక్షించి నిర్ధారించుకొని వాటిని స్వీకరించి, నచ్చని ప్రభావాలను బైటికి త్రోసివేయడం నేర్చుకోవాలి. అయితే మెస్మరిజంలో తర్కమునకు వీలు కలిగించే మనస్సును నిద్రావస్థ లోకి పంపుతాము కనుక అక్కడ ఆ సమస్య ఉండదు. మెస్మరైజ్ చేసే వ్యక్తి తన ప్రభావము నేరుగా ఎదుటి వ్యక్తి అంతర్మనస్సు మీద పడేలా చూస్తాడు. అంతర్ మనస్సులో ఉండే విశ్వాసాల ఆధారంగానే ప్రతి ఒక్కరి శారీరిక మరియు మస్తిష్కము యొక్క క్రియాకలాపాలు జరుగుతుంటాయి. మెస్మరిజం ద్వారా నిద్రించిన మనిషి యొక్క క్రియలన్నీ అతనిపై పడిన ప్రభావమును అనుసరించే జరుగుతాయి. ఏ వ్యక్తి మెస్మరిజం చేయబడి నిద్రాస్థితిలో ఎప్పటిదాకా ఉంటాడో అప్పటిదాకా అతడు సంపూర్ణంగా ప్రభావితుడై ఉంటాడు. నిద్రావస్థ నుండి లేచిన తరువాత కూడా ఆ సంస్కారాలన్నీ బీజరూపంలో మనస్సు పైన ఆవరించి ఉంటాయి. ఈ విజ్ఞానము ప్రకారమే ఆదేశము (suggestion) యొక్క శక్తిని ప్రయోగించడం జరుగుతుంటుంది. వాక్కు ద్వారా సూచనలు, ఆజ్ఞలు ఇచ్చి కావలసిన పని చేయించు కోవడం జరుగుతుంటుంది. ఈ 'ఆదేశమే' మెస్మరిజం యొక్క రెండవ సత్యము.

**3. మార్జనము (passes) :** ఎన్నో వైజ్ఞానిక పరీక్షల అనంతరము మానవ శరీరమునందు నిరంతరము ఒక విద్యుత్ప్రవాహం ప్రవహిస్తూ ఉంటుందని నిర్ధారించారు. కొంతమంది దానిని జీవవిద్యుత్ లేదా ఆరా (aura) అని పిలుస్తారు. భారతీయశాస్త్రముల యందు దీనినే 'ఓజస్సు' అని పిలుస్తారు. డా॥ మెస్మర్ దీనికి యానిమల్ మాగ్నటిజమ్ అని పేరు పెట్టారు. విశేషమైన యంత్రాల సహాయముతో చూస్తే మానవశరీరము చుట్టూ 6 అంగుళాల మేరకు వ్యాపించి ఉన్న కాంతివలయము కనపడుతూ ఉంటుంది. ఆంగ్లములో దీన్నే 'ఆరా' అంటారు. దేవీదేవతల చిత్రపటాల చుట్టూ సూర్యునివంటి తేజోమండలమును చిత్రిస్తారు. అంటే భారతీయ వైజ్ఞానికులకు ప్రాచీనకాలము నుండి ఈ విద్యుత్ తేజము గురించి తెలుసు. శరీరమున ఉన్న మిగిలిన అంగములకంటే ముఖంపై ఈ తేజస్సు అధికంగా ఉండి ఎక్కువ దూరం వ్యాపించి ఉంటుంది.

ఈ దిశగా డా॥ మెస్మర్ మరో అన్వేషణ చేశారు. దాని ద్వారా ఈ తేజస్సు చేతివ్రేళ్ళ కణుపులయందు కూడా ఎక్కువగా ఉంటుందని తెలుసుకున్నారు. నక్షత్రవిద్యయందు ప్రసిద్ధిచెందిన విఖ్యాత అంతరిక్షవేత్త, విజ్ఞుడు అయిన మి. జెస్‌వెట్ ఫాదర్ ఇనుముకున్న అయస్కాంతశక్తి సహాయముతో కఠినమైన రోగాలను కూడా నయం చేస్తుండేవాడు. డా॥ మెస్మర్ ఆయనను కలిసి చికిత్సా విధానంలో అయస్కాంత శక్తికి ఏ విలువా లేదు, చేతివ్రేళ్ళ నుండి ప్రవహించే మానవీయ విద్యుత్ ప్రవాహముతోనే రోగాలు తగ్గుతున్నాయి అని నిరూపించారు. కొన్ని విశేషమైన కెమేరాల ద్వారా తీసిన ఫొటోలయందు చేతివ్రేళ్ళ చుట్టూ ఉండే 'ఆరా' ఎంతో దూరం దట్టంగా వ్యాపించి ఉన్నదని గమనించారు. ఇనుముతో చేసిన సూది వ్రేళ్ళకు అతుక్కోదు, అయినప్పటికీ

**విపత్కర పరిస్థితులలో ముందుండి నడిపించేవాడే నాయకుడు**

(వ్రేళ్ళ యందు ఇనుముకు ఉన్నన్ని ఆకర్షణ గుణాలు తగు మోతాదులో ఉన్నాయి.

విద్యుత్ అనేది స్వభావసిద్ధంగానే కదలికలను కలిగించి ప్రభావమును చూపగలిగేంతటి శక్తిని కలిగి ఉంటుంది. మానవ శరీరమునందు ఉండే విద్యుత్ ఎటువంటి చమత్కార ప్రభావములను చూపిస్తుందో ఆ వివరాలన్నీ మేము మా 'మానవీయ విద్యుత్ యొక్క చమత్కార్', 'పరకాయప్రవేశము' అనే (హిందీ) పుస్తకముల యందు చెప్పాము. ఆ విషయాలన్నింటినీ మరల ఇక్కడ వివరించ వలసిన అవసరం లేదు. మేము క్లుప్తంగా ఒక విషయం చెప్పాలను కుంటున్నాము. అదేమిటంటే 'విద్యుత్ యొక్క సహాయముతో కఠినమైన రోగాలను కూడా నయం చేయవచ్చు'. మేము వ్రాసిన 'ప్రాణచికిత్సా విజ్ఞానము' అనే పుస్తకమును ఎవరు చదివి ఉంటారో వారికి ఈ విద్య గురించి చక్కగా తెలిసే ఉంటుంది. మెస్మరిజం విద్య ద్వారా వ్రేళ్ళ కొనలతో మార్జనము చేసి పాస్ (pass) చేయడమనే మూడవవిధానము ఉంది. ఈ విధానములో ప్రయోగము చేసేవారు తన శరీరమునందలి విద్యుత్‌ను ఇతరుల శరీరమునందు ప్రవేశపెడతారు. డాక్టరు ఇచ్చిన ఔషధము కడుపులోకి వెళ్ళిన తరువాత విభిన్న రకాల ప్రభావములను చూపిస్తుంది. కొందరికీ నీళ్ళవిరోచనాలు రావచ్చు, కొందరికి నిద్ర రావచ్చు, కొందరికి రక్తశుద్ధి జరగవచ్చు, కొందరికి కఫ ప్రభావము పూర్తిగా పోవచ్చు. ఇలా ఎన్నో రకాలుగా శరీరమును శుభ్రపరిచిన తరువాతనే రోగము తగ్గుతుంది. ఏ ప్రక్రియ వల్ల నిద్ర, చైతన్యము, మానసిక సంఘర్షణ, శారీరికమైన గందర గోళము అనేవి జరుగుతాయో మెస్మరిజం చేసే వ్యక్తి తెలుసుకొని ఉంటాడు. తన విద్యుత్‌శక్తి యొక్క విధివిధానములను అనుసరించి ఇతరులపై ప్రయోగము చేసి కావలసిన ఫలితాలను పొందుతాడు. ఇదే మెస్మరిజం యొక్క మూడవ సత్యము. మార్జనక్రియకు ఇదే ఆధారము.

పైన చెప్పినట్లు మెస్మరిజం యొక్క మూల, ముఖ్య సత్యాలైన ఇచ్ఛ, ఆదేశము, మార్జనములపై ఇప్పుడు కొద్దిగా దృష్టి సారించడం జరిగింది. ఇది తెలుసుకోవడం వల్ల ఇతరులపై మెస్మరిజం యొక్క ప్రభావమును ఎలా చూపించాలో పాఠకులకు సులభంగా అర్థమవుతుంది. తగరపు పూత పూయబడిన రెండు రాగితీగల ద్వారా A.C, D.C, currentను ప్రవహింపచేసి వాటిని కలిపితే భౌతిక విద్యుత్ ఉత్పన్నమవుతుంది. కానీ ఆత్మికవిద్యుత్‌కు ఇచ్ఛ, ఆదేశము, మార్జనము అనే మూడు ముఖ్యమైన విద్యుత్ప్రవాహాలున్న తీగలను కలిపి సమన్వయపరచాలి. ఇవన్నీ ఒక స్థానంలో ఏకత్రితమై, ఒకదానినొకటి స్పృశించుకున్న తక్షణమే కదలికలను కలిగించే విద్యుత్ప్రవాహాలు మొదలవుతాయి. తెలివైన మెస్మరైజర్ అయితే కనుక దీని యొక్క 'ఋణాత్మక', 'ధనాత్మక' భాగాలను వైజ్ఞానిక పద్ధతి సమ్మతించిన విధానములో కలిపి ఉపయోగించి తన సామర్థ్యాన్ని చూపిస్తాడు. క్లుప్తంగా ఇదే మెస్మరిజం యొక్క తత్వజ్ఞానము.

*- అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## కార్యకర్తల శిక్షణ శిబిరం

గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్ వారి సారథ్యంలో గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్ వారి మాధ్యమంగా 07.10.2013 నుండి 11.10.2013 వరకు ఐదురోజుల ఉచిత శిక్షణా శిబిరం నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠంనందు నిర్వహించబడుతున్నది. 108 మందికి మాత్రమే ప్రవేశం. జాతి, మత, కుల, లింగ భేదం లేకుండా అందరికీ ఆహ్వానం.

సమయదానం నెలకు కనీసం 10 రోజులు అంతకు మించి ఇవ్వగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. వారి వారి నివాస స్థానాలకు దగ్గరలో ఉన్న కేంద్రాలకు వారు సమయాన్ని ఇవ్వాలి.

**శిక్షణాంశములు :**

1) సమయదానం - దాని ప్రాధాన్యత
2) పూజ్య గురుదేవుల సాహిత్య ప్రచారం - విధి విధానాలు
3) ప్రజ్ఞామండలులు ప్రారంభించుట - వాని నిర్వహణ - విధి విధానాలు
4) షోడశ సంస్కారాలు - వాని ఆవశ్యకత - వీనిపై గురు దేవులు అందించిన జ్ఞానము
5) గ్రామ వికాసము - స్వావలంబనం దిశగా చేపట్టవలసిన కార్యక్రమాల వివరణ - ఆచరణ

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు మీ పూర్తి వివరములతో గాయత్రీ చేతనా కేంద్రానికి హైదరాబాద్‌కు తెలియజేస్తూ 2013 సెప్టెంబరు 25వ తేదీలోగా మీ మీ పేర్లను నమోదు చేయించుకొనవలసినదిగా కోరడమైనది.

**ఇట్లు**
**ప్రధాన సంచాలకులు**
**గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్**
**వివరములకు సంప్రదించండి: 9949111175**

**మహనీయులు పనికి ముందు, పేరుకు వెనుక ఉంటారు**